ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Warangal, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-2-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 19 పేజీలు: 10+4 వెల: 6.50



బంగ్లాదేశ్ అధ్యక్షుడుగా మహ్మద్ యూనస్! 3

శ్రీలంకలో ఎంపిల పెన్షన్ల రద్దు 5


ప్రధాని మోడీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నేడు సదస్సుకు సిఎం హాజరు

## 'ఎఐ ఇంపాక్ట్' విందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



బుధవారం న్యూఢిల్లీలో మోడీ విందుకు హాజరైన వివిధ దేశాధినేతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి18:** ముంబైలో జరిగిన క్లైమేట్ వీక్ సదస్సులో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అక్కడి నుంచి నేరుగా బుధవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్నారు. దేశ రాజధానిలోని భారత్ మండపంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' లో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ ఏర్పాటు చేసిన ప్రత్యేక విందుకు సిఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సదస్సుకు ఓపెన్ ఏఐ సీఈఓ శ్యామ్ ఆల్ట్మాన్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ వంటి గ్లోబల్ టెక్ లీడర్లతో పాటు సుమారు 40 మందికి పైగా అంతర్జాతీయ కంపెనీల సీఈఓలు హాజరయ్యారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఐటీ మంత్రులు, 45కు పైగా దేశాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' >>2





బుధవారం హైదరాబాద్‌లో ప్రీ బడ్జెట్ సమీక్షలో డి.సిఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి

## రూ.లక్ష కోట్ల నిధులతో రహదార్ల నిర్మాణం

### రీజినల్ రింగ్ రోడ్డు కోసం హడ్కో నుంచి రుణం

### డి. సిఎం భట్టితో కలిసి కోమటిరెడ్డి ప్రీబడ్జెట్ సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి18:** తెలంగాణ రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల 2026-27 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సచివాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.గత ఏడాది బడ్జెట్, పనుల పురోగతి, విడుదలైన నిధులపై కూలంకషంగా మంత్రి కోమటిరెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో రోడ్లు, భవనాల శాఖ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. స్పష్టమైన ప్రణాళికతో వార్షిక బడ్జెట్ అంచనాలు ఉండాలని అధికారులను ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డు లాంటి గేమ్ చేంజర్ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 2047 రైజింగ్ >>2

# ఇక గ్రీన్ ఎనర్జీ విప్లవం

### నెట్ జీరో నగరంగా హైదరాబాద్

### గ్రీన్‌సోర్స్‌ల నుంచే 25% విద్యుదుత్పత్తి

### పట్టణాభివృద్ధిలో తెలంగాణను ఆదర్శం చేస్తాం

### 2047కు మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం అభివృద్ధి

### ముంబయి క్లైమేట్ వీక్ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




బుధవారం ముంబయి క్లైమేట్ వీక్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి18:** గ్రీన్ ఎనర్జీ ప్రపంచ పరిరక్షణకు లాభదాయకమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గ్రీన్ ఎనర్జీకి తాము ప్రోత్సాహిస్తున్నట్టు వెల్లడించారు. తెలంగాణ 30 లక్షలకు పైగా పంప్‌సెట్‌లు, దాదాపు 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఈ శక్తిని బొగ్గు, సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిరశక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తున్నామన్నారు. హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా తాము కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్(క్యూర్)లో దాదాపు పరిశ్రమలు ఉండవని స్పష్టం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'క్లైమేట్ వీక్' అంతర్జాతీయ సదస్సులో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. బాంద్రా కుర్లా జియో కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం జరిగిన ఈ సమావేశంలో దేశంలోని పట్టణాలు, నగరాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణమైన విధానాలపై >>2

## 37 రాజ్యసభ సీట్లకు మార్చి 16న ఎన్నికలు



### తెలంగాణ నుంచి సురేష్‌రెడ్డి, అభిషేక్ సింఘ్వీ టెర్మ్‌లు పూర్తి

### వారి స్థానంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, మను సింఘ్వీ?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి18:** రాజ్యసభస్థానాల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. తెలంగాణలోని రెండు స్థానాలు సహా 10 రాష్ట్రాల్లో 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 26వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్, మార్చి 16న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. తెలంగాణనుంచి సురేశ్‌రెడ్డి, అభిషేక్ సింఘ్వీలతో పాటు 37 మంది పదవీ కాలం ఏప్రిల్ నెలతో ముగియనుంది. మహారాష్ట్రలో 7(భగవత్ కిషన్‌రావు, ఫౌజియా తహసీన్, ప్రియాంక విక్రమ్, శరత్‌చంద్రగోవిందరావు, మోహన్ పాటిల్, రజనీ అశోక్‌రావు, రాందాస్ అతవాలా), ఒడిశా 4(మమతా, ముజిబుల్లా ఖాన్, సుజీత్‌కుమార్, నిరంజన్), తమిళనాడు 6(ఎన్ఆర్ ఎలాంగో, సెల్వరాజు, తంబిదురల్, తిరిచి శివ, కణిమొలి, జి.కె, వాసన్), పశ్చిమ బెంగాల్ 5(సాకేత్, రితాబ్రత, వికాస్‌రంజన్, మౌసమ్ నూర్, సుబ్రతా బక్షీ), అసోం 3(రామేశ్వర్, భువనేశ్వర్, అజిత్‌కుమార్), బీహార్ 5(ధారి సింగ్, ప్రేమ్‌చంద్, రామ్‌నాథ్, ఉపేంద్ర, నారాయణసింగ్), ఛత్తీస్‌గఢ్ 2(తేజ్‌పాల్‌సింగ్, ఫూలో దేవి), హర్యానా 2(కిరణ్ చౌదరి, రాంచందర్), హిమాచల్ ప్రదేశ్ 1(బాల గోస్వామి), తెలంగాణలో 2 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 26న నోటిఫికేషన్ విడుదల, మార్చి 5 నామినేషన్ దాఖలు చేయడానికి చివరి గడువు, మార్చి 6న నామినేషన్ల పరిశీలన, మార్చి 9వ తేదీ >>2

# ధరణి దోపిడిపై ఉక్కుపాదం

### తీగ లాగితే డొంక కదిలినట్లుగా ఉంది

### అక్రమాలపై కఠిన చర్యలు తప్పవు

### కోడ్ ఆడిట్‌కు ఆదేశాలు..

### రెవెన్యూ మంత్రి పొంగులేటి



బుధవారం అధికారులతో సమీక్ష చేస్తున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి18:** తీగ లాగితే డొంక కదిలినట్లుగా ధరణి పోర్టల్ వ్యవహారం ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజల ఆస్తుల రక్షణకు నిర్మించవలసిన వ్యవస్థనే ఆనాటి ప్రభుత్వంలోని కొంతమంది ప్రముఖులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకున్నారని మండిపడ్డారు. ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆసరాగా చేసుకొని స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన సంఘటనపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించగా దిగ్భ్రాంతి కరమైన అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. ఇది సాధారణ సాంకేతిక లోపం కాదని వ్యవస్థాగతంగా సృష్టించిన లోపాల ఫలితమని స్పష్టం చేశారు. బుధవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో ఉన్నతస్థాయి కమిటీతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాడు ధరణి పోర్టల్ సెక్యూరిటీ ఆడిట్ చేసిన సమయంలో గుర్తించిన లోపాలను సరిదిద్దకుండానే అంతా సవ్యంగానే ఉన్నట్లుగా నివేదిక ఇచ్చారని అలాగే మానవ ప్రమేయంతో తప్పులు చేసే విధంగా పోర్టల్‌ను రూపొందించారని, భూముల లావాదేవీలకు సంబంధించి అనుమానాస్పదంగా ఉన్న భూముల సమాచారం లభించకుండా లాగిన్‌లు డిలిట్ చేశారని, అత్యంత రహస్యంగా ఉండవలసిన లాగిన్ వివరాలు లేకుండా పోయాయని ఉన్నతస్థాయికమిటీ విచారణలో ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన భూలావాదేవీల సమాచారం లభించకుండా చేశారని,ఫోరెన్సిక్ ఆడిట్‌లో కోడ్ ఆడిట్ నిర్వహించలేదన్న విషయం బహిర్గతమైందని,ఈ నేపథ్యంలో తక్షణమే ధరణి పోర్టల్‌పై కోడ్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ధరణి పోర్టల్ నిర్వహణా బాధ్యతను టెర్రాసిస్ అనే విదేశీ సంస్థకు అప్పగించడం వల్లే >>2



బుధవారం బాల్క సుమన్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

## బాల్క సుమన్ అరెస్టు

### జైలుకు తరలింపు

### కాంగ్రెస్ కార్యకర్తలపై దాడి కేసు

**క్యాతన్‌పల్లి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో గత కొద్దిరోజులుగా ఉద్రిక్తత పరిస్థితులునెలకొన్నాయి. మంగళవారం క్యాతనపల్లి ఆర్ఓబి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద మంగళవారం జరిగిన ఘటనపై బీఆర్ఎస్ జిల్లా >>2



## దుస్తులు లాగినా అత్యాచార నేరమే

### సుప్రీంకోర్టు స్పష్టీకరణ

2



## దానం అనర్హత పిటిషన్‌పై స్పీకర్ విచారణ

### నాగేందర్ తరపున హాజరైన అడ్వకేట్లు

### నేడు కడియం అనర్హతపై విచారణ

### దానం పార్టీ మారారు: కౌశిక్‌రెడ్డి

### స్పీకర్ యేడాదిన్నరగా కాలయాపన: యేలేటి మహేశ్వర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి18:** ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులను విచారిస్తున్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ బుధవారం నాడు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటీషన్‌పై విచారణ చేపట్టారు. బిఆర్ఎస్ నుంచి అసెంబ్లీకి ఎన్నికైన దానం నాగేందర్ శాసనసభ్యత్వం రద్దు చేయాలని ఇదివరకే బిఆర్ఎస్ పార్టీ స్పీకర్ వద్ద పిటీషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. బిఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం నాగేందర్ కొంతకాలానికే వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా >>2

# లైఫ్ సైన్సెస్‌కు పవర్‌హౌస్ తెలంగాణ

### జిడిపిలో మన వాటాను 10 శాతానికి పెంచుతాం

### రాష్ట్రంలో ప్రస్తుతం రెండు వేలకు పైగా లైఫ్‌సైన్స్ సంస్థలు

### బయో ఎకానమీలో మూడో అతిపెద్ద శక్తిగా భారత్

### బయో ఆసియా 2026 ముగింపు వేడుకల్లో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ పవర్‌హౌస్‌గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో కేవలం రెండేళ్లలోనే (డిసెంబర్ 2023 జనవరి 2026) రూ. 73,360 కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, లక్ష ఉద్యోగాలను సృష్టించామని వివరించారు.బుధవారం హైటెక్స్‌లో "బయో ఏషియా 2026" సదస్సులో భాగంగా "తెలంగాణ రైజింగ్ 2047-బిల్డింగ్ ఏ వరల్డ్ క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకో సిస్టం" పేరిట నిర్వహించిన ఫైర్ సైడ్ చాట్, ముగింపు వేడుకలో ఆయన ముఖ్య అతిథిగాపాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ దేశ జిడిపిలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతోనే ప్రజలు, నిపుణుల భాగస్వామ్యంతో తెలంగాణ రైజింగ్ 2047కు శ్రీకారం చుట్టామన్నారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించేలా లైఫ్ సైన్సెస్ రంగం ఎకో సిస్టంను మరింత బలోపేతం చేసేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే తెలంగాణ నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ(2026-2030), తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్, 1బయో ఇంక్యూబేటర్, జీనోమ్ వ్యాలీ విస్తరణ, ఫార్మా విలేజెస్, తెలంగాణ లైఫ్‌సైన్సెస్‌ను మరింత బలోపేతం చేసేందుకుప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ భాగస్వామ్యం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల తయారీకి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, జాతీయ ఫార్మా ఉత్పత్తుల్లో మూడో వంతు, ఎగుమతుల్లో అయిదో వంతు వాటా తెలంగాణదే కావడం మనకు గర్వకారణమన్నారు. ఈ ఏడాది సదస్సులో సనోఫీ, ఒపెల్లా, వ్యాక్సిండో యానిమల్ హెల్త్,ట్రెడెన్స్,ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ >>2



బుధవారం బయో ఆసియా 2026 ముగింపు వేడుకల్లో ప్రసంగిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు



బీహార్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా పాట్నాలో బుధవారం సర్కార్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఆర్‌జెడి ఎమ్మెల్యేలు

## రంజాన్ మత సామరస్యానికి ప్రతీక: సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి18:** పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర మాసంలో ముస్లింలు ఆచరించే ఉపవాస దీక్షలు, ప్రార్థనలు ఆధ్యాత్మికతను పెంపొందించడంతో పాటు క్రమశిక్షణను పెంచుతాయన్నారు. లౌకికవాదం, మత సామరస్య పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని సీఎం అన్నారు. ముస్లీం సోదరులు రంజాన్ మాసం సంతోషంగా జరుపుకొని, అల్లా దీవెనలు పొందాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## ధరణి దోపిడీపై ఉక్కుపాదం

>> సమస్యలు ఎదురవుతున్నాయని గుర్తించామని పేర్కొన్నారు. మ్యుమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ధరణి లోపాలను అడ్డుపెట్టుకొని ప్రభుత్వానికి రావలసిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని, తప్పుచేసినవారు ఎవరినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ప్రభుత్వానికి రావలసిన ప్రతిపైసాను వసూలు చేస్తామన్నారు. దీనిపై ఉన్నత స్థాయి కమిటీ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకొని భవిష్యత్తులో అలాంటి పొరపాట్లు జరగకుండా ఏ చిన్న లోపానికి తావులేకుండా అధికారుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా ప్రజలకు ఫ్రెండ్లీగా ఉండేలా భూభారతి పోర్టల్‌నునిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, సిఎంఆర్‌వో మందామకరందర్, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంత్, ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు స్టాంప్స్ రిజిస్ట్రేషన్ డిఐజి సుభాష్, ఎస్‌బి ఎస్‌పీ సింధు శర్మ, సైబర్‌క్రైమ్ డిఎస్పీ ఎ.సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## పవర్‌హౌస్ తెలంగాణ

>> వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు ముందుకొచ్చాయన్నారు. బ్రిటన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, జపాన్, యూకే తదితర దేశాల నిపుణులతో లైఫ్ సైన్సెస్ రంగంలో రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లు, అనుసరించాల్సిన వ్యూహాలపై నిర్వహించిన ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాలు తెలంగాణ బ్రాండ్‌ను మరింత విశ్వవ్యాప్తం అయ్యేందుకు దోహదం చేస్తాయన్నారు. బయో ఎకానమీ రంగంలో మూడో అతిపెద్ద శక్తిగా ఎదగడానికి భారత్‌కు ఉన్న అవకాశాలు, తెలంగాణ పాత్రపై చర్చించి ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసేందుకు వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌తో కలిసి ప్రత్యేక చర్చా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈసారి ఫార్చ్యూన్ 500 కంపెనీల ప్రతినిధులతో పాటు దేశ విదేశాల నుంచి మొత్తం 4,394 మంది ప్రతినిధులు హాజరయ్యారన్నారు. కొత్త పెట్టుబడులు, భాగస్వామ్యాల కోసం 4వేలకు పైగా అత్యున్నత స్థాయి బిజినెస్ టూ బిజినెస్(బి2బి) సమావేశాలకు ఈ ఏడాది సదస్సు వేదికగా నిలిచిందన్నారు. లైఫ్ సైన్సెస్ రంగాన్ని తమ ప్రభుత్వం కేవలం వ్యాపారంగా మాత్రమే చూడటం లేదని, ఒక సామాజిక బాధ్యతగా చూస్తున్నామన్నారు. అన్ని రకాలుగా పారిశ్రామికాభివృద్ధికి అనుకూలంగా ఉన్న రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు.

## విందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

>> అనే థీమ్‌తో జరుగుతున్న ఈ సదస్సులో ఆరోగ్యం, వ్యవసాయం, విద్య వంటి రంగాల్లో కృత్రిమ మేథ (ఏఐ) వినియోగంపై చర్చలు జరిగాయి. కాగా, హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ హబ్‌గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్న సిఎం రేవంత్ రెడ్డికి ఈ పర్యటన అత్యంత కీలకంగా మారింది. సదస్సులో పాల్గొనే అంతర్జాతీయ టెక్ కంపెనీల ప్రతినిధులతో సిఎం రేవంత్‌రెడ్డి సమావేశమై తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించనున్నారు. అలాగే, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ప్రధాని మోడీతో కూడా ఆయన చర్చించే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. గురువారం ఉదయం ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 ప్రారంభోత్సవ కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు.

## ముస్లిం సోదరులకు, కెసిఆర్ రంజాన్ ప్రారంభ శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి18:** ఇస్లాం మతస్తులు పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రారంభ దినం సందర్భంగా, ముస్లిం సోదర సోదరీమణులకు బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర ఉపవాస దీక్షలతో, ప్రత్యేక ప్రార్థనలతో, దైవభక్తితో సాగే రంజాన్ మాసంలో ఆధ్యాత్మికత, భక్తి భావన వెల్లివిరుస్తుందని కెసిఆర్ తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ నగరం గంగా జమున తహజీబ్‌కు దర్పణంగా నిలుస్తుందని కేసీఆర్ తెలిపారు.

## వేసవి తాపానికి ఆర్టీసీ చల్లని కబురు

### మార్చి నుంచి ఏసి బస్సుల్లో 30% డిస్కౌంట్

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** రానున్న వేసవి నేపథ్యంలో ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త చెప్పింది. మార్చి 1 నుంచి ఏసీ,లగ్జరీ బస్సుల్లో టికెట్‌పై 30శాతం డిస్కౌంట్ ఇవ్వబోతున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. ఓఆర్ఆర్ పరిధిలో నడిచే ఏసీ బస్సుల్లో (పుష్పక్ 50, మిగతా 40.. మొత్తం 90 ఏసీ బస్సులు) మార్చి 1 నుంచి మే 31 వరకు 30 శాతం డిస్కౌంట్ అమలవుతుందని ప్రకటించారు. ఈ బస్సుల్లోని టికెట్ ధరలు ఎక్స్‌ప్రెస్ టికెట్ ధరలతో సమానంగా తగ్గించే ప్రయత్నం చేస్తామన్నారు. వేసవిలో బస్సు ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అందరూ ఏసీ బస్సుల్లో సుఖవంతమైన చల్లటి ప్రయాణం చేయాలన్న ఆలోచనలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా.. కాలుష్య నియంత్రణలో భాగంగా ఓఆర్ఆర్ లోపల ఎలక్ట్రికల్ బస్సులే నడపాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. పీఎంఈ డ్రైవ్ కింద త్వరలో రాష్ట్రానికి 2,000 ఈవీ బస్సులు రాబోతున్నాయని చెప్పారు.

## మార్చి 16న ఎన్నికలు

>> వరకు నామినేషన్ల ఉపసంహారణకు గడవు, మార్చి 16న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, అదేరోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. మార్చి 20వ తేదీలోగా రాజ్యసభ స్థానాల ఎన్నికల ప్రక్రియ ముగిస్తుంది. అసెంబ్లీలో ఉన్న బలాబలాల మేరకు ఈ రెండు స్థానాలు కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకోవాలనే లక్ష్యంగా పెట్టుకుందని తెలుస్తోంది. ఈ రెండు స్థానాలు ఎవరికి ఇవ్వాలనే విషయంలో హైకమాండ్ పరిశీలనలు చేస్తుండగా ఒకటి జాతీయ స్థాయి, మరొకటి తెలంగాణ మూలాలు కలిగిన వ్యక్తికి ఇవ్వాలనే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఒక స్థానానికి ఇండియా కూటమి తరఫున రాష్ట్రపతి బరిలో ఉన్న జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, మరొక స్థానానికి తిరిగి అభిషేక్ మను సింఘ్వీ పేర్లను పార్టీ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఇటీవల ఢిల్లీ పర్యటన సందర్భంగా సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వంపై సిఎం అధిష్ఠానం పెద్దలతో చర్చించారని తెలుస్తోంది. అలాగే సుదర్శన్‌రెడ్డితో పాటు సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పేరు సైతం రాజ్యసభ రేస్‌లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

## బాల్క సుమన్ అరెస్టు

>> అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను అరెస్ట్ చేసేందుకు ఇంటి చుట్టూ పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించి, అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ కార్యకర్తల పై జరిగిన దాడి, వారి విధులను అడ్డుకున్నారని బాల్క సుమన్ పై కేసు నమోదైంది. అరెస్ట్ చేయడానికి వచ్చిన పోలీసులను బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకున్నారు.దీంతో పోలీసులు, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం తీవ్రంగా జరిగింది. ఇంట్లో ఉన్న బాల్క సుమన్‌ను బలవంతంగా పోలీసులు అరెస్టు చేసి తరలించారు.మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మంచిర్యాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పరిచారు. జడ్జ్ కవిత బాల్క సుమన్ కు 14 రోజుల రిమాండ్ విధించగా, ఆదిలాబాద్ జిల్లా కోర్ట్ కు తరలించారు. కాగా బీఆర్ఎస్ నాయకులు సుమన్ అరెస్ట్‌ను నిరసిస్తూ గురువారం జిల్లా వ్యాప్తంగా బంద్ కు పిలుపునిచ్చారు.

## వారం - వర్జ్యం

19-02-2026, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శతభిషం కార్తె
విదియ మ.3.58
పూర్వాభాద్ర రా.8.52
వర్జ్యం : రా.9.13-11.46
దు.ఉ.10.25-11.12, మ.3.05-3.52
శుభసమయం: ఉ.8.00-9.00,సా.5.00-6.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** బ్యాంక్ లావాదేవీలలో తేడాలు, లోపములను పరిశీలించి మౌనంగా తగు చర్యలు తీసుకుంటారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**వృషభం:** వాగ్దానభంగము చేసిన వ్యక్తులను వారి బాధ్యతను ఇచ్చిన మాటను గుర్తు చేస్తారు. వ్యాపార విషయ చర్చలలో సానుకూలం.

**మిథునం:** వివాదాస్పద అంశాలకు దూరంగా ఉండటం మంచిది. నిలిపివేసిన కళా సంబంధమైన వాటిని పునః ప్రారంభిస్తారు.

**కర్కాటకం:** కార్యాలయాలలో మీరు లేకపోయినా సక్రమంగా కార్యక్రమాలను నిర్వహించే వ్యక్తులను ఎంచుకుంటారు. వివాహయత్నాలు.

**సింహం:** దైవ కార్యములను, శుభ కార్యములను నిర్విఘ్నముగా పూర్తిచేస్తారు. రాజకీయ వ్యవహారములకు అనుకూల కాలం.

**కన్య :** బంధువులతో చర్చించి అభివృద్ధి కార్యక్రమాలను ఆదరణలో పెడతారు. నూతన కాంట్రాక్టులు శ్రమానంతరము దక్కుతాయి.

**తుల :** స్పెక్యులేషన్ వైపుకు మొగ్గుచూపే కన్నా స్థిరాస్తుల కొనుగోళ్ళు పైన పెట్టుబడిని మదుపు చేయుట మంచిదని భావిస్తారు.

**వృశ్చికం:** ఆధునిక సాంప్రదాయ పద్ధతు లను వ్యతిరేకిస్తారు. సనాతన సాంప్రదాయ విషయముల మీద ఆసక్తిని పెంచుకుంటారు.

**ధనుస్సు:** ముక్కుసూటిగా వ్యవహరిస్తారు. అందువలన కొందరికి దూరం కావలసి వస్తుంది. కోర్టు వ్యవహారములు అనుకూలిస్తాయి.

**మకరం:** గృహనిర్మాణ సంబంధమైన విషయములు స్వల్పమార్పులను చోటుచేసు కుంటాయి. మీశక్తి సామర్థ్యములు వెలుగులోకివస్తాయి.

**కుంభం:** మంచి అవకాశములను గురించి గతములో చేసిన ప్రయత్నములు ఇప్పుడు అక్కరకువస్తాయి. వాహన సౌఖ్యం.

**మీనం:** అధికంగా చెప్పుకోదగిన ఇబ్బందులేర్పడవు. మీకు రావలసిన ధనం కొంతమేరకు చేతికి అందుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఇక గ్రీన్ ఎనర్జీ విప్లవం

>> ముఖ్యమంత్రి తెలంగాణ దృక్పథాన్ని వివరించారు. దేశ పట్టణాభివృద్ధికి సంబంధించిన సదస్సులో మాట్లాడడం తనకు సంతోషంగా ఉందన్నారు. 2047 లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలంటే 1947 నుంచి భారత అభివృద్ధి ప్రయాణాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం తొలి నాలుగు దశాబ్దాల్లో దేశంలో ప్రధాన ప్రాధాన్యతలు విద్యా వ్యవస్థ, నీటిపారుదల రంగాలేనని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాథమిక పాఠశాలల నుంచి ఐఐటి,ఐఐఎం,ఐఐఎస్‌సి వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. విద్యుత్, సాగునీటికి భారీ ఆనకట్టలను నిర్మించి రైతుల పొలాలను నీటితో అనుసంధానించామని తెలిపారు. 1990 నాటికి భారత్ ఆహార కొరత నుంచి ఆహార భద్రత సాధించిందని చెప్పారు. దీంతో ప్రజల జీవిత కాలం పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. దేశంలోని ఇంజినీర్లు, వైద్యులు,శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమంగా గుర్తింపు పొందే విధంగా అభివృద్ధి సాధించిందని వివరించారు. 1991 నుంచి 2020 వరకు లిబరలైజేషన్, ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్‌పిజి) సంస్కరణలతో భారత్ సేవా రంగంలో శక్తివంతమైన దేశంగా ఎదిగిందని సీఎం వివరించారు. టెలికాం,సాఫ్ట్‌వేర్ విప్లవంతో పట్టణ మౌలిక సదుపాయాల విస్తరణ సాధ్యమైందని అన్నారు. భారత నిపుణులు సిలికాన్ వ్యాలీ వంటి ప్రపంచ కేంద్రాల్లో విజయాలు సాధించారని తెలిపారు. 1991 తర్వాత గ్లోబల్ సాఫ్ట్ వేర్, టెక్ సంస్థలు తమ బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకు భారత్‌ను ఎంచుకున్నాయని అన్నారు. అందుకే ప్రపంచంలో అత్యధిక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీ) మన దేశంలో ఉన్నాయన్నారు. అయితే, ఈ టెక్ పురోగతిలో తయారీ రంగం ఎక్కువగా అవకాశాలు కోల్పోయినట్లు అభిప్రాయపడ్డారు. కోవిడ్ అనంతరం ప్రభుత్వాల దృష్టికోణం మారిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకంగా మారాయని అన్నారు. ఏ ఆర్థిక వ్యవస్థకైనా విద్యుత్ ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగం అభివృద్ధికి కొలమానంగా నిలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను ప్రస్తావిస్తూ, రాష్ట్ర జీడీపీని 200 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడం లక్ష్యమని తెలిపారు. భవిష్యత్ అభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, వనరులు, ఉపాధి ప్రధాన స్తంభాలుగా నిలుస్తాయని అన్నారు.రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధికి తెలంగాణను సియుఆర్ఈ(క్యూర్), పియుఆర్ఈ(ప్యూర్), ఆర్ఏఆర్ఈ(రేర్) జోన్‌లుగా విభజించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. హైదరాబాద్‌ను 160 కి.మీ. పొడవైన ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్)గా ప్రకటించగా,ఓఆర్ఆర్, 360 కి.మీ.ల రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) మధ్య ప్రాంతాన్ని ప్యూర్ జోన్‌గా రూపొందించి తయారీ రంగానికి నిర్దేశించినట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసి 'చైనా +1' ప్రత్యామ్నాయంగా తెలంగాణను నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ తయారీ వృద్ధి గ్రీన్ ఎనర్జీ ఆధారంగా సాగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ విద్యుత్ వినియోగంపై ముఖ్యమంత్రి గణాంకాలను వెల్లడించారు. రాష్ట్రం రోజుకు సగటున 16,610 మెగావాట్ల విద్యుత్ వినియోగిస్తోందని తెలిపారు. గత ఏడాది గరిష్ట డిమాండ్ 17,162 మెగావాట్లు నమోదైందని, ఈ ఏడాది అది 19,000 మెగావాట్లను దాటుతుందని అంచనాలున్నాయని వివరించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో గరిష్ట డిమాండ్ 34,000 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశారు. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 24.8శాతం లేదా దాదాపు 25శాతం గ్రీన్ సోర్సుల నుంచే వస్తోందని తెలిపారు. అదేవిధంగా, 360 కిలోమీటర్ల పొడవు గల రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం కొనసాగుతోందని, రీజినల్ రింగ్ రైల్వే ప్రణాళికలు అమలులో ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నారు.. ఓఆర్ఆర్,ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతాన్ని ప్రధాన తయారీ జోన్‌గా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు, ముఖ్యంగా డేటా సెంటర్లు, పరిశ్రమలు గ్రీన్ ఎనర్జీని కోరుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న క్రమంలో వనరుల పెరుగుదలలో ప్రధాన భాగం గ్రీన్‌గా ఉండాలని తన సంకల్పాన్ని వ్యక్తం చేశారు. వాతావరణ మార్పులు, కోవిడ్ ప్రభావాలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత పరిస్థితిని క్లైమేట్ ఎమర్జెన్సీగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి సృష్టి, ఉత్పత్తి, వినియోగం పెంపు కొనసాగుతూనే పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ మూడు జోన్‌లలో గ్రీన్ స్ట్రాటజీని అవలంబించిందని తెలిపారు. హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నులు తొలగించడంతో దేశంలో అత్యధికంగా ఈవీల స్వీకరణ పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలోనే ఈవీ తయారీ కోసం సంస్థలతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను పర్యావరణహితంగా మార్చే దిశగా 2 లక్షలకుపైగా ఆటోరిక్షాలను రీట్రోఫిట్ చేస్తుండగా, 3,500 కంటే ఎక్కువ ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ మెట్రోను ప్రస్తుత 71 కి.మీ. నుంచి 200 కి.మీ. పైగా విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పరిశ్రమలను కోర్ అర్బన్ ప్రాంతం నుంచి పెరి అర్బన్ జోన్‌లకు తరలిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా మూసీ నది పునరుద్ధరణ, సరస్సులు, చెరువుల సంరక్షణ, వాటర్ గ్రిడ్, వనరుల నిర్వహణ ప్రణాళికలను ముఖ్యమంత్రి వివరించారు. హైడ్రా రూపంలో పర్యావరణ రక్షణకు ప్రత్యేక పోలీసు దళాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో వాతావరణ ప్రమాదాలను తగ్గించి నగరాన్ని సురక్షితమైన, వేగంగా అభివృద్ధి చెందే నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. తెలంగాణను మొత్తం దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

## రూ.లక్ష కోట్ల నిధులతో రహదార్ల నిర్మాణం

>> తెలంగాణ నినాదంలో రాష్ట్ర రోడ్ నెట్‌వర్క్ అభివృద్ధి.. అత్యంత కీలకమని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర రోడ్ నెట్‌వర్క్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. హ్యామ్ రోడ్ల నిర్మాణంతో రాష్ట్రవ్యాప్తంగా అద్దం లాంటి రోడ్లు నిర్మించబోతున్నామని తెలిపారు.
ఇప్పటికే ఉన్న బాలారిష్టాలు దాటేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేశామని.. అధికారులు కూడా మనసుపెట్టి పనిచేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటాపై కన్ఫ్యూజన్ లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. హైదరాబాద్ విజయవాడ (ఎన్‌హెచ్ 65) 8వ లైన్ విస్తరణ పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయని వివరించారు. ఈ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి మరోసారి కోరతామని అన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన రోడ్డు ఇదని... ఇది పూర్తయితే హైదరాబాద్ నుంచి విజయవాడ రెండున్నర గంటల్లో చేరుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా కేంద్రప్రభుత్వం సహకారం అందించే ఆయా ప్రాజెక్టుల్లో వేగం పెంచాలన్నారు. ఈ విషయంలో తాను కేంద్ర మంత్రులను కలుస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.రాష్ట్రంలో లక్ష కోట్లకు పైగా నిధులతో రహదారుల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. హామ్ ప్రాజెక్టులు, రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్-విజయవాడ మార్గం, ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టు వరకు, రావిర్యాల నుంచి శ్రీశైలం వరకు చేపట్టిన రహదారి అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు.రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి హడ్కో నుంచి రుణం పొందేందుకు ప్రీ బడ్జెట్ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం రాష్ట్ర మౌలిక వసతుల అభివృద్ధికి కీలక నిర్ణయమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు అభిప్రాయపడ్డారు.రాష్ట్రంలో రహదారి మౌలిక వసతుల బలోపేతం ద్వారా పెట్టుబడులు, పరిశ్రమలు మరియు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్ కేంద్రంగా సంవత్సరం పొడవునా సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగించేలా సినిమాటోగ్రఫీ శాఖ అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. ఈ సమావేశానికి స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఈఎన్సీలు మోహన్ నాయక్, జయ భారతి, సీఈలు శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, వసంత్ నాయక్, బీవీ రావు, లింగారెడ్డి, నర్సింగ్‌రావు, పలువురు ఆర్ అండ్‌బీ అధికారులు హాజరయ్యారు.



న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో బుధవారం ప్రధానమంత్రి మోడీతో భేటీ అయిన కజకిస్థాన్ రిపబ్లిక్ ప్రధాన మంత్రి ఓల్జాస్ బెక్టెనోవ్

## దానం అనర్హత పిటిషన్‌పై స్పీకర్ విచారణ

>> పోటీ చేశారు. ఆయన పార్టీ ఫిరాయించారనడానికి ఇంతకంటే పెద్ద సాక్ష్యం ఏమి కావాలంటూ బిఆర్ఎస్ దాఖలు చేసిన పిటీషన్‌లో పేర్కొంది. తాను పార్టీ ఫిరాయించలేదని దానం అఫిడవిట్‌ను స్పీకర్‌కు దాఖలు చేశారు. ఈ మేరకు స్పీకర్ నోటీసు ఇవ్వడంతో దానం నాగేందర్ విచారణకు హాజరు కాకుండా ఆయన తరఫున అడ్వకేట్లు హాజరయ్యారు. ఎమ్మెల్యేల అనర్హత పిటీషన్లపై విచారణ జాప్యం చేస్తున్నారని, సుప్రీంకోర్టు మూడు నెలల డెడ్‌లైన్‌ను కూడా ఉల్లంఘించారంటూ స్పీకర్‌పై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన బిజెపిఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం స్పీకర్ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం అసెంబ్లీ బయట మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో ఎమ్మెల్యేల ఫిరాయింపుల విషయంలో బిఆర్ఎస్,కాంగ్రెస్ కలిసి డ్రామాలు ఆడుతున్నాయని ఆరోపించారు. ఈ కేసును త్వరగా పూర్తి చేయాలని సుప్రీంకోర్టు చాలాసార్లు చెప్పింది. అయినా స్పీకర్ ఎందుకు సాగదీస్తున్నారని ప్రశ్నించారు. బిఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్‌లో ఎంపీగా పోటీ చేశారు. బిఆర్ఎస్‌కు రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు అని చెప్పారు. అనర్హత నిర్ణయంపై స్పీకర్ ఏడాదిన్నరగా కాలాయపన చేస్తున్నారు. అనర్హత పిటీషన్లను నీరు గార్చాలని స్పీకర్ చూస్తున్నారని ఆరోపించారు. ఈ కేసును త్వరగా పూర్తి చేయాలని సుప్రీంకోర్టు చాలాసార్లు చెప్పిందని, బిఆర్ఎస్,కాంగ్రెస్ కలిపి నాటకం ఆడుతున్నారని పేర్కొన్నారు. దానం నాగేందర్ కేసును సుమోటాగా స్వీకరించి చర్యలు తీసుకునే అన్ని ఆధారాలు ఉన్నాయని వెల్లడించారు. సుప్రీంకోర్టులో దానంను బిఆర్ఎస్ సస్పెండ్ చేసినట్లు అఫిడవిట్ దాఖలు చేసిన విషయం తెలుసా అని దానం తరఫున అడ్వకేట్లు అడిగారని పేర్కొన్నారు. కోర్టులో అఫిడవిట్ వేసిన విషయాన్ని బిఆర్ఎస్ ఇన్ని రోజులు ఎందుకు దాచి పెట్టారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఈ విషయాన్ని ఎందుకు సాగదీస్తోందని ప్రశ్నించారు. దానంను సస్పెండ్ చేస్తే ఈ కేసు నిలబడదు అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.

**దానం పార్టీ మారారు...ఇదిగో ఆధారం: పాడి కౌశిక్ రెడ్డి**

దానం నాగేందర్ పార్టీ ఫిరాయించారు, ఏఐసిసి ప్రకటించిన లోక్‌సభ అభ్యర్థుల జాబితాలో దానం పేరు ఉంది, సికింద్రాబాద్ లోక్‌సభ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఇవిగో ఆధారాలు అంటూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు అందజేశారు. బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పార్టీ ఫిరాయించారని ఆరోపణ ఎదుర్కొంటున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం ఇరుపక్షాల వాదనలు విన్నారు. ముఖ్యంగా దానం నాగేందర్ తరపు న్యాయవాదులు, పిటిషనరైన బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని క్రాస్ ఎగ్జామ్ చేశారు. దానం నాగేందర్ పార్టీ మారలేదని, ఆయన ప్రతి నెలా తన జీతభత్యాల నుంచి బిఆర్ఎస్ శాసనసభాపక్షం కార్యాలయానికి రూ.5వేలు చెల్లిస్తున్నారు కదా? అని న్యాయవాదులు పిటిషనర్ పాడి కౌశిక్ రెడ్డిని ప్రశ్నించారు. విచారణ పూర్తయిన అనంతరం పాడి కౌశిక్ రెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఏఐసిసి ప్రకటించిన లోక్‌సభ అభ్యర్థుల జాబితాలో దానం నాగేందర్ పేరు ఉండడాన్ని చూపించానని చెప్పారు. లోక్‌సభకు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆధారాలన్నింటినీ తాను చూపించినా, దానం కప్పుకున్న కండువాపై హస్తం గుర్తు లేదు కదా? అని న్యాయవాదులు అడిగారని ఆయన చెప్పారు. ఈ విధంగా తనను పలు ప్రశ్నలతో క్రాస్ ఎగ్జామ్ చేశారని ఆయన తెలిపారు.ఇదిలాఉండగా గురువారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనర్హత పిటిషన్‌పై స్పీకర్ విచారణ చేపట్టనున్నారు.

## దుస్తులు లాగినా అత్యాచార నేరమే

### సుప్రీం కోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** మహిళల ఛాతీని తాకడం, వారి ఫైజామా తాడు లాగడం వంటి చర్యలు కేవలం అత్యాచారానికి సన్నద్ధత కాదని, అవి నేరుగా అత్యాచార యత్నం కిందికే వస్తాయని సుప్రీం కోర్టు బుధవారం నాడు కీలక తీర్పు వెలువరించింది. ఈ విషయంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన వివాదాస్పద ఆదేశాలను సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని కస్‌గంజ్ ప్రాంతంలో 2021లో జరిగిన ఓ ఘటన ఈ తీర్పుకు నేపథ్యంగా నిలిచింది. 11 ఏళ్ల బాలికను ఇంటి వద్ద దింపుతామని చెప్పి ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్నారు. మార్గమధ్యంలో ఆమె స్తనాలను అసభ్యంగా తాకి, ఫైజామా తాడును లాగి దుస్తులు తొలగించేందుకు ప్రయత్నించారు. బాలిక కేకలు వేయడంతో స్థానికులు రావడంతో నిందితులు పరారయ్యారు. ఈ కేసులో విచారణ జరిపిన అలహాబాద్ హైకోర్టు, నిందితుల చర్యలు అత్యాచార యత్నం కిందకు రావని, కేవలం సన్నద్ధత మాత్రమేనని పేర్కొంటూ నిందితులపై ఉన్న అత్యాచార యత్నం అభియోగాలను తగ్గించింది. ఈ తీర్పుపై తీవ్ర విమర్శలు రావడంతో సుప్రీం కోర్టు సుమోటోగా (తనంతట తానుగా) విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం హైకోర్టు తీర్పును తీవ్రంగా తప్పుబట్టింది. హైకోర్టు వ్యాఖ్యలు సున్నితత్వం లేకుండా, అమానవీయంగా ఉన్నాయని పేర్కొంది. నిందితులపై అత్యాచార యత్నం సెక్షన్లను పునరుద్ధరించాలని ఆదేశించింది. అంతేకాకుండా, ఈ వివాదాస్పద వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. భవిష్యత్తులో న్యాయమూర్తులకు సున్నితత్వ శిక్షణపై ఓ కమిటీని ఏర్పాటు చేయాలని నేషనల్ జ్యుడిషియల్ అకాడమీకి సూచించింది. మహిళలు, బాలికలపై లైంగిక దాడులకు సంబంధించిన కేసుల్లో సన్నద్ధత, ప్రయత్నం మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టం చేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన ఈతీర్పు చారిత్రకమైనదిగా నిపుణులు భావిస్తున్నారు.

## స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపిన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి18:** వికారాబాద్ మున్సిపల్ నూతన చైర్‌పర్సన్‌గా గడ్డం అనన్య ఎన్నికైన సందర్భంగా వారి తండ్రి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు శాసనమండలి చైర్మన్ గుత్తాసుఖేందర్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం అసెంబ్లీ స్పీకర్ చాంబర్‌లో స్పీకర్‌ను మండలి చైర్మన్ కలిశారు. కౌన్సిల్ సెక్రటరీ డా. వి. నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, అధికారులు కూడా స్పీకర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ బాధ్యత మీదే

### ఎల్‌అండ్‌టీకి స్పష్టం చేసిన నీటిపారుదలశాఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మేడిగడ్డ బరాజ్ పునరుద్దరణ విషయంలో నీటిపారుదలశాఖ-నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ మధ్య సమన్వయం కుదరడం లేదు. పరస్పర అంగీకారంతో రూపొందించే నిబంధనల ప్రకారమే బరాజ్ పునరుద్దరణ పనులు చేపట్టాలంటూ ఎల్‌అండ్‌టీ నీటిపారుదల శాఖకు స్పష్టం చేస్తుండగా అదేమీ కుదరదు బరాజ్ పునరుద్దరణ ఖర్చు అంతా ఎల్‌అండ్‌టీదేనని నీటిపారుదలశాఖ తేల్చి చెబుతోంది. దీంతో మేడిగడ్డ పునరుద్దరణ అంశం రెండేళ్లుగా కొలిక్కిరాని పరిస్థితి నెలకొంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బరాజ్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ నిర్మించగా ఒప్పంద గడువులోపే డ్యామ్ కుంగిపోయిన విషయం విధితమే. మేడిగడ్డ బరాజ్‌ను రూ.2591 కోట్ల అంచనాతో నిర్మించేందుకు 2016 మార్చి 1న ప్రభుత్వం పరిపాలనా అనుమతులను ఇచ్చింది. 24 నెలల గడువులోగా బరాజ్‌ను నిర్మించేందుకు అదే ఏడాది ఆగస్టున ఎల్‌అండ్‌టీతో రామగుండం సూపరింటెండింగ్ ఇంజనీర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. అదనపు పనుల నేపథ్యంలో అంచనాలను 2018 మే 19న రూ.3260కోట్లకు పెంచుతూ నాటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# యుద్ధప్రాతిపదికన యాసంగి సర్వే

## 45 రోజుల్లో పూర్తి చేసే లక్ష్యం.. స్థానిక యువతకు ప్రాధాన్యం

## ప్రైవేటు సర్వేయర్లు, వలంటీర్ల నియామకం

## వ్యవసాయ శాఖ కీలక నిర్ణయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** కేంద్రం విధించిన గడువులోగా రాష్ట్రంలో యాసంగి పంట సర్వేను పూర్తి చేసేలా వ్యవసాయ శాఖ కార్యాచరణను రూపొందించింది. ఈ పంటల సర్వేను 45 రోజుల్లో పూర్తి చేసేందుకు గాను ప్రైవేట్ సర్వేయర్లు, వాలంటీర్ల నియామకాలను చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు గ్రామాల్లో ఉన్న యువతను గుర్తించి జిల్లా అధికారులు వివరాలు అందజేయనున్నారు. ప్రస్తుతమున్న ఏఈవో లతో పూర్తి కావాలంటే దాదాపు మూడు నెలల సమయం పడు తుంది. రాష్ట్ర వ్యాప్తంగా 10,621 గ్రామాల్లో 194.69 లక్షల సర్వే నెంబర్ల ఉండగా ఇందులో 9795 గ్రామాలకు విలేజ్ మ్యాప్‌ఉంది. వీటిలోని 174.36 లక్షల సర్వే నెంబర్లకు సంబంధించిన పంట భూముల సర్వేను ప్రైవేటు సర్వేయర్లు, వలంటీర్లకు అప్పగిస్తారు. మిగిలిన 826 గ్రామాల్లోని పోడు భూముల పంట సర్వేను వ్యవసాయ విస్తరణాధికారులు చేస్తారు. కొత్తగా తీసుకున్న వాలంటీర్లు, ప్రైవేటు సర్వేయర్లు అదే గ్రామానికి చెందిన వారు కావడంతో రోజుకు 150 నుంచి 200 సర్వే నెంబర్ల కలిగిన పంట ఫొటోలు తీసే అవకాశం ఉంటుంది. ఈ సర్వేతో వారు రోజు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు సంపాదించుకునే అవకాశాం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. వారంతా 10 రోజులు పనిచేస్తే గ్రామంలో ఉన్న పంటల వివరాలు ప్రభుత్వానికి ఇచ్చే వీలుంటుందని భావిస్తున్నారు. పంట సర్వే కోసం కేంద్రం రూ.30.42 కోట్లు కేటాయించగా వానాకాలం సీజన్లో సర్వే చేస్తే రూ.2.93 కోట్లు ఖర్చయింది. మిగిలిన నగదుతో ప్రైవేటు సర్వేయర్లు, వలంటీర్లకు ఫొటోకు రూ.7 చొప్పన ఇవ్వనుంది. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన కేంద్ర ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌చావ్లా వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం జరిపి తాము సూచించిన గడువులో డిజిటల్ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. దీనిపై ఉన్నతాధికారుల్లో భిన్న అభిప్రాయాలు వ్యక్తం కావడంతో వెంటనే కొందరు ఏఈవోలతో సాధ్యసాధ్యాలపై వివరాలు తెలుసుకున్నారు. వారు తమతో పాటు ప్రైవేటు సర్వేయర్లు, స్థానికంగా ఉండే వాలంటీర్ల సహాయం తీసుకుంటే 100 శాతం ఖచ్చితమైన సర్వే రిపోర్టు ఇచ్చి పంట సాగు చేసిన ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాలు అందేలా చేయవచ్చని సూచనలు చేశారు. వారి సలహాలు పరిగణలోకి తీసుకున్న వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు రెండు రోజుల కితం ప్రైవేటు వ్యక్తులను తీసుకోవాలని ఆదేశించారు. పనిచేసే సామర్థం కలిగిన యువతను ఎంపిక చేసుకోవాలని ఏఈవోలకు సూచించారు. కాగా ఈ సర్వేను వేగంగా చేసేందుకు స్థానికంగా ఉండే యువతను వలంటీర్లుగా నియమించుకుని వారికి నాలుగైదు రోజుల పాటు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఒక గ్రామానికి ఒక వాలంటీర్ మాత్రమే ఉండాలి. బీఎస్సీ అగ్రికల్చర్, డిప్లమా, ఏదైనా సైన్సు కోర్సు, ఇంటర్, పదవ తరగతిలలో ఏదో ఒకటి ఉత్తీర్ణులుగా ఉండాలి. మొబైల్యాప్పినియోగించే విధానం తెలియాలి. సెలవులు లేకుండా సర్వే పూర్తయ్యే వరకు పనిచేయాల్సి ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

# రాష్ట్రంలో బ్యాంకు ఎటిఎంల ఎత్తివేత!

## 6 వేలకు తగ్గిపోనున్న సంఖ్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** ఎటిఎంల (ఎనీటైం మనీ) నిర్వహణ భారం తగ్గించుకునేందుకు రాష్ట్రంలోని బ్యాంకులు కీలక నిర్ణయం తీసుకున్నాయి. బ్యాంకు అధికారవర్గాల వివరాల ప్రకారం ఒక్కో ఏటీఎంపై నెలకు సగటున 2.5 లక్షల రూపాయల వరకూ బ్యాంకులు ఖర్చు చేస్తున్నాయి. అలాగే ప్రతీ 8 గంటలకు ఒక సెక్యూరిటీ గార్డు చొప్పున 24 గంటలపాటు ముగ్గురికి జీతాలు, ఏటీఎంను ఉంచే రూమ్ అద్దె, విద్యుత్ బిల్లులు, సాంకేతిక నిర్వహణ ఖర్చులు విధిగా చేయాల్సి వస్తోంది. అయితే ప్రస్తుతం డిజిటల్ చెల్లింపులు భారీగా పెరుగుతుండటంతో ఎటిఎంల్లో నగదు తీసుకునేవారి సంఖ్య తగ్గుతోంది.

ఈ నేపథ్యంలో నగదు ఉపసంహారణ తగినంతగా లేని ఎటిఎంలను బ్యాంకులు ఎత్తి వేస్తున్నాయి. ఈ క్రమంలో ఎటిఎంల సంఖ్యను తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నాయి. ఇప్పటికే యేడాది కాలంలో రాష్ట్రంలోని ఎటిఎంలో 5 శాతం మేర బ్యాంకులు ఎత్తివేశాయి. వచ్చే యేడాది మరో 10 శాతం చొప్పున ఎటిఎంలను తగ్గించాలని తాజాగా బ్యాంకులు ప్రతిపాదించాయి. తెలంగాణ వ్యాప్తంగా ప్రస్తుతం 50 రకాల బ్యాంకులకు సంబంధించి 9,205 ఎటిఎంలు పనిచేస్తున్నాయి. గత యేడాది మార్చి నెలాఖరు నాటికి 9,660 ఎటిఎంలు ఉండగా, గత యేడాది సెప్టెంబరు నెలకు వచ్చేసరికి 455 ఎటిఎంలను ఎత్తివేశాయి. ఇలా వచ్చే రెండేళ్లలో తెలంగాణ వ్యాప్తంగా ఎటిఎంల సంఖ్య 6 వేలకు పడిపోతుందని బ్యాంకు అధికారవర్గాలు వెల్లడించాయి.

# ఐ బొమ్మ రవి జైలు నుంచి విడుదల

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా అనేక భాషల సినిమాలను, ఓటిటి కంటెంట్లను అధునాతన టెక్నాలజితో పైరసీ చేసి సోషల్ మీడియాలో పెడుతూ, వాటిని బెట్టింగ్ యాప్‌లకు అమ్ముతూ సినీ రంగానికి వందల కోట్ల రూపాయల నష్టం చేకూర్చిన ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి ఎట్టకేలకు జైలు నుంచి విడుదలయ్యాడు. రవికి నాంపల్లి కోర్టు మంగళవారం నాడు షరతులతో కూడిన బెయిల్ ఇవ్వడం తెలిసిం దే. దీని ప్రకారం రవి తరపున వాదించిన న్యాయవాది కోర్టు ష్యూరిటీలను బుధవారం పూర్తి చేయడంతో సాయంత్రం ఆరు గంటల సమయంలో ర వి చంచల్‌గూడ జైలు నుంచి విడులయ్యాడు. రవి 90 రోజుల పాటు జైల్లో రిమాండులో వున్నాడు. గత ఏడాది నవంబరు నెలలో అరెస్టయిన రవి అప్పటి నుంచి జైల్లో వుండడం విదితమే. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఇప్పటికే రవి పాస్‌పోర్టును జప్తు చేయగా, ఫోన్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు. రవి ప్రస్తుతం కరేబియన్ దీవుల పౌరసత్వం కలిగి వుండడంతో అతని నేరాలపై పోలీసులు ఆ దేశానికి సమాచారం అందించారు. దీంతోపాటు అతని అరెస్టు వివరాలను, అతనిపై నమోదైన కేసులను ఢిల్లీలోని కరేబియన్ రాయబార కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. కోర్టు ష రతుల ప్రకారం రవి గురువారం నుంచి ప్రతీ రోజు సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌కు రావాల్సి వుంది. ఇంటర్నెట్ వాడడంపై నిషేధం వుంది. అతనుండే ఇంటి తాలూకు యజమాని వివరాలను పోలీసులు ఇప్పటికే తీసుకున్నారు. ఈ కేసు విచారణ పూర్తయ్యే వరకు రవి భారత్ దాటి వెళ్లేందుకు వీ ల్లేకుండా కోర్టు ఆంక్షలు విధించింది.

# ఎపిలో సంచలనం.. అత్యాచారం కేసుల్లో

## ఇద్దరు నిందితులు ఒకేలా ఆత్మహత్యలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మైనర్లతోపాటు ముక్కుపచ్చలారని చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడ్డ కేసుల్లో నిందితులుగా వున్న ఇద్దరు నేరగాళ్లు ఎపిలో ఒకే తరహాలో చెరువులో దూకి ఆత్మహత్యలకు పాల్పడడం సంచలనం రేపింది. ఆరు నెలల వ్యవధిలో జరిగిన ఈ ఘటనల్లో ఇద్దరు నిందితులు పోలీసు కస్టడీలో వున్న వారు కావడం గమనార్హం. మొదటి గటన కాకినాడ రూరల్ పరిధిలో హంసల వలసలో వున్న ఒక తోటలో ఒక మైనర్ బాలికతో 60 యేళ్ల వృద్ధుడు నారాయణ రావు అభ్యంతకరంగా వుండగా మరో వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో వుం చడంతో అది వైరల్‌గా మారింది. దీంతో పోలీసులు నారాయణ రావును అరెస్టు చేయగా మరుసటి రోజున అతన్ని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా పో లీసు కస్టడీ నుంచి తప్పించుకుని సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై జిల్లా అధికారులు విచారణకు ఆదేశించారు. తాజా ఘటనలో మదనపల్లెలో ఏడేళ్ల చిన్నారిని కులవర్దన్ అనే 30 ఏళ్ల యువకుడు మంగళవారం గంజాయి మత్తులో అత్యాచారానికి పాల్పడి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటనలో కులవర్దన్‌ను స్థానికులు బంధించి పోలీసులకు అప్పగించారు. బుధవారం ఉదయం అతన్ని విచారణ నిమిత్తం పోలీసు స్టేషన్‌కు తరలిస్తుండగా కస్టడీ నుంచి తప్పించుకు ని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.


**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on X @SCRailwayindia

మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై ద.మ.రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.

**NO: C/E-వేలముల పట్టిక/SC/2025-26, తేదీ: 16.02.2026**

PUB/1987/26

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, సికింద్రాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే వారు, కమర్షియల్ ఆర్జన మరియు NFR కాంట్రాక్ట్‌లకు ఇ-వేలం కోరుతున్నారు. ఆ ప్రకారంగా, SC డివిజన్ ఈ క్రింది కేటగిరీలకు ఒక ఇ-వేలం పద్ధతి చేపట్టింది. అవి https://www.ireps.gov.in వెబ్‌సైట్‌లో ప్రకటింపబడినవి.

క్ర.సం.1 కేటగిరీ : పార్సెల్స్, పట్టిక నం.: SC-పార్సెల్-0126, వేలం ప్రారంభ తేదీ మరియు సమయం : 23-ఫిబ్రవరి-26 12:00. సంబంధిత స్టేషన్(లు)/రైలు(ళ్లు): 12776, 15294, 07020, 12734, 22737, 17039, వేలం వివరాలు: SLR కోచ్‌లో పార్సెల్ స్పేస్ (సింగిల్ కంపార్ట్‌మెంట్) 12776, 15294, 07020, 12734, 22737, 17039లో.

క్ర.సం.2 కేటగిరీ : పార్సెల్స్ పట్టిక నం.: SC-పార్సెల్-0226, వేలం ప్రారంభ తేదీ మరియు సమయం : 24-ఫిబ్రవరి-26 12:00. సంబంధిత స్టేషన్(లు)/రైలు(ళ్లు): 12764, 12735, 20915, 17256, వేలం వివరాలు: SLR కోచ్‌లో పార్సెల్ స్పేస్ (సింగిల్ కంపార్ట్‌మెంట్) 12764, 12735, 20915, 17256లో.

క్ర.సం.3 కేటగిరీ : పార్కింగ్, పట్టిక నం.: SC-పార్క్-JMKT-FW, వేలం ప్రారంభ తేదీ మరియు సమయం: 26-ఫిబ్రవరి-26 10:00. సంబంధిత స్టేషన్(లు)/రైలు(ళ్లు): JMKT, వేలం వివరాలు: జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో సంఘ్ ఆఫీస్ (న్యూ లాట్) పక్కలొకేషన్ వద్ద నాలుగు చక్రాల వాహనాలకు పార్కింగ్ లాట్.

క్ర.సం.4 కేటగిరీ : MISC-స్టాటిక్, పట్టిక నం.: MSS-PREM-26-6 వేలం ప్రారంభ తేదీ మరియు సమయం: 26-ఫిబ్రవరి-26 13:00. సంబంధిత స్టేషన్(లు)/రైలు(ళ్లు): BMT, HFZ వేలం వివరాలు: హఫీజ్‌పేట రైల్వే స్టేషన్ వద్ద ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్ కొరకు కాంట్రాక్ట్, 2 బేగంపేట రైల్వే స్టేషన్‌ల వద్ద వివిధ లొకేషన్‌లలో ప్రీమియం స్టోర్ యొక్క నిర్వహణ మరియు వేర్వేరు కాంట్రాక్ట్‌లను నెలకొల్పుట.

క్ర.సం.5 కేటగిరీ : పే అండ్ యూజ్, పట్టిక నం.: Pnu-SCD-HFZ-1 వేలం ప్రారంభ తేదీ మరియు సమయం: 26-ఫిబ్రవరి-26 14:00. సంబంధిత స్టేషన్(లు)/రైలు(ళ్లు): ZN, HFZ, BDCR వేలం వివరాలు: జనగాం, హఫీజ్‌పేట, మరియు భద్రాచలం, రోడ్, రైల్వే స్టేషన్‌ల వద్ద వేర్వేరు పే అండ్ యూజ్ టాయిలెట్ కాంట్రాక్ట్‌లు.

క్ర.సం.6 కేటగిరీ : పార్కింగ్, పట్టిక నం.: SC రేడియో టాక్సి, వేలం ప్రారంభ తేదీ మరియు సమయం: 27-ఫిబ్రవరి-26 12:00 సంబంధిత స్టేషన్(లు)/రైలు(ళ్లు): ZN, ALER, వేలం వివరాలు: జనగాం మరియు ఆలేర్ రైల్వే స్టేషన్‌ల లొకేషన్ వద్ద ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు పార్కింగ్ లాట్.

క్ర.సం.7 కేటగిరీ : కేటరింగ్, పట్టిక నం.: SC-CATG-03-2026 వేలం ప్రారంభ తేదీ మరియు సమయం: 27-ఫిబ్రవరి-26 14:00. సంబంధిత స్టేషన్(లు)/రైలు(ళ్లు): CHZ, SC,BMT, SKZR వేలం వివరాలు: చర్లపల్లి, సికింద్రాబాద్, బేగంపేట మరియు సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌ల వద్ద వేర్వేరు కేటరింగ్ స్టాల్స్ కాంట్రాక్ట్‌లు.

క్ర.సం.8 కేటగిరీ : కేటరింగ్, పార్సెల్స్, పట్టిక నం.: SC- పార్సెల్-0326A వేలం ప్రారంభ తేదీ మరియు సమయం: 28-ఫిబ్రవరి-26 12:00. సంబంధిత స్టేషన్(లు)/రైలు(ళ్లు): 20967, 12026, 17041, 12774/73, 12791/92, 17007/08, 22718/17 వేలం వివరాలు: 1) 20967, 12026, 17041 రైళ్లకు SLR కోచ్‌లో పార్సెల్ స్పేస్ 2) 12774/73, 12791/92/ 17007/08, 22718/17 రైళ్లకు పార్సెల్ వ్యాన్‌లో పార్సెల్ స్పేస్.

క్ర.సం.9 కేటగిరీ : కేటరింగ్, పట్టిక నం.: SC-CATG-04-2026 వేలం ప్రారంభ తేదీ మరియు సమయం: 28-ఫిబ్రవరి-26. సంబంధిత స్టేషన్(లు)/రైలు(ళ్లు): CHZ, LPI వేలం వివరాలు: చర్లపల్లి మరియు లింగంపల్లి రైల్వే స్టేషన్‌ల వద్ద వివిధ లొకేషన్‌లకు వాటర్ వెండింగ్ మెషీన్‌లు కొరకు వేర్వేరు కాంట్రాక్ట్‌లు.

క్ర.సం.10 కేటగిరీ : MISC-స్టాటిక్, పట్టిక నం: MSS-GZ-ST-BS-28, వేలం ప్రారంభ తేదీ మరియు సమయం: 02-మార్చి-26, 13:00. సంబంధిత స్టేషన్(లు)/రైలు(ళ్లు): SJVP, KZJ, JET, BMT వేలం వివరాలు: 1) సంజీవయ్య పార్క్ రైల్వే స్టేషన్ వద్ద బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్‌ల యొక్క నిర్వహణ, మరియు ఆపరేషన్, స్థాపన కొరకు కాంట్రాక్ట్. 2) కాజీపేట రైల్వే స్టేషన్ పాత రైల్వే క్వార్టర్స్ వద్ద అందుబాటులో ఉన్న ఏరియాలో, ఫన్ జోన్ నెలకొల్పుటానికి కాంట్రాక్ట్. 3) జేమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్ వద్ద చాట్ స్టాల్‌లో ఫుడ్ ట్రక్స్/జ్యూస్ బార్ యొక్క ఆపరేషన్ మరియు నెలకొల్పుటానికి కాంట్రాక్ట్. 4) బేగంపేట రైల్వే స్టేషన్ వద్ద ఫాట్ స్టాల్‌లో ఫుడ్ ట్రక్స్/జూస్‌బార్ యొక్క నెలకొల్పుట మరియు ఆపరేషన్ కొరకు కాంట్రాక్ట్.

క్ర.సం.11 కేటగిరీ : ప్రకటనలు ఇవ్వటం, పట్టిక నం: ADVT-26-4 వేలం ప్రారంభ తేదీ మరియు సమయం: 02-మార్చి-26, 14:00. సంబంధిత స్టేషన్(లు)/రైలు(ళ్లు): KZJ, RDM, BPA, SKZR, JMKT, BMT, UDGR, LTRR, PRLI, CHZ వేలం వివరాలు: 1) కాజీపేట రైల్వే స్టేషన్ యొక్క కమర్షియల్ సర్క్యులేటింగ్ ఏరియాలో డిజిటల్ బోర్డ్‌ల ద్వారా కమర్షియల్ ప్రకటనలకు కాంట్రాక్ట్. 2) రామగుండం, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ మరియు జమ్మికుంట రైల్వే స్టేషన్‌ల యొక్క సర్క్యులేటింగ్ ఏరియాలు స్టాటిక్ హోర్డింగ్‌ల ద్వారా కమర్షియల్ ప్రకటనలకు కాంట్రాక్ట్. 3) బేగంపేట రైల్వే స్టేషన్ వద్ద పేర్కొనబడిన లొకేషన్ వద్ద యూనిపోల్/బై పోల్ ద్వారా ప్రకటనల యొక్క ప్రదర్శనకు కాంట్రాక్ట్. 4) ఉద్గీర్, లాటూర్ రోడ్ మరియు పర్లివైజ్‌నాథ్ రైల్వే స్టేషన్‌ల లోపల డిజిటల్ స్క్రీన్స్ ద్వారా ప్రకటనల కొరకు కాంట్రాక్ట్. 5) బేగంపేట రైల్వే స్టేషన్‌లోపల డిజిటల్ బోర్డ్‌ల ద్వారా కమర్షియల్ ప్రకటనలకు కాంట్రాక్ట్. 6) చర్లపల్లి రైల్వే టెర్మినల్ లోపల స్టాటిక్ బోర్డ్‌ల ద్వారా కమర్షియల్ ప్రకటనల యొక్క ప్రదర్శనకు కాంట్రాక్ట్.

ఆసక్తిగల పార్టీలు మరియు కాంట్రాక్టర్లు ఈ అంశాలు గమనించి మరియు ఇ-వేలం ప్రకటన గురించిన సవివర సమాచారానికి పైన పేర్కొన్నట్లు వెబ్‌సైట్‌ద్వారా వెళ్లవలెను.

విచారణలు/స్పష్టతల కొరకు, దయచేసి ఈ దిగువ సంతకందారుని యొక్క కార్యాలయాన్ని సంప్రదించండి.

సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్/సికింద్రాబాద్.

A2522


# బంగ్లాదేశ్ అధ్యక్షుడుగా మహ్మాద్ యూనస్!

## పదవి నుంచి దిగిపోతున్న ప్రస్తుత అధ్యక్షుడు షాబుద్దీన్



**ఢాకా, ఫిబ్రవరి 18:** బంగ్లాదేశ్ నూతన అధ్యక్షుడుగా ఇప్పటివరకు పనిచేసిన కేర్‌టేకర్‌చీఫ్ నోబెల్ పురస్కార గ్రహీత మహ్మాద్‌యూనస్‌ను నియమించాలని ప్రస్తుత పాలక ప్రభుత్వం యోచిస్తోంది. చీఫ్‌గా ఉన్న కాలంలోనే బిఎన్పీ నేతలపై ఉన్న కేసులు మొత్తం ఎత్తివేయడంతో యూనస్ పట్ల అపారమైన గౌరవాభిమానాలు పెంచుకున్న నేతలు ఆయన్ను సముచితంగా గౌరవించుకోవాలని చూస్తున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు మహ్మాద్ షాబుద్దీన్ ఆ పదవినుంచి దిగిపోతారని తద్వారా ఏర్పడిన ఖాళీని యూనస్‌తో భర్తీచేయవచ్చని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోంది. వాస్తవానికి షాబుద్దీన్ పదవీకాలం 2028 ఏప్రిల్‌వరకూ ఉంది. అయినా కూడా ఆయన పదవినుంచి దిగిపోయేందుకు అంగీకరించినట్లు తేలింది. యూనస్ నేతృత్వంలోని ప్రభుత్వం గౌరవం ఇవ్వడంలేదని గతంలో పలుమార్లు చెప్పిన షాబుద్దీన్ ఫిబ్రవరిలో బంగ్లా ఎన్నికలు జరిగిన అనంతరం పదవికి రాజీనామాచేస్తానని చెప్పారు. ఈ క్రమంలోనే యూనస్‌కు అధ్యక్షబాధ్యతలు రావచ్చునని జోరుగా ప్రచారం జరుగుతోంది.

అయితే బంగ్లా ప్రభుత్వం నుంచి అధికారికప్రకటన వెలువడాల్సి ఉంది. కాగా పదవిలోకొనసాగినంతకాలం యూనస్ భారత్‌పై తన ద్వేషాన్ని వెదజల్లుతూనే ఉన్నారు. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని షేక్ హసీనాను తమకు అప్పగించాలన్న డిమాండ్‌ను పెడచెవిన పెడుతోందని గతంలోకూడా పలు విమర్శలుచేసారు. అంతేకాకుండా చైనా, పాకిస్థాన్ కనుసన్నల్లో నడుస్తున్నారన్న విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. అంతేకాకుండా చైనాను తమ దేశంలో పెట్టుబడులకు అపార అవకాశాలున్నాయంటూ ప్రాధేయ పడిన సందర్భాలు కూడా లేకపోలేదు. వీటన్నిటికి తోడు పదవినుంచి దిగిపోతూ కూడా భారత్‌పై విషం కక్కినట్లు ఆయనపై విమర్శలు వెల్లువెత్తాయి. నిరంతరం ఈశాన్యంలో ఉన్న సెవెన్‌సిస్టర్స్ కూడా బంగ్లా నియంత్రణలోనివే అంటూ అసందర్భపు అనాలోచిత ప్రకటనలుచేసి భారతకు ఆగ్రహం రప్పించారు. యూనస్ అధ్యక్షుడుగా వచ్చినట్లయితే భారత్‌తో మధ్య సంబంధాలు మరింతగా క్షీణిస్తాయని అంతర్జాతీయ పరిశీలకులు కూడా చెపుతున్నారు. అలాగే బంగ్లాలో నివసిస్తున్న హిందూ మైనార్టీలకు రక్షణ మరింతగా కరువవుతుందన్న వాదన కూడా బలంగా వినిపిస్తోంది.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్య నాణ్యతపై ప్రత్యేక దృష్టి

## రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళా శాలల ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లు, అక్రిడిటేషన్‌లను మెరుగుపరచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి తెలిపారు. ర్యాంకింగ్‌లు, అక్రిడిటేషన్ పెరగడం వల్ల కళాశాలలకు నిధుల లభ్యత పెరుగుతుందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా కళాశాలల నాణ్యత పెంపొందుతుందని పేర్కొన్నారు. ఇందుకు పరిశోధన ఫలితాల, సైటేషన్లు, పేటెంట్లు, నిధులు పొందిన ప్రాజెక్టులు, విద్యాపరమైన అవగాహనను మరింత బలోపేతం చేయాల్సి న అవసరం ఉందని నొక్కి చెప్పారు.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్, నైతిక డేటా నిర్వహణ పద్ధతులపై సామర్థ్య పెంపు వర్క్‌షాప్‌ల ద్వారా ఉన్నత విద్యామండలి అవసరమైన మద్దతు ఇస్తోందని ఆయన తెలిపారు. ఈ మేరకు వంద రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా నేషనల్ ఇనిస్ట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)పై ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు ఉన్నత విద్యామండలి బుధవారం వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ సందర్భంగా ఆచార్య బాల కిష్టారెడ్డి మాట్లాడుతూ... ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లను కేవలం ఒక మూల్యాంకన సాధనంగా మాత్రమే కాకుం డా, అంతర్‌విభాగ పరిశోధన, ఆవిష్కరణలు, సంస్థా గత సహకారాల ద్వారా తెలంగాణ ఉన్నత విద్య యొక్క వ్యూహాత్మక వృద్ధికి ఒక రోడ్‌మ్యాప్‌గా చూడాలని పిలుపు నిచ్చారు. కాగా... ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్. కె. మహమూద్, ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ తదితరులు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌ల ప్రాముఖ్యత, డిగ్రీకళాశాలల సంస్థాగత అభివృద్ధిపై వాటి ప్రభావం గురించి వివరించారు.

ఈ వర్క్‌షాప్‌లో తెలంగాణ వ్యా ప్తంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుండి సుమారు 100 మంది కో ఆర్డినేటర్లు, నోడల్ ఆఫీసర్లు, సీనియర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో కోర్టులకు బాంబు బెదిరింపులు

## తమిళనాడు నుంచి వచ్చినట్లు అనుమానాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో పలు కోర్టులకు బుధవారం నాడు వచ్చిన బాంబు బెదిరింపులు తీవ్ర కలకలం రేపాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి సిబిఐ కోర్టుతో పాటు కరీంనగర్, రాజమండ్రి కోర్టులకు ఏకకాలంలో బాంబు బెదిరింపుల కాల్స్ రావడంతో అక్కడ రోజు వారి కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. అయితే ఈ బాంబు బెదిరింపుల వెనుక వున్న వ్యక్తులు తమిళనాడుకు చెందిన వారుగా పోలీ సులు అనుమానిస్తున్నారు. నాంపల్లి కోర్టుల ప్రాంగణంలో వున్న సిబిఐ కోర్టు నిత్యం బిజీగా వుండే కోర్టుల్లో ఒకటి. ఉదయం 11.30 గంటల సమ యంలో ఈ కోర్టులో బాంబు పెట్టినట్లు, ఇది 12.05 గంటలకు పేలుతుందని గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ ద్వారా వెల్లడించారు. ఆర్‌డిఎక్స్‌తో ఈ బాంబు తయారు చేసినట్లు వారు చెప్పారు. ఇదే సమయంలో కరీంనగర్, రాజమండ్రి కోర్టులకు కూడా బాంబు బెదిరింపుల కాల్స్ రావడంతో అక్కడి అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే ఆయా ప్రాంతాల కోర్టులతో పాటు వాటికి సమీపంలో గల ఇతర కోర్టుల ను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. జాగిలాలచేత సోదాలు చేయించి చివరకు ఎలాంటి పేలుడు పదార్థాలు, బాంబులు లేవని నిర్ధారించారు. దీంతో కో ర్టుల్లో వున్న న్యాయవాదులతో పాటు ఇతర సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. బాంబు బెదిరింపుల కారణంగా ఆయా కోర్టుల్లో నాలుగు గంటల పాటు రోజువారి కార్యకలాపాలకు ఆటంకం కలిగింది. కాగా ఈ బాంబు బెదిరింపుల వెనుక తమిళనాడుకు చెందిన వ్యక్తుల హస్తం వుందని పోలీసులు అనుమాని స్తున్నారు. బాంబు బెదిరింపుల ఫోన్ కాల్స్ తమిళనాడు పోలీసుల మెయిల్ పేరిట వుండడంతో ఈ అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తమిళనాడులో పోలీసులచేత నానా చాకిరి చేయిస్తున్నట్లు, అందు కే తాము బాంబులు పెడుతున్నట్లు ఆ మెయిల్‌లో వుంది. దీనిపై ఆయా ప్రాంతా ల పోలీసులు కేసులు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

# ఆరెపల్లి మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

## పెండింగ్ బిల్లుల విషయంలో లంచం అడిగిన కార్యదర్శి

**రాయపోల్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** గత ప్రభుత్వంలో రాయపోల్ మండలం ఆరెపల్లి మాజీ సర్పంచ్ రామన్నగారి కరుణాకర్ గ్రామ అభివృద్ధి కోసం పనులు చేశారు. ప్రస్తుతం గతంలో చేసిన పెండింగ్ బిల్లుల విషయంలో గ్రామ కార్యదర్శి లక్షా 50వేల రూపాయలు లంచం అడిగిందనే మనస్థాపంతో బుధవారం పురుగుల మందు డబ్బా తీసుకొని ఆరెపల్లి గ్రామ శివారులో ఉన్న వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డారు. సాయంత్రం 4 గంటల నుండి రాత్రి వరకు వాటర్ ట్యాంక్‌పై ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదరించాడు. గ్రామ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని, లేకపోతే ట్యాంక్ పైనుండి దూకి చనిపోతానని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న రాయపోల్ ఎంపిడివో, దౌల్తాబాద్ ఎస్ఐ, రాయపోల్ ఎస్ఐ అక్కడికి చేరుకొని మాజీ సర్పంచ్ కరుణాకర్‌కు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకుండా సుమారు ఆరు గంటల పాటు వాటర్ ట్యాంక్‌పై హల్‌చల్ చేశారు. గత ప్రభుత్వంలో రావాల్సి న బిల్లులు ఇవ్వాలంటే అంతపెద్దమొత్తంలో డబ్బులు అడుగుతున్నారని, ఇక చేసేదేమీలేక ఆత్మహత్యాయత్నంకు పూనుకున్నట్లు అక్కడ ఉన్న మీడియాకు కరుణాకర్ తెలిపారు. నాకు న్యాయం జరిగేలా చూడాలని, లేకపోతే ఆత్మ హత్య చేసుకుంటానని అన్నారు. రాత్రి వరకు వాటర్ ట్యాంక్‌పై ఉండడంతో గ్రామస్తులు అంతా భయాందోళనకు గురయ్యారు.



వాటర్ ట్యాంక్‌పై పురుగులమందు డబ్బాతో మాజీ సర్పంచ్ కరుణాకర్

# ఇక సిటీ బస్సుల్లోనూ లగేజ్ ర్యాక్స్ సౌకర్యం

## ప్రయోగాత్మకంగా తొలి విడత 150 బస్సుల్లో ఏర్పాటు

## త్వరలో మిగతా బస్సుల్లో బిగించాలని నిర్ణయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** బస్సుల్లో దూరప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులు బస్సెక్కగానే తమవెంట ఇచ్చుకున్న లగేజీని బస్సులో తమ సీట్ల పైభాగంలో ఉండే ర్యాక్స్ పైన పెట్టెయ్యడం చూస్తుంటాం.. దాంతో తమ వెంట తెచ్చుకున్న లగేజీ బరువు మోసే అవసరం వారికి ఉండదు. అయితే గ్రేటర్ పరిధిలో నడిచే సిటీ బస్సుల్లో ప్రస్తుతం ఆ సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు తమ వెంట తెచ్చుకున్న బ్యాగుల బరువు మోస్తూ నిలబడి ప్రయాణించాల్సి వస్తోంది. ఈ విషయంలో ప్రధానంగా విద్యార్థులు అధిక ఇబ్బందులకు గురవుతున్నారు. పలువురు ప్రయాణికులు లగేజీ సమస్యకు పరిష్కారం చూపాలని ఆర్టీసీ యాజమాన్యం దృష్టికి తెచ్చారు. అయితే అన్ని వేళల్లో బస్సుల్లో ఉండే రద్దీ నేపథ్యంలో ఈ సమస్య పరిష్కారానికి అవకాశం దొరకలేదు. ఈ అంశంపై సీరియస్‌గా దృష్టి సారించిన ఆర్టీసీ గ్రేటర్ పరిధిలో తిరిగే సిటీ బస్సుల్లో కూడా ప్రయాణికులు తమ వెంట తెచ్చుకున్న లగేజీని పెట్టుకునేందుకు ర్యాక్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సిటీ బస్సుల్లో ప్రయోగాత్మకంగా లగేజీ అటకలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. తొలుత రెండు బస్సుల్లో ఏర్పాటు చేసి పరిశీలించింది. ప్రయాణికుల అభిప్రాయ సేకరణ కోసం మొదటి విడతగా ప్రయోగాత్మకంగా 150 బస్సుల్లో ఏర్పాటు చేయనున్నారు. జిల్లా సర్వీసుల్లో ఉండేంత విశాలంగా కాకుండా, తక్కువ ఎత్తుతో ఉండేలా వాటిని ఏర్పాటు చేయనున్నారు.

కాగా తెలంగాణ ఆర్టీసీకి ప్రత్యేకంగా మియాపూర్లో బస్ బాడీ నిర్మాణ యూనిట్ ఉండడంతో ఈ ర్యాక్‌ల ఏర్పాటు బాధ్యత మియపూర్ బస్ బాడీ యూనిట్‌కే అప్పగించారు. ఇందుకు ఒక్కో బస్సు ను రూ. 15 వేల ఖర్చు అవుతుందని అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం 150 బస్సుల్లో ర్యాక్ ల ఏర్పాటు చేసే పని జరుగుతోంది. మరికొద్ది రోజుల్లో ఆ బస్సులు అటకలతో రోడ్డు ఎక్కనున్నాయి.

అయితే ర్యాక్‌లు ప్రయాణికులకు ఉపయోగకరమైన విధంగా ఉన్నాయా, సిటీ బస్సుల రద్దీ నేపథ్యంలో ప్రయాణికులు వాటిని వినియోగించు కుంటారా అనేది అధ్యయనం చేశాక హైదరాబాద్ పరిధిలో తిరిగే మిగతా సిటీ బస్సుల్లో వాటి ఏర్పాటుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.


**ఫారం- సి**

**నోటిఫికేషన్**

(చట్టంలోని సెక్షన్ 11 క్రింద, సెక్షన్ 10A మినహాయింపు ననుసరించి)

(రూల్ 6 /12 చూడుము)

**తెలంగాణ ప్రభుత్వము, రెవెన్యూ శాఖ**

జిల్లా కలెక్టర్ కార్యాలయం ఫైల్ నంబర్ జి/253/2026 — తేది: 18 . 02. 2026

రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం ఫైల్ నెంబర్.బి /2425/ 2026 — తేది : 11. 02. 2026

గెజిట్ నంబర్: [illegible]- 25 /2026 — తేది: 18. 02. 2026

ప్రజా ప్రయోజనము నిమిత్తం తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (TGIIC) లిమిటెడ్ ద్వారా ఇండస్ట్రియల్ పార్కులు స్థాపిం చుటకు, వికారాబాద్ జిల్లాలో దోమ మండలం కొండాయిపల్లి గ్రామంలో (Ac 85.03 Gts) ఎకరాల భూమి అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ వికారాబాద్ వారు భావించుచున్నారు.

మరియు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, టీజీఐఐసీ లిమిటెడ్, హైదరాబాద్ వారి వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ చేసిన అభ్యర్థనను జాగ్రత్తగా పరిశీలించి, G.O.Rt.No.16, పరిశ్రమలు & వాణిజ్య శాఖ (IP & INF), తేదీ 27.01.2026 ను జారీ చేసి, భూముల స్వాధీనము, పునరావాసం మరియు పునర్నిర్మాణంలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత కల్పించే హక్కు చట్టం, 2013 లోని అధ్యాయం–III-A లోని సెక్షన్ 10A ప్రకారం, భూముల స్వాధీనము, పునరావాసం మరియు పునర్నిర్మాణంలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత కల్పించే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం నం. 21/2017) ప్రకారం సవరించబడిన విధంగా, పై పరిశ్రమల ప్రాజెక్టు నిమిత్తం టీజీఐఐసీ లిమిటెడ్ కు అనుకూలంగా భూముల స్వాధీనానికి మినహాయింపును మంజూరు చేసింది.దీని ఫలితంగా, ఆ చట్టంలోని అధ్యాయాలు II మరియు III నిబంధనలు ఈ స్వాధీనానికి వర్తించవు.

అందుచేత, పై ప్రజాప్రయోజనార్థం, ఆ చట్టంలోని సెక్షన్ 11(1) ద్వారా కల్పించబడిన అధికారాలను వినియోగించి, వికారాబాద్ జిల్లా, దోమ మండలం కొండాయిపల్లి గ్రామంలో సుమారు ఎకరాలు 85.03 గుంటలు (మరియు/లేదా తక్కువ) విస్తీర్ణంలో, క్రింద షెడ్యూల్లో వివరించిన భూమిని స్వాధీనం చేయుటకు ప్రతిపాదించబడినదని ఈ ద్వారా తెలియజేయడమైనది.

**షెడ్యూలు**

జిల్లా : వికారాబాద్ — మండలము : దోమ — గ్రామము : కొండాయిపల్లి

| క్రమ సంఖ్య | సర్వే నెంబర్ | [illegible] | భూమి రకం | విస్తీర్ణం | పట్టాదారుని పేరు | సరిహద్దులు: తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | చెట్లు | | కట్టడములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 190 | [illegible] | ఖుష్కి/తరి | 1.18 | మల్లయ్య నందిపేట | [illegible] | [illegible] | [illegible] | [illegible] | - | - | - | - |
| 2 | 100 | [illegible] | ఖుష్కి/తరి | 18.05 | పరంపోగు సర్కారి | [illegible] | [illegible] | [illegible] | [illegible] | - | - | - | - |
| | | | | | తెడ్డు చిన్నయ్య | | | | | | | | |
| | | | | | గువ్వలి సాయన్న | | | | | | | | |
| | | | | | గువ్వలి మోగులయ్య | | | | | | | | |
| | | | | | గంగుల పద్మమ్మ | | | | | | | | |
| | | | | | నల్లి అంజిలయ్య | | | | | | | | |
| | | | | | నల్లి నర్సిములు | | | | | | | | |
| | | | | | చింతకింది చెన్నయ్య | | | | | | | | |
| | | | | | చింతకింది దస్తయ్య | | | | | | | | |
| | | | | | చింతకింది క్రిష్టయ్య | | | | | | | | |
| | | | | | చింతకింది అంజిలమ్మ | | | | | | | | |
| | | | | | నేతి ఆనంద | | | | | | | | |
| | | | | | నేతి మణెమ్మ | | | | | | | | |
| | | | | | నేతి సువర్ణ | | | | | | | | |
| | | | | | నెత్తి అంజిలయ్య | | | | | | | | |
| | | | | | హరిజన్ నర్సయ్య | | | | | | | | |
| | | | | | కిష్టాపూర్ భీమమ్మ | | | | | | | | |
| 3 | 171 | [illegible] | ఖుష్కి/తరి | 3.19 | ప్రభుత్వ భూమి | [illegible] | [illegible] | [illegible] | [illegible] | - | - | - | - |
| | | | | | కావలి రాములు | | | | | | | | |
| 4 | 173 | [illegible] | ఖుష్కి/తరి | 13.13 | ప్రభుత్వ భూమి | [illegible] | [illegible] | [illegible] | [illegible] | - | - | - | - |
| | | | | | హనుమయ్య సంజపోళ్ళ | | | | | | | | |
| | | | | | ఆసురుకుంట వెంకటమ్మ | | | | | | | | |
| | | | | | వార్ల వెంకటమ్మ | | | | | | | | |
| | | | | | వార్ల అంజమ్మ | | | | | | | | |
| 5 | 176 | [illegible] | ఖుష్కి/తరి | 5.34 | గైరాన్ సర్కారి | [illegible] | [illegible] | [illegible] | [illegible] | - | - | - | - |
| | | | | | బుకని మల్లయ్య | | | | | | | | |
| | | | | | గున్నమ్మవాండ్ల దస్తమ్మ | | | | | | | | |
| 6 | 243 | [illegible] | ఖుష్కి/తరి | 35.17 | పరంపోగు సర్కారి | [illegible] | [illegible] | [illegible] | [illegible] | - | - | - | - |
| | | | | | బిచ్చప్ప | | | | | | | | |
| | | | | | కనపర్తి ఈశ్వ ర చారి | | | | | | | | |
| | | | | | నిమ్మలి నర్సమ్మ | | | | | | | | |
| | | | | | N.సునీత | | | | | | | | |
| | | | | | కౌసల్య | | | | | | | | |
| | | | | | నిమ్మలి వెంకటమ్మ | | | | | | | | |
| | | | | | నిమ్మలి ఆశమ్మ | | | | | | | | |
| | | | | | నంది పెట మోగులమ్మ | | | | | | | | |
| | | | | | నందిపెట రవి కుమార్ | | | | | | | | |
| 7 | 89 | [illegible] | ఖుష్కి/తరి | 7.17 | రంగప్పగారి నర్సింహరెడ్డి | [illegible] | [illegible] | [illegible] | [illegible] | - | - | - | - |
| | | | | | కొత్తూర్ బాస్కర్ రెడ్డి | | | | | | | | |
| | | | | | కొత్తూర్ శ్రీనివాస్ రెడ్డి | | | | | | | | |
| | | | | | కోతురు రోహిణి | | | | | | | | |
| | | | | | కే రాఘవేందర్ రెడ్డి | | | | | | | | |

మొత్తం విస్తీర్ణం Ac. 85.03 Gts

ఈ నోటిఫికేషన్ భూసేకరణ, పునరావాసం మరియు పునర్నిర్మాణంలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత కల్పించే హక్కు చట్టం, 2013 (కేంద్ర చట్టం నం. 30/2013) లోని సెక్షన్ 11(1) ప్రకారం, తెలంగాణ సవరణ చట్టం, 2016 (చట్టం నం. 21/2017) ద్వారా సవరించబడిన విధంగా జారీ చేయబడింది.

అధ్యాయం–III-A లోని సెక్షన్ 10A కింద మంజూరు చేయబడిన మినహాయింపును దృష్టిలో ఉంచుకొని, ఈ భూసేకరణకు ఆ చట్టంలోని అధ్యాయాలు II మరియు III నిబంధనలు వర్తించవు.

భూమి ప్లాన్ ను జిల్లా కలెక్టర్ కార్యాలయం, వికారాబాద్/ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, వికారాబాద్ డివిజన్, వికారాబాద్ జిల్లాలో ఏ పనిరోజునైన కార్యాలయ పనివేళలో తనిఖీ చేసుకోవచ్చును. ఏ భూమిలోకైన ప్రవేశించి, భూమిని సర్వే చేసి, లెవెల్స్ తీసుకునేందుకు, సబ్ సాయిల్ లోకి త్రవ్వేందుకు లేదా బోరు వేయుటకు మరియు సదరు చట్టంలోని సెక్షన్ 12 లో ఏర్పాటు చేసిన మరియు నిర్దేశించిన ప్రకారం వారి పని ఈవిధంగా నిర్వహించేందుకు అవసరమగు అన్ని ఇతర చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ డివిజనల్ అధికారి, వికారాబాద్ డివిజన్, వికారాబాద్ జిల్లా మరియు వారి సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వము / కలెక్టర్ –కమ్ –అఫీషియేట్ గవర్నమెంట్ అధికారం ఇచ్చింది.

చట్టం లోని సెక్షన్ 11 (4) క్రింద కలెక్టర్ ఏ ఒక్క ముందస్తు ఆమోదం లేకుండా ఈ ప్రకటన ప్రచురించబడిన తేదినుండి ఏ వ్యక్తి అట్టి భూమిపైన ఎటువంటి వ్యవహారం అంటే అమ్మకం/కొనుగోలు మొ॥వి చేయరాదు లేదా అట్టి భూమిపై ఎటువంటి ఋణభారాలు కల్పించరాదు.

భూసేకరణకు అభ్యంతరాలు ఏవైనా వుంటే మరియు నష్టపరిహారం యొక్క సంప్రదింపుల ద్వారా పరిష్కారం కోసం ప్రయోజనం గల /ప్రభావానికి గురైన వ్యక్తులందరి నుండి క్లైయిమ్ ను చట్టం లోని సెక్షన్ 15 క్రింద ఏర్పాటు చేసిన విధంగా ఈ ప్రకటన ప్రచురించిన తేది నుండి 60 ( అరవై ) రోజులలోగా ప్రయోజనం గల వ్యక్తులు జిల్లా కలెక్టర్ వారి సమక్షంలో దాఖలు చేయవచ్చును.

సం/- తహశీల్దార్, దోమ మండలం

సం/- రెవెన్యూ డివిజనల్ అధికారి / L.A.O. వికారాబాద్ డివిజన్

సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వికారాబాద్ జిల్లా

సం/- కలెక్టర్, వికారాబాద్ జిల్లా

DIPR No.1195/LA-PP/Advt/Agency/2025-26

వార్త

కోపాన్ని జయించలేనివాడికి ఇతరుల సామర్థ్య లోపాన్ని విమర్శించే హక్కు ఉండదు.

-ఇ. గిబ్బన్

# ఎఐకి భారత్ చుక్కాని?

ప్రపంచాన్ని ఏకతాటిపైకి తీసుకురావడమంటే మాటలా? కానీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పుడు అదే పనిలో ఉంది. ఎంతో వేగవంతంగా మార్పులు చెందుతూ భవిష్యత్ ఎన్ని చిత్ర విచిత్రాలు చూడాల్సి వస్తుందోనని భయపెడుతున్న తంత్రం 'కృత్రిమ మేధ'. ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ విప్లవం ఒకే రంగానికే పరిమితం కాలేదు. అన్ని రంగాల్లోకి చొచ్చుకుపోతోంది. భారతదేశ దార్శనికతను ఆవిష్కరించే ప్రయత్నంలో భాగంగా గత రెండు రోజులుగా ఇండియా ఎఐ ఇంపాక్ట్ 2016 సమిట్ జరిగింది. ఎన్నో దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు సమస్త ప్రపంచానికీ అర్థమయ్యే రీతిలో ఎఐ ప్రభావంతమైన అంశాలను క్రోడీకరించి సదస్సు ముందుంచారు. భారత్ తన ఎఐమౌలిక సౌకర్యాలను బలోపేతం చేయాలన్న దృష్టిలో 'ఎఐ ఇండియా వన్' అనే సూపర్ కంప్యూటర్ రూపకల్పన దిశగా ప్రణాళిక బద్ధ చాతుర్యాన్ని ప్రకటించింది. కృత్రిమ మేధను నైతికంగా అభివృద్ధి చేయడమొక్కటే ప్రపంచ యవనిక మీద ముఖ్యాంశంగా ఉంది. ఈ నేపథ్యంలోనే అందుకోసం భారత్ ఒక నిర్దిష్టమైన ఆలోచనలుచేస్తోంది. భారత్‌ను ఎఐ వినియోగదారుగా కాకుండా ఎఐ సృష్టికర్తగా మార్చాలనే ఆశ, ఆకాంక్షలను ప్రధాని సమ్మిట్‌లో నిర్ద్వంద్వంగా ప్రకటించారు. ఎన్నోదేశాల ఎఐ మేధావులు పాల్గొన్న సభలో భారత్ నేతలు ఎంతో గంభీరంగా ప్రకటించారు. ఎఐ విప్లవంలో భాగస్వామిగానే కాకుండా మానవ సామర్థ్యాన్ని అసాధారణ రీతిలో కృత్రిమ మేధ రూపొందిస్తున్నా రానురాను 'కంప్యూటర్'లలో హ్యూమన్ టచ్ మాయమైపోతుందన్న హెచ్చరికలు ఎల్లడలా ఆశ్చర్య పరుస్తుతున్నాయి. గత కొంతకాలంగా ఎఐ సాంకేతిక గూర్చి పూర్తి అవగాహన ఉన్న మేధావులు ఎఐ కారణంగా ఎన్నో మానవ వనరులకు పని లేకుండాపోతుందనే హెచ్చరికలున్నాయి. వాటిని తట్టుకుని నిలబడే ప్రత్యామ్నాయాలపై కృత్రిమ మేధ అనుచితంగా దుర్వినియోగపరిచే స్థితిని ఎలా కట్టడి చేయాలన్న అంశంపై తీవ్ర చర్చ జరిగింది. తాజాగా ఇండియా ఎఐ సదస్సు భిన్న ఆలోచనలు విభిన్న ఇన్నోవేషన్ల కూడలిగా మారింది. ప్రధాని 'ఎక్' పోస్టులో ఇదే అంశాన్ని స్పష్టం చేశారు. ఎఐని బాధ్యతాయుతంగా వినియోగించుకోవడం ద్వారా మానవ ప్రగతికి బాటలు వేయడంలో భారత్ చిత్తశుద్ధిని అవలంబించాల్సి ఉంది. ఎఐ సృష్టిలో స్మార్ట్‌పలు, పరిశోధనా సంస్థ, సాంకేతికవ్యవస్థల రూపకల్పనకు మౌలిక వనరులు పుష్కలంగా ఉన్నాయి. కానీ కృత్రిమ మేధలో సృష్టించబడే అనుచిత, అసంకల్పిత వ్యవస్థలను ఎలా కట్టడి చేయాలో తెలియని అస్పష్టతతో గందరగోళపడుతోంది. సరైన మార్గనిర్దేశకత్వం లేకుంటే సామాజిక పునాదులకే ఎఐ సవాల్ విసురుతుందన్న విషయం సర్వవిదితమే. అన్ని రంగాల్లో ఎఐ ప్రభావం గణనీయంగా కనిపిస్తోంది. ఆరోగ్య వ్యవసాయ రంగంలో ఇప్పటికే కృత్రిమ మేధ సహాయంతో అద్భుతాలు జరుగుతున్నాయి. ఇవి భారత్‌లో కళ్లెదుట కన్పిస్తున్నాయి. వికసిత్ భారత్ 2047 లక్ష్యసాధనకు ఎఐ అతి కీలకంకానుంది. దేశంలో పట్టణ, గ్రామీణ అంతరాలను తగ్గించి అందరికీ సమానావకాశాల కల్పనకు దోహదం చేయడం ద్వారా సమ్మిళిత వృద్ధి సాధ్యమై మానవ, వికాసం కల్గుతుందని వ్యాఖ్యాకర్తలు అభిప్రాయపడుతున్నారు. భారత్ విషయానికి వస్తే ఆరోగ్యరంగంలో ప్రాథమిక జిల్లా, కేంద్రాల్లోని వైద్య కేంద్రాల్లో పలు వ్యాధుల ముందస్తు గుర్తింపు విషయంలో కృత్రిమ మేధ ఆధారిత పరిష్కారాలు ఆరోగ్యాభ్యుదయాన్ని పెంపొందిస్తున్నాయి. దీని పర్యవసానంగా జనంలో రోగనిరోధకత స్థాయిలు పెరుగుతాయి. విద్యారంగంలో విద్యార్థుల మనోవికాసానికి బాగా ఉపయోగపడుతున్నాయి. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సజావుగా చేరుతున్నాయి. ప్రభుత్వ వ్యవస్థల పారదర్శకత పెంపులో ప్రాధాన్యత కలిగిన సేవలను అందుకోగలుగుతున్నాము. ప్రాచీన రాత ప్రతుల డిజిటలీకరణ వంటి అంశాలో భారతీయ వారసత్వ సంపద సంరక్షణలో కీలక పాత్ర వహిస్తోంది. ఇవన్నీ తెలిసినవి. తెలియని వైవిధ్యతలు ఎన్నెన్నో ఉన్న రోజుల్లో కృత్రిమ మేధ వ్యాప్తి అంతుపట్టలేని ప్రాధాన్యత సంతరించుకుంటుంది. ప్రపంచంలో అతిపెద్ద కృత్రిమ మేధ సదస్సు జరుగుతున్న తరుణంలో అనేక వికారాలు కూడా బయటపడుతున్నాయి. సుప్రీం కోర్టులో ఎఐ టూల్స్‌తో రూపొందించబడిన ఓ పిటిషన్ విషయంలో న్యాయమూర్తులు తల్లడిల్లిపోయారు. అవాంఛనీయ కాల్పనిక తీర్పులను ఉదహరిస్తూ తయారైన పిటిషన్లను చూసి ఆవేదన వ్యక్తంచేశారు. మానవ మేధస్సునుపయోగించే కళ తగ్గిపోయిందని వాపోయారు. ఇలాంటి అవాంఛితాలను కట్టడి చేసే విషయంలో మానవ మేధస్సుకు పదునుపెట్టాల్సిన అవసరం ఏమాత్రం తగ్గిపోలేదు. అంతేతప్ప అన్నీకృత్రిమ మేధతోనే జరుగుతాయని, మనం చేసే పని ఏమీఉండదని మానవుల్లో అభిప్రాయం కలిగితే జాతి నిర్వీర్యం అయ్యే అవకాశం ఉంది. ఎఐ మానవ సామర్థ్యాలను ఎంత మెరుగుపరిచినా అత్యంత కీలకమైన తుది నిర్ణయాధికారం వ్యక్తుల దగ్గరే ఉండాలి. డీప్‌ఫేక్ వీడియోలపైన ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. ఎఐతోసృష్టించే ఎలాంటి కంటెంట్‌కైనా వాటర్‌మార్కింగ్, డేటా రక్షణ వాటిజాగ్రత్తలు అవసరమంటున్నారు. ఢిల్లీలో జరిగిన ఎఐ సదస్సుకు 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' అనే థీమ్‌తో ప్రపంచ మానవాళి సౌఖ్యానికి ఎఐ పురోగమనాన్ని స్వాగతించదగిన పరిణామం. ప్రపంచ భవితకు ఎఐ అనే వాదంతో ఈ సమ్మిట్‌లో పాల్గొంటారు. కనుక భారత్ లక్ష్యం నెరవేరినట్లే!

మనకు ఉన్న సంపదతో సంతృప్తి పడడం ఉత్తమం. మనకి ఉన్న జ్ఞానం సరిపోతుందనుకోవడం అజ్ఞానం.



సర్వేపల్లి రాధాకృష్ణన్

చాలా మంది లోభులవడం వల్ల ఎందరో ఆకలితో అలమటిస్తున్నారు. ఇతరులతో పంచుకోవడం ఎలాగో తెలుసుకుంటే సమస్య ఉండదు.



వి.జాన్సన్

# అవినీతికి తెరపడేదెప్పటికి?

**మనదేశంలో అవినీతిని అరికట్టడానికి బాధ్యతాయుతమైన పౌరులు, పాలకులు, సమాజంలో నీతి నిజాయితీపై అవగాహన కల్పించడం, పాఠశాల స్థాయి నుండి విలువలతో కూడిన విద్యతో పాటు అవినీతిపై అవగాహన కల్పించడం, ఈగవర్నెన్స్ సాంకేతికత, కఠినమైన చట్టాలు, పారదర్శకత, బాధ్యతాయుత ఉద్యోగస్వామ్యము లాంటివి అవసరం. ఎలక్ట్రానిక్ మనీ, డిజిటల్ లావాదేవీలు, డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్ఫర్, ఈ టెండరింగ్, సత్వర సమాచార హక్కు చట్టం లాంటి వాటి ద్వారా అవినీతిని తగ్గించవచ్చు. ప్రభుత్వ సేవ లను డిజిటల్‌మయం చేయడం వలన ప్రజలు, అధికారుల మధ్య ముఖాముఖి సంబంధాలను పరిమితం చేయడం చేత అవినీతిని తగ్గించవచ్చు. గవర్నమెంట్ ఈ మార్కెటింగ్ విధానం చేత మార్కెట్లలో దళారీల వ్యవస్థలు పరిమితం చేసి అవినీతి తగ్గించవచ్చు.**



డా. కావలి చెన్నయ్య

జర్మనీలోని బెర్లిన్ కేంద్రంగా పనిచేసే ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ అనే సంస్థ 182 దేశాల అవినీతిని పరిగణనలోకి తీసుకొని తయారుచేసిన నివేదిక కరప్షన్ పర్సెప్షన్ ఇండెక్స్ (సిపిఐ) ప్రకారం అవినీతి సూచిలో స్వల్పంగా మెరుగుపడి భారత్ 39 స్కోర్‌తో 91వ ర్యాంకులో నిలిచింది. గత సంవత్సరంతో పోలిస్తేభారత్ స్థానం స్వల్పంగా మెరుగుపడినట్లు తెలుస్తున్నది. 2024 నివేదిక ప్రకారం 96 ర్యాంకులో నిలిచింది అంటే 2025 నివేదిక ప్రకారం ఐదు స్థానాలు మెరుగుపరచుకొని 96నుండి 91కి చేరుకుంది. ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ సూచిలో ఏ దేశానికైనా 100 స్కోరు ఉంటే వాటిని అవినీతిరహిత దేశంగా పేర్కొనవచ్చు. 0(జీరో) స్కోరు ఉంటే తీవ్రమైన అవినీతి ఉన్నట్లు. ఈ సంవత్సరం ప్రపంచ సగటు స్కోరు 42కాగా ఆసియా పసిఫిక్ సగటు స్కోరు 45గా నమోదయింది. భారతదేశ సగటు మాత్రం ఈ రెండు సగటుల కంటే తక్కువగా అంటే 39గా ఉండడం గమనించవచ్చు. గత 10 సంవత్సరాలుగాట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ ఆసియా పసిఫిక్ సలహాదారు ఇల్హాం మొహమ్మద్ అభిప్రాయం ప్రకారం ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అవినీతి నిరోధక చర్యల ప్రగతి చాలా నెమ్మదిగా ఉన్నట్లు తెలుస్తుంది. ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాలలో అవినీతి, లంచగొండితనం, ప్రభుత్వ పాలనా పనితీరుపై భారీ ఎత్తున నిరసనలు, అల్లర్లు జరిగినట్లు తెలుస్తున్నది. ఈ ప్రదేశంలోని చాలా దేశాలలో జవాబుదారి తనంలేని నాయకత్వం, బలహీనమైన చట్టాలు, నిధుల వినియోగంలో పారదర్శకత లోపించడంతో సుపరిపాలనను దెబ్బతీస్తున్నాయి అని ఇల్హామ్ మొహమ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. దక్షిణాసియా దేశాలైన బంగ్లాదేశ్ 24స్కోర్‌తో 150వ స్థానంలో, పాకిస్థాన్ 28 స్కోర్‌తో 135వ స్థానంలో ఉండగా అత్యంత తక్కువ అవినీతి గల దేశంగా డెన్మార్క్ వరుసగా 7వ ఏడాది కూడా ప్రపంచంలోనే అత్యంత అవినీతి రహిత దేశంగా ప్రథమ స్థానంలో నిలిచింది. సీపీఐ ఇండెక్స్‌లో ఆ దేశానికి 90 స్కోరు లభించింది. తర్వాతి స్థానాల్లో ఫిన్లాండ్(88),సింగపూర్(84),న్యూజిలాండ్ (83), లక్సెంబర్గ్(81), నార్వే(81), స్విట్జర్లాండ్(81), స్వీడన్(80), నెదర్లాండ్స్ (78), ఆస్ట్రియా(77) చోటు సంపాదించుకున్నాయి. నివేదికల ప్రకారం పశ్చిమ ఐరోప దేశాలలో అవినీతి తక్కువగా కనిపిస్తుంది. తూర్పు ఐరోపా, మధ్య ఆసియా దేశాలలో కూడా అవినీతి ఎక్కువేనని నివేదికలు చెబుతున్నాయి. అతి ఎక్కువ అవినీతి గలిగిన దేశాలు సోమాలియా, దక్షిణ సుడాన్, సిరియా, వెనిజులా, ఎరిత్రియ లాంటి దేశాలు చాలానే ఉన్నాయి. ప్రపంచవ్యాప్త అవినీతి వలన ప్రపంచ జిడిపిలో సుమారు 5ట్రిలియన్ యుఎస్ డాలర్లు నష్టపోతున్నట్లు నివేదికలు తెలుపుతున్నాయి.మనదేశంలో అవినీతిని అరికట్టడానికి బాధ్యతాయుతమైన పౌరులు, పాలకులు, సమాజంలో నీతి నిజాయితీపై అవగాహన కల్పించడం, పాఠశాల స్థాయి నుండి విలువలతో కూడిన విద్యతో పాటు అవినీతి పై అవగాహన కల్పించడం, ఈ గవర్నెన్స్ సాంకేతికత, కఠినమైన చట్టాలు, పారదర్శకత, బాధ్యతాయుత ఉద్యోగస్వామ్యము లాంటివి అవసరం.



ఎలక్ట్రానిక్ మనీ, డిజిటల్ లావాదేవీలు, డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్ఫర్, ఈ టెండరింగ్, సత్వర సమాచార హక్కు చట్టం లాంటి వాటి ద్వారా అవినీతిని తగ్గించవచ్చు.ప్రభుత్వ సేవలను డిజిటల్‌మయం చేయడం వలన ప్రజలు, అధికారుల మధ్య ముఖాముఖి సంబంధాలను పరిమితంచేయడం చేత అవినీతిని తగ్గించవచ్చు. గవర్నమెంట్ ఈమార్కెటింగ్ విధానం చేత మార్కెట్లలో దళారీల వ్యవస్థలు పరిమితం చేసి అవినీతి తగ్గించవచ్చు. ప్రభుత్వ అనుమతులు, నిబంధనల సరళీకరణ ప్రక్రియలు, ఈప్రొక్యూర్మెంట్ లాంటి పద్ధతులను పాటించి పారదర్శకతలు పెంచవచ్చు. కఠినమైన చట్టాలను అమలు చేయడంవలన ప్రజలను అవినీతి అంటే భయం ఏర్పడి, అవినీతికి దూరంగా ఉండే అవకాశం ఏర్పడుతుంది. చట్టాల పరంగా చూసినప్పుడు ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ 1988,ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ 1988 మొదలైన చట్టాలను కఠినంగా అమలు చేయడం. సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా లబ్ధిదారులకు చేరేటట్లు ఆధార్ ద్వారా వారి బ్యాంకు ఖాతాలలో జమ చేయడం వలన మధ్యవర్తుల ప్రమేయం తగ్గిపోతుంది. అవినీతిని బయటపెట్టే వారిని రక్షిస్తూ అవినీతికి వ్యతిరేకంగా ప్రజలలో అవగాహన కల్పించడం, అవినీతికి పాల్పడిన వారిపైన కఠినచర్యలు తీసుకోవడానికి గాను అవినీతి కేసులను త్వరితగతిన పరి ష్కరించేందుకు వేగవంతమైన న్యాయ విచారణ వ్యవస్థను సమకూర్చాలి. కుటుంబ పెద్దలు, తల్లి దండ్రులు వారి పిల్లలకు చిన్ననాటి నుండి పాపభీతి గురించి వివరించాలి. అవినీతి అనేది వివిధ రకాల పద్ధతులతో అనగా లంచం, దుర్వినియోగం, బంధుప్రీతి, దోపిడీ, కిక్ బ్యాంకులు, మోసం, మనీలాండరింగ్ ద్వారా జరుగుతున్నది. 2007నుండి దేశంలో అవినీతికి వ్యతిరేకంగా ఇండియా అగెనెస్ట్ కరప్షన్(ఐఎసి) అనే స్వచ్ఛంద సంస్థలో విభేదాల కారణంగా అవినీతికి వ్యతిరేకంగా అరవింద్ కేజ్రీవాల్ ఆధ్వర్యంలో ఆమ్ ఆద్మీపార్టీ ఏర్పాటు అయింది. అవినీతికి వ్యతిరేకంగా ఏర్పాటు అయినా మొదటి పార్టీగా ఎపిపిను గుర్తించవచ్చు. (టిఐఐ)ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ ఇండియా అనేస్వచ్ఛంద సంస్థ అవినీతికి వ్యతిరేకంగా పనిచేస్తూ దేశంలోని సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న అవినీతి సమస్యలను అర్థం చేసు కోవడంలోను, విస్తృతమైన అవగాహన నైపుణ్యాలను కలిగి ఉన్నది. దేశంలో ప్రముఖమైన అవినీతి వ్యతిరేక ఉద్యమకా రుడు అన్నా హజారే న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అవినీతికి వ్యతిరేకంగా నిరాహార దీక్ష ప్రారంభించడం వలన ఈఉద్యమం కొత్తపుంతలు తొక్కింది. జన లోక్‌పాల్ బిల్లును పాస్‌చేయించి అవినీతిని నిర్మూలించాలని ఈ ఉద్యమ అంతిమ లక్ష్యం.2005 ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేష నల్ సంస్థ నివేదిక ప్రకారం మనదేశంలో 62 మంది, 2008 నివేదిక ప్రకారం 50మంది ప్రత్యక్షంగానో పరోక్షంగానో లంచాలు ఇచ్చి పని చేయించుకున్న వారేనని తెలుస్తున్నది. దేశంలో అవినీతికి కారణాలను విశ్లేషిస్తే అపారదర్శక బ్యూరోక్రసి, విచక్షణ అధికారాలు గల్గిన ప్రభుత్వ కార్యాలయాలు అధికారులు, అధిక నిబంధనలు కలిగిన వ్యవస్థ, సంక్లిష్టమైన పన్ను లైసెన్సింగ్ విధానం, కొన్ని వస్తువులు సేవల పంపిణీ పై ప్రభుత్వ నియంత్రణలో ఉన్న సంస్థల గుత్తాధిపత్యం పారదర్శక ప్రక్రియ చక్కగా లేకపోవడం, ముఖ్యంగా చాలామంది ప్రజలు చైతన్యవంతులు కాక అవినీతిని ఎదిరించకపోవడం లాంటి కారణాలుగా గుర్తించవచ్చు. దేశంలో అవినీతిని నిర్మూలించడానికి 1964లో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఏర్పాటు చేశారు.దీనికి 2003లో చట్టబద్ధ హోదా కల్పించారు. ప్రభుత్వ పనులకు చట్ట విరుద్ధంగా డబ్బులు తీసుకోవడం, పనులను చేయడానికి అనైతిక పద్ధతులను అవలంబించడం, ప్రభుత్వ అధికారులు ప్రజల నుండి పనుల నిమిత్తం అక్రమంగా డబ్బులు తీసుకోవడం లాంటివి అరికట్టడంలో సివిసి పనిచేస్తుంది. ఏది ఏమైనా ప్రజలు, ప్రభుత్వాలు, వ్యవస్థలు కలిసికట్టుగా అవినీతి రహిత దేశానికి పాటుపడాలి. ●

# శ్రీవారి సులభదర్శనం కోసం నిరీక్షణ

అప్పన్న గొనప


తిరుమల శ్రీవారి దర్శనం సామాన్యులకు మృగ్యం అవుతోందా? అనే ప్రశ్న ఈ మధ్యకాలంలో భక్తుల మనసుల్లో కలుగుతున్న ఆవేదనను ప్రతిబింబిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ఆధ్యాత్మిక ఆశ్రయంగా నిలిచిన తిరుమల తిరుపతి దేవస్థానాలు నిర్వహిస్తున్న తిరుమల వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రతిరోజూ వేలాది మంది భక్తులతో కిటకిటలాడుతోంది. పర్వదినాలు, సెలవుదినాలు, ప్రత్యేక ఉత్సవాల సమయంలో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. ఇంతటి విస్తారమైన భక్త సమూహాన్ని సమర్థంగా నిర్వహించడం ఒక మహత్తర బాధ్యత. అయినప్పటికీ, సాధారణ భక్తుడి అనుభవం ఎంతవరకు సౌకర్యవంతంగా ఉందో సమీక్షించాల్సిన అవసరంకనిపిస్తోంది. పాలక మండలి బాధ్యతలు స్వీకరించి దాదాపు రెండేళ్లు కావస్తున్న సమయంలో దర్శన వ్యవస్థలో గణనీయమైన మార్పులు ఆశించిన స్థాయిలో కనిపించలేదనే భావన వ్యక్తమవుతోంది. ఒక గంటలో ఉచిత దర్శనం అనే భావన ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ, అనేక సందర్భాల్లో క్యూలైన్లలో వేచిచూసే సమయం ఎక్కువగానే ఉంటోంది. ముఖ్యంగా రద్దీ రోజుల్లో భక్తులు గంటల తరబడి వేచిచూడాల్సివస్తోంది. ఇది చిన్న పిల్లలతో, వృద్ధులతో వచ్చే కుటుంబాలకు కష్టసాధ్యంగా మారుతోంది. ఉచిత దర్శనం అందరికీ సమాన అవకాశాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఉన్నప్పటికీ, ప్రాక్టికల్ అమలులో మరింత సమన్వయం అవసరం అనిపిస్తోంది.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు మూడు నెలలముందుగానే ఆన్‌లైన్‌లో విడుదలవుతున్నాయి. డిజిటల్ విధానం వేగవంతమైనదే అయినప్పటికీ, విడుదలైన కొద్దిసమయంలోనే టికెట్లు పూర్తవుతున్నాయి. దీనివల్ల అనేక మంది భక్తులు బుకింగ్ పొందలేక నిరాశ చెందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల భక్తులకు, సాంకేతిక పరిజ్ఞానం లేనివారికి ఇది ఒక సవాలుగా మారుతోంది. ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థను మరింత సులభతరం చేసి, సమాన అవకాశాలు కల్పించే విధంగా అదనపు స్లాట్లు లేదా పరిమిత ఆఫ్‌లైన్ కోటాలను పరిశీలించడం సముచితం.వృద్ధులు,దివ్యాంగుల దర్శన కోటా కూడా పూర్తిగా ఆన్‌లైన్‌కు పరిమితమవడంతో, అందరికీ సమానంగా అందుతోందా అన్న అంశం విశ్లేషణకు అవసరం. కోటా విడుదలైన వెంటనే పూర్తవుతుండటంతో అనేక కుటుంబాలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సి వస్తోంది. భౌతికంగా కొండపై పరిమిత టోకెన్లు ఇవ్వడం, లేదా జిల్లా కేంద్రాల్లో సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా ఈ సమస్యను కొంతవరకు తగ్గించవచ్చు. సిఫార్సు దర్శనాలు, విఐపీ కోటాలు కూడా సమతుల్యంగా నిర్వహించాల్సిన అంశాలుగా ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, దాతలకు ప్రత్యేక సదుపాయాలు ఉండటం పరిపాలనా పరంగా సాధారణమే. అయితే రోజువారీగా కోటాల వివరాలు, వినియోగ శాతం వంటి సమాచారం పారదర్శకంగా అందిస్తే అపోహలు తగ్గుతాయి. దర్శన వ్యవస్థలో సమానత్వం అనేభావన బలపడటానికి ఇది అవసరం. జిల్లా కేంద్రాల్లో ఒకప్పుడు పనిచేసిన ఈదర్శన్ కౌంటర్లు ఇంకా పునఃప్రారంభం కాలేదు. భక్తులు తమప్రాంతాల్లోనే టోకెన్లు పొందేఅవకాశాన్ని పునరుద్ధరించడం ద్వారా డిజిటల్ డివైడ్ తగ్గించవచ్చు. ప్రతి జిల్లాలో కనీసం ఒక అధికారిక బుకింగ్ సదుపాయం ఏర్పాటు చేస్తే గ్రామీణ, పేదభక్తులకుసౌలభ్యం కలుగుతుంది. వేసవి సెలవులు, పర్వదినాల సమయంలో భక్తుల రద్దీ విపరీతంగా పెరుగుతుంది. ఈరద్దీని ముందుగానే అంచనా వేసి, టైమ్‌స్లాట్‌లను పెంచడం, వసతి సామర్థ్యాన్ని తాత్కాలికంగా విస్తరించడం, ట్రాఫిక్ నియంత్రణను మెరుగుపరచడం వంటి చర్యలు అవసరం. డేటా ఆధారిత ప్రణాళికలతో ముందస్తు ఏర్పాట్లు చేస్తే క్యూలైన్లలో ఒత్తిడి తగ్గించవచ్చు. గత ఏడాదిన్నర కాలంలో ముగ్గురు ఈవోలు మారడం పరిపాలనా స్థిరత్వంపై ప్రభావం చూపిందనే అభిప్రాయం వినిపిస్తోంది.ఒకవిశాల ఆధ్యాత్మిక సంస్థలోదీర్ఘకాల ప్రణాళికలు అమలు కావాలంటే స్థిరమైన నాయకత్వం అవసరం. ప్రతి అధికారి ప్రారంభించిన సంస్కరణలు పూర్తి స్థాయిలో అమలుకావాలంటే నిరంతర కొనసాగింపు అవసరం. భక్తుల సౌకర్యాల కోసం రూపొందించిన ప్రణాళికలు మధ్యలో నిలిచిపోకుండా నిరంతరపర్యవేక్షణ ఉండాలి.ఉచిత దర్శనానికి టైమ్‌స్లాట్ టోకెన్ విధానాన్ని విస్తరించడం,ప్రత్యేక దర్శనస్లాట్లను అవసరానికి అనుగుణంగా సర్దుబాటుచేయడం, ఆన్‌లైన్ వ్యవస్థను మరింత వినియోగదారుల స్నేహపూర్వకంగా మార్చడం వంటి చర్యలు తీసుకోవచ్చు. ●

# స్థానిక సమస్యల పరిష్కారం పంచాయతీ రాజ్ లక్ష్యం



రామ కిష్టయ్య సంగన భట్ల

భారత దేశంలోని అతి ప్రాచీన వ్యవస్థ పంచాయతీరాజ్‌వ్యవస్థ. గ్రామస్థాయిలో అమల్లో ఉండే అతి ప్రాచీన పాలనా వ్యవస్థే పంచాయతీ. ఇదే స్థానిక స్వపరిపాలనా సంస్థల వ్యవస్థ. ప్రాచీన కాలంలో పనిచేస్తున్న గ్రామ పాలనా వ్యవస్థ నాటి సాంఘిక పరిస్థితుల కనుగుణంగా గ్రామ వృత్తి పనివారల ప్రతినిధులతో పనిచేయగా, బ్రిటిష్‌పాలన కాలంలో గవర్నర్ జనరల్ రిప్పన్ ప్రోత్సాహంతో స్థానిక స్వపరిపాలనా సంస్థలు రూపుదిద్దుకున్నాయి. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలు కొంత వీటికి బలం చేకూర్చాయి. భారత దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రారంభించిన తొలి రాష్ట్రం రాజస్థాన్ కాగా, 1959 నవంబరు 1న, ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే రెండవదిగా, మహబూబ్ నగర్ జిల్లా, షాద్ నగర్లో ప్రారంభమైంది. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ, బ్లాకు స్థాయిలో పంచాయతీ సమితి, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ ఏర్పడింది.1986లో బ్లాకుస్థాయి వ్యవస్థని మండల పరిషత్‌గా మార్చారు. కేంద్ర ప్రభుత్వ చొరవతో ప్రయోగాత్మక ప్రాతిపదికగా, సమాజ వికాసా భివృద్ధి కార్యక్రమం (కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) 1952లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ద్వారా దేశంలో బాగా వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, విద్య,ఆరోగ్యం, రవాణా సౌకర్యాలు, కుటీర పరిశ్రమలు అనే ఐదు రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. 1953లో ఈ పథకాన్నే జాతీయ విస్తరణ సేవా పథకం (నేషనల్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ స్కీమ్) గా దేశమంతటా అమలు చేశారు. ఈ కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయడానికి బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన నిపుణుల కమిటీని 1956లో నియమించారు. ఈ కమిటీ తన నివేదికను 1957లో సమర్పించింది. ఈ కమిటీ సిఫారసులే పంచాయతీరాజ్ వ్యవస్థ (ప్రజాస్వామ్య వికేంద్రీకరణ) ఏర్పాటుకు మూలాధారం అయినాయి. బల్వంతరాయ్ మెహతా (1900 ఫిబ్రవరి 19, 1965 సెప్టెంబరు 19) స్వాతంత్ర్య సమర యోధుడు, సామాజిక కార్యకర్త, పంచాయితీ రాజ్ నూతన వ్యవస్థ మార్గదర్శకుడు. ఆయన బర్డోలి సత్యాగ్రహ భాగస్వామి. గుజరాత్ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా పనిచేశాడు. స్వయం పాలన కోసం ప్రజల పోరాటం ఆయన జీవితాశయం. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ సంబంధంగా 'బల్వంతరాయ్ మెహతా కమిటీ' సిఫార్సులు దేశంలో అమలు పరచబడి,ప్రాచుర్యం పొందిన పంచాయితీ రాజ్ అనే విప్లవాత్మక కార్యక్రమంతో మెహతాగుర్తింపు పొందాడు.స్వాతంత్ర్యం తరువాత మెహతా భారతదేశ లోక్‌సభకు పార్లమెంటు సభ్యునిగా రెండుసార్లు ఎన్నికయ్యాడు.పార్లమెంట్ అంచనా కమిటీ అధ్యక్షుడుగా ఉన్నాడు. ప్రణాళిక



ప్రాజెక్ట్స్ కమిటీ అధ్యక్షుడుగా రాష్ట్రాలలో మూడు అంచెల వ్యవస్థ స్థాపన కోసం మెరుగైన విధానానికి అద్భుతమైన నివేదికను సిద్ధం చేశాడు. తద్వారా భారత దేశపు పంచాయితీ రాజ్ ఫాదర్‌గా ప్రశంసించబడ్డాడు. 1952, అక్టోబరు 2న ప్రవేశ పెట్టిన సమాజ అభివృద్ధి కారక్రమం ప్రాతిపదికగా, జాతీయాభివృద్ధి మండలి 1957, జనవరి, 16న బల్వంత్ రాయ్ గోపాల్ మెహతా అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈకమిటీ 1953, అక్టోబరు 2న ప్రవేశ పెట్టిన జాతీయ విస్తరణ సేవాకార్యక్రమం పథకాలు ఎంత వరకు విజయవంతం అయినాయో సమీక్షించి, గ్రామ పరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడానికి అవసరమయ్యే సంస్థాగత ఏర్పాటును సిఫార్సు చేసింది.బల్వంతరాయ్ మెహతా కమిటీ ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రజల భాగస్వామ్యం అనే అంశాలతో 3 అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫారసు చేస్తూ,తన నివేదికను1957,నవంబరు 24న జాతీయాభివృద్ధి మండలికి సమర్పించింది. కమిటీ నివేదికను జాతీయాభివృద్ధి మండలి 1958, జనవరిలో ఆమోదించింది.ఈ నివేదికలోని అంశాల అమలు వివిధ రాష్ట్రాలు పంచాయతీరాజ్ సంస్థఏర్పాటుకు ప్రయత్నించాయి.భారతదేశంలో 1959 అక్టోబరు 2న రాజస్థాన్‌లోని నాగూర్ జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థను లాంఛనంగా ప్రారంభించారు. రాజస్థాన్ రాష్ట్రంలో, నాగోర్ జిల్లాలోని, సికార్ అనే ప్రాంతంలో ఈ విధానాన్ని ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభిస్తూ చేసిన వ్యాఖ్యానం 'నేడు ప్రారంభమవుతున్న స్థానిక స్వపరిపాలనా సంస్థలు భారత ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా పనిచేస్తూ జాతి నిర్మాణంలోకీలక పాత్ర పోషిస్తూ, భవిష్యత్ నాయకత్వానికి పాఠశాలలుగా తోడ్పడతాయి. మూడు అంచెల విధానాన్ని ప్రారంభించిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 1959, నవంబరు 1న ఆంధ్రప్రదేశ్లోని రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్‌వద్ద నీలం సంజీవ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నెహ్రూ ప్రారంభించారు. బల్వంతరాయ్ మెహతా కమిటీ చేసిన ముఖ్యమైన సిఫార్సులు దేశంలో 3 అంచెల పంచాయతీ రాజ్ విధానం ఏర్పాటు చేయాలి.1) జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్, 2) బ్లాకు స్థాయిలో పంచాయతీ సమితి, 3) గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ ప్రజల భాగస్వామ్యం కల్పించడానికి పంచాయతీరాజ్ వ్యవస్థను నెలకొల్పాలి. గ్రామ పంచాయతీ వ్యవస్థకు ప్రత్యక్ష ఎన్నికలను నిర్వహించాలి. ఈ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన కాకుండా, స్వతంత్ర ప్రాతిపదికపై జరపాలి. స్థానిక సంస్థలకు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి నియమ బద్ధంగా ఎన్నికలు జరపాలి. స్థానిక సంస్థలకు తగిన అధికారాలను, ఆర్థిక వనరులను సమకూర్చాలి. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పథకాలన్నీ స్థానికసంస్థల ద్వారానే నిర్వహించాలి. స్థానిక స్వపరిపాలనలో జిల్లా కలెక్టరు కీలకపాత్ర పోషించాలి. కిందిస్థాయిలో మినహాయించి, మాధ్యమిక, ఉన్నత స్థాయిల్లో పరోక్ష ఎన్నికలు నిర్వహించాలి. అధికారాల, పరిపాలనా, వనరుల, ప్రణాళికా, ప్రజాస్వామ్య వికేంద్రీకరణలు జరగాలి. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్లు మంజూరు చేయాలని బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సూచించింది. స్థానిక సమస్యలను స్థానికంగా పరిష్కరించడం, ప్రజలను రాజకీయంగా చైతన్యం చేయడం పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. ఆ లక్ష్య సాధన కోసం స్వాతంత్ర్యానంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తనవంతు కృషి చేస్తూనే ఉన్నాయి. ●

# ప్రజావాక్కు



## పెరుగుతున్న వాయుకాలుష్యం

పట్టణాలు నగరాల్లో రోజురోజుకు పెరుగుతున్న వాయు, ధ్వని, నీటి,ఆహార కాలుష్యం ప్రణాంతకమవుతున్నాయి. పెరుగుతున్ననగర జనాభాతో పాటు విపరీతంగా పెరుగుతున్న ప్రాణాంతక జబ్బులకు కారణం కాలుష్యంహానాలు వాయు కాలుష్యానికి ముఖ్యకారణం. దానికి తోడు వాహనాల నుండి విడుదల అయ్యేపొగమీద సరైన నియంత్రణ లేకపోవడం.వీధుల్లో వ్యర్థాలనుతగులబెట్టడంమరోముఖ్యమైనకారణం. పబ్లిక్ స్థలాల్లో ధూమపానం కూడా ఒకటి. మన భాగ్యనగరం కూడా ఢిల్లీతోకాలుష్యంలో పోటీ పడుతోంది.వాయునాణ్యత నగరంలో విపరీతంగా పడిపోతుంది.దీర్ఘకాలికజబ్బులు కేన్సర్‌లాంటి ప్రాణాంతక జబ్బులు విపరీతంగా పెరగడానికివాయుకాలుష్యంప్రధాన కారణం.

- డా.తండు మురళీమోహన్, హైదరాబాద్

## ప్రయాణ ఇక్కట్లు

**ఏపిలో** ప్రత్యేకంగా స్త్రీ శక్తి పథకం అమలు ద్వారా స్త్రీలు అతి తక్కువఖర్చుతో ఇంటిపనులకు చెందిన ప్రయాణాలు చేయగలుగుతున్నారు. కానీప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాలకు జిల్లా ప్రధాన కేంద్రం డిపో నుండి రాత్రి కనీసం 9 గంటల వరకు బస్సులు ఉండేవి. ఇప్పుడు అవి 7 గంటలతోనే ముగుస్తున్నవి. పట్నంలో ఏదో పని ఆలస్యం అయినప్పుడు ఆటో ద్వారా వచ్చేందుకు డ్రైవర్లు ముందుగానే సర్వీసు ఆపేస్తున్నారు. వారిని మనం ప్రశ్నించే పరిస్థితి లేదు. బస్సులకొరత ఉన్నప్పటికీ కనీసం పది గంటలలోగా గ్రామం చేరుకునే విధంగా ప్రభుత్వం, డిపో అధికార్లు ఏర్పాటు చేయడం ఎంతో అవసరం.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

## దివ్యాంగులకు న్యాయం చేయాలి

దివ్యాలాంగుల భూమి కబ్జాలు చేసిన వారిపై వికలాంగుల చట్టం 2016ప్రకారం చర్యతీసుకోని శిక్ష విధించాలి. దివ్యాలాంగులకు సంబంధించిన ఇండ్ల స్థలం కబ్జాలు చేస్తే దివ్యాంగులు రెవిన్యూ అధికారులకు, పోలీస్ అధికారులకు,ఫిర్యాదుచేసినా న్యాయం జరగడంలేదు. నెలలు, సంవత్సరాలు తిరిగితిరిగి విసిగివేసారిపోతున్న రెవిన్యూ అధికారులు కాలనీకీ సంబంధించిన రికార్డ్‌లు లేవని తప్పించుకుంటారు. దివ్యాంగులకు న్యాయం చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

## సరైన నిర్ణయం కాదు

**పాతపద్ధతిలోనే** వందేమాతరం గీతాన్ని కొనసాగించాలి, ఆవు మూత్రం పార్లమెంట్‌లో ప్రతిరోజుచల్లాలి, గాయత్రీ మంత్రాన్ని ప్రార్థనా గీతంగా పెట్టాలి.లౌకికవాదం అనేపదాన్ని రాజ్యాంగం నుండి తొలగించాలి, మనుస్మృతిని రాజ్యాంగంగా పెట్టాలి , చరిత్రతొలగించి పుక్కిటి పురాణాలను విద్యార్థులకు పాఠ్యాంశాలుగా పెట్టాలి.ఇదీ కేంద్ర మానసికరోగం. అందుకోసమే 150 సంవత్సరాలుగా వస్తున్నవందేమాతరం గీతాన్ని మారుస్తుంది. ఏమతం, ఏదేవత, ఎ దేవుడూ అవసరంలేదనే హేతువాదులు కూడా ఉన్న దేశంలో దుర్గాదేవిని కొలుస్తూ ఉన్న గీతాన్ని ఎలా ఆలపిస్తారు? వందేమాతరం పై బిజెపి తీసుకున్న నిర్ణయం సరైనదికాదు. దేశంలో మతోన్మాదాన్ని పెంచుతుంది. గతంలో ఎలా ఈ గీతాన్ని ఆలపించేవారో అలాగే 52 సెకండ్లలోనే ముగించాలి.అయినా ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ప్రజలకు ఉపయోగకరంగా, దేశ అభివృద్ధికిదోహదపడేలా ఉండాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## సోలార్ విద్యుత్‌పై దృష్టి

**భారతదేశం** ఇంటర్నేషనల్ సోలార్ అలియాన్స్‌ను ప్రతిపాదించడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలలో విద్యుత్ అందించడం అది కుడా తిరిగి రూపొందించగలిగే లేదా తిరిగి పొందగలిగే రూపంలోనిది కావడం. ఫాసిల్ ఫ్యూయల్ కాకుండా తిరిగి పొందగలిగే వనరుల నుండి విద్యుత్ తయారు చేయడం ముఖ్యం. అంత మాత్రమే కాదు భూమి మీద వేడి పెరగడం కాలుష్య కాసారాలుగా నగరాలు మారడం గమనించవచ్చు. దానికి ఢిల్లీ ఒక ప్రత్యక్ష ఉదాహరణ. ఇలా మారడానికి కారణం ఏమిటిఅని ఆలోచించకుండా ఎక్కువ ఆదాయం కలిగిన దేశాలు ఉదాహరణకు అమెరికా వంటి దేశాలు బాధ్యతరాహితంగా మారడం గమనించవచ్చు.

- భారత అవినాష్ , జనగామ

## మద్యనిషేధంపై అవగాహన పెంచాలి

**భారతదేశం** వంటి విభిన్న సాంస్కృతిక దేశంలో మద్యం వినియోగం ఎప్పటినుంచో సామాజిక, ఆరోగ్య, ఆర్థిక సమస్యలకు మూలమై ఉంది. మద్యం తాగడం వ్యక్తిగత నిర్ణయమని కొందరుఅంటారు, కానీ దానిప్రభావం సమాజంపై తీవ్రమైనది. గృహహింస, రోడ్డుప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు, పేదరికం మద్యాసక్తి వల్లే పెరుగుతున్నాయి. మద్యం వ్యసనం మన సమాజాన్ని నిశ్శబ్దంగా కరిగిస్తున్న రుగ్మత.

-ఎం.నాగరాజు, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# దేశ రక్షణలో ఎఐ కీలకం

## సరిహద్దుల్లో 'ఎఐ'తో చైనా కుట్రలు భగ్నం

### వెల్లడించిన ఆర్మీ అధికారి



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** దేశ రక్షణ రంగంలో కృత్రిమ మేధ కీలకంగా మారుతోందని స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ దినేశ్‌సింగ్ రానా తెలిపారు. ఎఐ సాయంతో మన సైన్యం శత్రుదేశం కదలికలను ముందే గుర్తించగలిగిందని వెల్లడించారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని వాస్తవాధీన రేఖ వెంబడి చైనా దళాల దాడి యత్నాలను పసిగట్టి వాటిని భగ్నం చేయడంలో ఎఐ సమర్థంగా పనిచేసిందని పేర్కొన్నారు. ఢిల్లీలో జరుగుతోన్న ఇండియా ఎఐ ఇంపాక్ట్ సమిట్‌లో లెఫ్టినెంట్ జనరల్ రానా ఈ కీలక విషయాలను వెల్లడించారు. ఆధునిక యుద్ధ పరిస్థితులు, వ్యూహాత్మక సిద్ధాంతాలు, జాతీయ భద్రతా ప్రణాళికలను కృత్రిమ మేధ మార్చేస్తోంది. స్వదేశీ పరిజ్ఞానంతో, తక్కువ ఖర్చుతో రూపొందించిన మన ఎఐ వ్యవస్థ సాయంతో ఇటీవల వివాదాస్పద సెక్టార్‌లో చైనా మోహరింపులను భారత సైన్యం ముందుగానే పసిగట్టగలిగింది. శత్రువుల కదలికలను, వ్యూహాలను మన బలగాలు ముందుగానే అంచనా వేశాయి. అలా ఎఐ ఆధారిత నిఘా సమాచారంతో భారత్ వైపు దళాల మోహరింపు చేపట్టాం. అత్యవసర పరిస్థితుల్లో తరలింపు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నాం. ఫలితంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చైనా ప్రయత్నాలను భగ్నం చేయగలిగాం అని లెఫ్టినెంట్ జనరల్ దినేశ్ రానా వివరించారు. అయితే అది ఎప్పుడు జరిగిందన్న వివరాలను ఆయన వెల్లడించలేదు. కృత్రిమ మేధ ఇప్పుడు ప్రపంచశక్తికి కేంద్రంగా మారిందని రానా అన్నారు. కేవలం సాఫ్ట్‌వేర్ రంగానికి మాత్రమే ఇది పరిమితం కాలేదని, మౌలిక సదుపాయాలు, సైనిక వ్యవస్థలు, కమాండ్ కంట్రోల్ సిస్టమ్స్ వంటి వాటిలోనూ ఎఐ మెరుగ్గా పనిచేస్తోందని తెలిపారు. ఇక, రక్షణ రంగంలోనూ స్వదేశీ ఆయుధాల తయారీ, శత్రువుల లక్ష్యాలను గుర్తించడం, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, సైబర్ డిఫెన్స్ వంటి వాటిలోనూ కృత్రిమ మేధ వినియోగం పెరుగుతోందన్నారు. అయితే ఎఐతో ప్రయోజనాలతో పాటు ప్రమాదాలు లేకపోలేదని లెఫ్టినెంట్ జనరల్ గుర్తుచేశారు. చెడ్డవ్యక్తుల చేతుల్లో ఈసాంకేతికత దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందన్నారు. మనదేశం బాధ్యతాయుతమైన అణ్వా యుధ శక్తి అని అలాగే మరింత సూపర్ పవర్ కావాలని కోరుకుంటున్నట్లు రానా వెల్లడించారు.

## వధువుపై కోట్ల రూపాయల నోట్ల వర్షం

**చండీగఢ్, ఫిబ్రవరి 18:** వివాహ సమయంలో వధువుపై కోట్ల రూపాయలతో నోట్ల వర్షం కురిపించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియోలో పంజాబ్‌లోని తర్న్ తరణ్ జిల్లాలో జరిగిన ఓ వివాహంలో వధువు వేదిక వద్ద నిలబడి ఉండగా కుటుంబసభ్యులు ఆమెపై కరెన్సీ నోట్లను వెదజల్లుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. పెళ్లి కుమార్తెపై వారు మొత్తం రూ.8.5 కోట్లు విలువైన కరెన్సీ నోట్లను వెదజల్లినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ వివాహం ఫిబ్రవరి 14న జరిగినట్లు తెలుస్తోంది. కోట్ల రూపాయలను వధువుపై వెదజల్లినట్లు వస్తున్న వార్తలను వరుడి కుటుంబం ఖండించింది. నృత్యం చేస్తున్న సమయంలో సరదాగా డబ్బును వధువుపై వెదజల్లినట్లు వరుడి సోదరుడు సికందర్ సింగ్ తెలిపారు. కాని సోషల్ మీడియాలో వస్తున్నట్లుగా ఇందుకు రూ.8.5 కోట్లను ఉపయోగించలేదని కేవలం రూ.2లక్షలు మాత్రమే వాడినట్లు వివరణ ఇచ్చారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్న సోషల్ మీడియా ఖాతాలపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. మరోవైపు ఈ వివాహ కార్యక్రమాన్ని నిర్వహించిన ఈవెంట్ మేనేజర్ మాట్లాడుతూ వధువుపై వెదజల్లడానికి రూ.4 లక్షల విలువైన కరెన్సీ నోట్లను వినియోగించినట్లు తెలిపారు.

## జనాభా తగ్గుదలను అరికట్టాలి: భగవత్



**లక్నో, ఫిబ్రవరి 18:** హిందూ సమాజం సంఘటితమై జనాభా క్షీణతను అరికట్టేందుకు నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ పిలుపునిచ్చారు. బలవంతపు మత మార్పిడులను నిలువరించాలని, ఘర్‌వాపసీ ప్రయత్నాలను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. లక్నోలోని నిరాలా నగర్‌లో జరిగిన ఓసామాజిక సామరస్య కార్యక్రమంలో ఆయన ఈవ్యాఖ్యలు చేశారు. భగవత్ మాట్లాడుతూ హిందూ జనాభా తగ్గడంపై తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. ప్రతి హిందూ కుటుంబంలో కనీసం ముగ్గురు పిల్లలు ఉండాలని నొక్కిచెప్పారు. ఈ కార్యక్రమంలో సిక్కు, బౌద్ధ, జైనవర్గాలతో పాటు పలు ఆధ్యాత్మిక,సామాజికసంస్థలప్రతినిధులు పాల్గొన్నారు.

## అమెరికాకు ఇరాన్ ఖమేనీ సీరియస్ వార్నింగ్



**టెహ్రాన్, ఫిబ్రవరి 18:** అమెరికా ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోయడంలో అమెరికా ఎప్పటికీ విజయం సాధించలేదని, భవిష్యత్తులోనూ సాధించలేదని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యం ఉన్నవారికైనా తీవ్ర ఎదురుదెబ్బ తగలవచ్చని హెచ్చరించారు. ఇరాన్‌లో పాలన మార్పు, యుద్ధ నౌకల మోహరింపు అంశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేసారు. అదే సమయంలో జెనీవా వేదికగా ఇరాన్ అమెరికాల మధ్య పరోక్ష అణు చర్చలు కొనసాగుతుండటం ఈ పరిణామానికి మరింత ప్రాధాన్యం తెచ్చింది. ఖమేనీ చేసిన వరుస ట్వీట్లలో తమ సైన్యం ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదని అమెరికా అధ్యక్షుడు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో అది కోలుకోలేనంత దెబ్బతినే అవకాశమూ ఉంది.జెనీవాలో అమెరికా ఇరాన్ మధ్య జరిగిన అణు చర్చలు సుమారు మూడు గంటల్లో ముగిశాయి. ఈ చర్చలు జరుగుతున్న సమయంలోనే ఇరాన్ హార్మూజ్ జలసంధిలో సైనిక విన్యాసాలు చేపట్టింది. భద్రతా కారణాలతో జలసంధిని కొన్ని గంటల పాటు మూసివేసి, లైవ్ క్షిపణులను ప్రయోగించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. అమెరికా సైనిక మోహరింపులు కొనసాగుతున్న వేళ ఆ ప్రాంతంలో టెహ్రాన్ ఈ చర్యలు చేపట్టింది.

## రాహుల్ వల్లే సిఎం ఛాన్స్ పోయింది

### హిమంత్ బిశ్వశర్మ

**గువాహతి, ఫిబ్రవరి 18:** అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ కాంగ్రెస్ పార్టీలో తన పాత రోజులను గుర్తుచేసుకుంటూ సంచలన విషయాలు వెల్లడించారు. 2014లో తాను ముఖ్యమంత్రి కావడానికి అధినేత్రి సోనియా గాంధీ అంగీకరించినా, రాహుల్ గాంధీ జోక్యంతో ఆ అవకాశం చేజారిపోయిందని ఆయన ఆరోపించారు. కేబినెట్ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన హిమంత ఆనాటి రాజకీయ పరిణామాలను వివరించారు. అప్పట్లో 58 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నాకు మద్దతుగా నిలిచారు. స్వయంగా సోనియా గాంధీ నన్ను పిలిచి, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానికి తేదీ ఖరారు చేసుకోమని చెప్పారు. కామాఖ్య ఆలయంలో అంబుబాచి మేళా ముగిశాక బాధ్యతలు చేపడతానని కూడా ఆమెతో చెప్పాను అని హిమంత తెలిపారు. ఆ సమయంలో అమెరికాలో ఉన్న రాహుల్ గాంధీ చేసిన కొన్ని ఫోన్ కాల్స్‌తో పరిస్థితి మొత్తం తలకిందులైందని ఆరోపించారు.

## అణుస్థావరాలను సైతం టార్గెట్ చేయగల సత్తా భారత్‌దే..

### రక్షణరంగ నిపుణుడు టామ్ కూపర్




**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 18:** పాకిస్థాన్‌లోని కిరానా హిల్స్ అణు కేంద్రంపై భారత వాయుసేన రహస్యంగా దాడి చేసిందని, ఆ దెబ్బతోనే ఇస్లామాబాద్ కాల్పుల విరమణ కోసం బతిమలాడిందని ప్రముఖ రక్షణ రంగ నిపుణుడు టామ్ కూపర్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా కలకలం రేపాయి. ఈ దాడితో మేము ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎలాంటి దాడి నైనా చేయగలం ఇక ఆపండి అనే బలమైన సందేశాన్ని భారత్ పాకిస్థాన్‌కు పంపిందని కూపర్ పేర్కొన్నారు. తన వాదనకు బలంగా కొన్ని ఆధారాలను కూడా కూపర్ ప్రస్తావించారు. పాక్ పౌరులు తీసిన వీడియోలలో మిస్సైళ్లు కొండల్లోకి దూసుకెళ్లడం, దట్టమైన పొగలు రావడం స్పష్టంగా కనిపించాయని తెలిపారు. భారత వాయుసేన మొదట రాఫెల్, సుఖోయ్30 యుద్ధ విమానాలతో పాక్ రాడార్ వ్యవస్థలను ధ్వంసం చేసి, ఆ తర్వాత అణు నిల్వ కేంద్రాల ప్రవేశ ద్వారాలను లక్ష్యంగా చేసుకునిందని వివరించారు. పాకిస్థాన్‌లోని తన వ్యక్తిగత వర్గాలు కూడా ఈ దాడిని ధ్రువీకరించాయని ఆయన అన్నారు. ఈ వాదనలను భారత వాయుసేన (ఐఏఎఫ్) ఖండించింది. ఈ నెల ప్రారంభంలో వైస్ చీఫ్ ఎయిర్ మార్షల్ నాగేష్ కపూర్ మాట్లాడుతూ భారత్ కేవలం ఉగ్రవాద, సైనిక స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుందని స్పష్టం చేశారు. కిరానా హిల్స్‌పై దాడుల వీడియోలు పాకిస్థాన్ సృష్టించినవి కావచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అణు స్థావరాలపై జరిగిన దాడిని ఏ దేశమూ అధికారికంగా అంగీకరించదని రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు.ఇది అంతర్జాతీయంగా పెద్దయుద్ధానికి దారితీసే ప్రమాదం ఉన్నందున, భారత్ వ్యూహాత్మక మౌనంపాటిస్తోందని వారు భావిస్తున్నారు.ఈ ఆపరేషన్‌లో భారత ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ (ఎస్400) పాక్ ప్రయోగించిన డ్రోన్లు, మిస్సైళ్లను గాలిలోనే కూల్చివేసి తన సత్తాచాటిన విషయం తెలిసిందే.

## మేకిన్ ఇండియాలో హామర్ క్షిపణుల తయారీ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 18:** మేకిన్ ఇండియాలో భాగంగా ఇప్పటికే భారత్ పలు ఆయుధాలను సొంతంగా తయారు చేస్తోంది. తాజాగా భారత్ మరో ముందడుగు వేసింది. ఫ్రాన్స్ సహకారంతో భారత్ దేశీయంగా హామర్ క్షిపణులను తయారు చేయనుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ ప్రధాని మోదీ మధ్య దీనిపై ఒప్పందం కుదిరింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ఈ క్షిపణులను కూడా వాడింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వద్ద ఉన్న రఫేల్ యుద్ధ విమానాలకు హామర్ క్షిపణులను జోడించారు. తాజాగా మరో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు భారత రక్షణ శాఖ క్లియరెన్స్ ఇచ్చింది. వీటికోసం అదనంగా హామర్ క్షిపణులు తయారు చేయాల్సి ఉంటుంది. స్వదేశీ తేజస్ యుద్ధ విమానాలకు కూడా ఈ క్షిపణులను జోడించనున్నారు.

## కోపం వస్తే గుండెపోటు!

### పక్షవాతానికి కూడా అవకాశం: వైద్యనిపుణులు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** మనుషుల్లో కొద్దిసేపు వచ్చే కోపం కూడా రక్తనాళాలపై పెను ప్రభావం చూపుతుందని, గుండెపోటు లేదా పక్షవాతం బారిన పడే ప్రమాదాన్ని పెంచుతుందని అధ్యయనాల్లో తేలింది. అమెరికాలోని వివిధ సంస్థలకు చెందిన నిపుణులు సుమారు 300 మంది ఆరోగ్యవంతులపై ఈ పరిశోధన చేశారు. వారికి గతంలో జరిగిన ఒక కోపంతో కూడిన సంఘటనను 8 నిమిషాల పాటు గుర్తుచేసుకోమని చెప్పారు. ఆ సమయంలో వారిపై జరిపిన అధ్యయనం ద్వారా వెలుగు చూసిన ఫలితాలపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రభావం ఎలా ఉంటుందంటే కోపంగా ఉన్నప్పుడు రక్తనాళాలు వ్యాకోచించే (విచ్చుకునే) సామర్థ్యం దాదాపు సగానికి పడిపోతుంది. ఈ పరిశోధనలో పాల్గొన్న వారు 8 మిషాల పాటు కోపంతో ఉన్నప్పటికీ రక్తనాళాలపై దాని ప్రభావం మరో 40 నిమిషాల పాటు ఉందని పరిశోధకులు చెప్పారు. బాధ లేదా ఆందోళన వంటి భావోద్వేగాలు రక్తనాళాలపై కోపం చూపించినంత తీవ్రమైన ప్రభావాన్ని చూపలేదని వివరించారు. రక్తనాళాలు బిగుసుకుపోవడం, కోపం వల్ల రక్తనాళాలు బిగుసుకుపోతాయని పరిశోధకులు తెలిపారు. దీంతో రక్తాన్ని పంప్ చేయడానికి గుండె మరింత కష్టపడాల్సి వస్తుందన్నారు. తరచుగా ఇలా జరగడంవల్ల అధికరక్తపోటు, ధమనులు దెబ్బతినడం, రక్తనాళాల్లో కొవ్వు పేరుకు పోవడం, గుండెపోటు, పక్షవాతం తదితర సమస్యలు ఎదురవుతాయని హెచ్చరించారు. గుండెను దెబ్బతీసేదిలా కోపం వచ్చినప్పుడు శరీరంలో ఫైట్ ఆర్‌ఫ్లైట్ స్పందన మొదలవుతుంది. దీనివల్ల అడ్రినలిన్, కార్టిసాల్ వంటి ఒత్తిడి హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి రక్త నాళాలను గట్టిపడేలా చేసి, రక్తపోటును మరియు హృదయ స్పందన రేటును పెంచు తాయి. ముంబైలోని సైఫీ హాస్పిటల్ కార్డియా లజిస్ట్ డాక్టర్ నిమిత్ సిషా దీనిపై స్పందిస్తూ ఒక్కసారి కోప్పడితే శాశ్వత నష్టం జరగకపో వచ్చు, కానీ తరచుగా కోపగించుకోవడం వల్ల రక్తనాళాలు క్రమంగా దెబ్బతింటాయి, ఇది భవిష్యత్తులో ప్రాణాంతక సమస్యలకు దారి తీస్తుందని హెచ్చరించారు. నేటి ఆధునిక కాలంలో సరైన నిద్రలేకపోవడం,శారీరక శ్రమ తగ్గడం,దీర్ఘకాలిక ఒత్తిడి.అనారోగ్యకరమైన ఆహారం వల్ల ఇప్పటికే గుండె జబ్బుల ముప్పుఎక్కువగా ఉంది. దీనికి తోడు అదు పులేని కోపం తోడైతే పరిస్థితి మరింత దిగజా రుతుంది. ఆరోగ్యంగా ఉండే యువత కూడా తరచుగా కోపగించుకోవడం వల్ల తమ గుండె ఆరోగ్యాన్ని రిస్క్‌లో పడేస్తున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## భారత్ సాయం మాకు అత్యంత కీలకం

### ఐరాస చీఫ్ గుటెరెస్ స్పష్టీకరణ



**న్యూయార్క్, ఫిబ్రవరి 18:** అంతర్జాతీయ సమాజ అభ్యున్నతి కోసం శాశ్వత ప్రాతిపదికన భారత్ అందిస్తున్న సాయం తమకెంతో కీలకమని ఐక్య రాజ్య సమితి (ఐరాస) ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ స్పష్టం చేశారు. ప్రపంచంలో ఇప్పుడు భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు కీలక పాత్ర పోషించే అత్యంత సానుకూల ధోరణి నడుస్తోందని తెలిపారు. దక్షిణార్థ గోళ దేశాల పరిధిలో తొలిసారిగా భారత్ నిర్వహిస్తున్న ఎఐ ఇంపాక్ట్ సమిట్-2026లో పాల్గొనేందుకు అమెరికాలోని న్యూయార్క్ నుంచి బయలుదేరే ముందు ఆయన ఐటిఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో ఐరాస నిర్వహిస్తున్న పీస్ కీపింగ్ మిషన్లలో అత్యధికంగా 5 వేల మంది భారత భద్రతా సిబ్బంది ఉన్నారని తెలిపారు. ఇందుకోసం భారత్‌కు ఐరాస సదా రుణపడి ఉంటుందని చెప్పారు. 2007లో లైబీరియాలో పీస్ కీపింగ్ మిషన్ కోసం పూర్తిగా మహిళలతో కూడిన తొలి పోలీస్ యూనిట్‌ను అందించిన ఘనత భారత్‌కే దక్కుతుందని తెలిపారు. జి-20 సదస్సును భారత్ నిర్వహించిన సమయంలోనే పలు విప్లవాత్మక నిర్ణయాలను తీసుకున్నారని గుర్తు చేశారు. 'ఒక బాధ్యతాయుత ప్రజాస్వామిక దేశంగా, ప్రపంచ దేశాల్లో ప్రజాస్వామ్య పరిరక్షణకు భారత్ చేయూత అందిస్తోంది. ప్రత్యేకించి అంతర్జాతీయ మార్కెట్‌లో అత్యధిక వాటాను భారత్ ఆర్థికవ్యవస్థ కలిగిఉంది' అని గుటెరెస్ వ్యాఖ్యానించారు.

**భద్రతా మండలి వైఫల్యం వల్లే ఐరాసపై విమర్శలు**

'ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు సంక్షోభాలు, అన్యాయాలు, అసమానతలు, పేదరికం, ఆకలి పెరుగుతున్నాయి. చాలా దేశాల్లో ఉగ్రవాద భూతం వేళ్లూనుకుంటోంది. ఈ నేపథ్యంలో యావత్ ప్రపంచం ఐక్యరాజ్య సమితివైపు చూస్తోంది. అయితే ఐరాస అంటే కేవలం భద్రతా మండలి ఒక్కటే కాదు. 193 దేశాలకు ప్రాతినిధ్యం ఉంది. వీటికి సమానమైన ప్రాధాన్యం ఉంటుంది. కానీ.. భద్రతా మండలి కొన్ని దేశాలకే పరిమితం అయినందువల్లే ప్రపంచ శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో అది సరైన నిర్ణయాలను తీసుకోలేకపోతోంది. కేవలం భద్రతా మండలి వైఫల్యం కారణంగానే ఐరాస విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తోంది' అని ఆంటోనియో వ్యాఖ్యానించారు.

**భారత రాష్ట్రపతి, ప్రధానితో భేటీ:** న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న 'ఎఐ ఇంపాక్ట్ సమిట్-2026'కు వస్తున్న గుటెరెస్ భారత రాష్ట్రపతి ముర్ము, ప్రధాని నరేంద్రమోడీలతో భేటీ కానున్నారు. సదస్సులో పాల్గొనే అంతర్జాతీయ టెక్ కంపెనీల ప్రముఖులతోనూ ఆయన సమావేశమవుతారు. ఐరాస ఏర్పాటు చేసిన 'ఇంటర్నేషనల్ సైంటిఫిక్ ప్యానల్ ఆన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' సభ్యులతో ఢిల్లీలో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తారు. ఈ ఐరాస విభాగంలో ఉన్న 40 మంది టెక్ నిపుణుల్లో ఐఐటీ మద్రాస్‌కు చెందిన బాలరామన్ రవీంద్రన్‌కు చోటు లభించింది.

## శ్రీలంకలో ఎంపీల పెన్షన్లు రద్దు

### ప్రభుత్వం కీలక నిర్ణయం

### బిల్లును ఆమోదించిన పార్లమెంటు



**కొలంబో, ఫిబ్రవరి 18:** పొరుగు దేశం శ్రీలంక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎంపీల పెన్షన్లను పూర్తిగా రద్దు చేసింది. దీనికి సంబంధించిన బిల్లు పార్లమెంట్‌లో మంగళవారం ఆమోదం పొందింది. 225 మంది సభ్యులు కలిగిన సభలో 154 మంది ఈ బిల్లుకు అనుకూలంగా ఓటేశారు. కేవలం ఇద్దరు మాత్రమే వ్యతిరేకించారు. మిగిలిన సభ్యులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. శ్రీలంకలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన పార్లమెంట్ సభ్యులకు ప్రస్తుతం పెన్షన్ అందుతోంది. కొత్త చట్టం ఆమోదం పొందడంతో ఇప్పటికే అందుకుంటున్న వారితో పాటు, కొత్తగా అర్హత సాధించిన వారికి పెన్షన్లు నిలిచిపోయాయి. ఇప్పటికే మాజీ అధ్యక్షులకు ఇచ్చే ప్రయోజనాలను దిసనాయకే ప్రభుత్వం నిలిపివేసింది. ఇంటి అద్దె, అల వెన్సులు, పెన్షన్లు, రవాణా సౌకర్యాలను గతే డాది సెప్టెంబరులో రద్దు చేసింది. పర్యాటకంపై ఆధారపడిన దేశమైన శ్రీలంకకు కరోనా, ఉగ్రవాద దాడుల కారణంగా విదేశీయుల రాక తగ్గింది. నాటి పాలకుల ఆర్థిక నిర్వహణ లోపం కారణంగా పరిస్థితి మరింత తీవ్రమైంది. 2022లో దివాళ తీసింది. దీంతో నాటి పాలకులపై ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దేశంలో ఆహారం, ఔషధాలు, విద్యుత్, చమురుకు తీవ్ర సంక్షోభవం ఏర్పడింది. ప్రజల నుంచి ఆందోళనలు చెలరేగడంతో నాటి అధ్యక్షుడు గొటబాయ రాజపక్స తన పదవికి రాజీనామా చేశారు. తర్వాత జరిగిన ఎన్నికల్లో మార్క్సిస్టు నేత దిసనాయకే విజయం సాధించి అధ్యక్ష పగ్గాలు చేపట్టారు.

ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడంలో భాగంగా ఎన్నికల వాగ్దానంలో ఒకటైన పెన్షన్ల రద్దుకు బిల్లు తీసుకొచ్చారు. దేశం క్లిష్టపరిస్థితులు ఎదుర్కొంటున్న వేళ చట్ట సభ సభ్యులకు పెన్షన్లు పొందే నైతికత లేదం టూ ఈ బిల్లుపై చర్చ సందర్భంగా న్యాయ శాఖ మంత్రి హర్షణ నానాయక్కర పేర్కొన్నారు.

## శక్తివంతమైన యుద్ధవిమానాలతో ఇరాన్‌వైపు నౌకలు తరలింపు



**వాషింగ్టన్, ఫిబ్రవరి 18:** ఇరాన్‌తో అణు ఒప్పందంపై చర్చలు జరుపుతూనే, అమెరికా తన సైనిక శక్తిని ప్రదర్శిస్తోంది. ఒకవైపు దౌత్యపరమైన చర్చలు కొనసాగిస్తుండగానే, మరోవైపు భారీగా యుద్ధ విమానాలను, నౌకలను మధ్యప్రాచ్యానికి తరలిస్తోంది. గత 24 గంటల్లో 50కి పైగా అధునాతన ఫైటర్ జెట్లను ఈ ప్రాంతంలో మోహరించడం అంతర్జాతీయంగా ఆసక్తి రేపుతోంది.

యాక్సియోస్ కథనం ప్రకారం అమెరికా వాయుసేనకు చెందిన ఎఫ్22 రాప్టర్స్, ఎఫ్35 లైట్నింగ్ 2, ఎఫ్16 ఫైటింగ్ ఫాల్కన్స్ వంటి శక్తిమంతమైన యుద్ధ విమానాలు ఈ మోహరింపులో ఉన్నాయి. అమెరికా, యూరప్‌లోని స్థావరాల నుంచి ఈ విమానాలను జోర్డాన్, ఖతార్‌లోని సైనిక స్థావరాలకు తరలించారు. ఇదే సమయంలో, యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్. ఫోర్డ్ విమానవాహక నౌక తన బృందంతో కలిసి కరేబియన్‌ను వీడి మధ్యప్రాచ్యం వైపు పయనిస్తోంది. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో అమెరికా, ఇరాన్ మధ్య అణు ఒప్పందంపై రెండో విడత పరోక్ష చర్చలు జరిగిన నేపథ్యంలో ఈ సైనిక మోహరింపు జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఒమన్ మధ్యవర్తిత్వంతో జరిగిన ఈ చర్చలు ఫలప్రదంగా సాగాయని, నిర్మాణాత్మక వాతావరణంలో జరిగాయని ఇరు దేశాల అధికారులు తెలిపారు. చర్చలతో పాటు సైనిక ఒత్తిడిని కొనసాగించడం ద్వారా ఇరాన్‌పై మరింత ఒత్తిడి పెంచడమే అమెరికా వ్యూహంగా కనిపిస్తోంది. ప్రస్తుతం యూఎస్ఎస్ అబ్రహం లింకన్ యుద్ధ నౌక ఈ ప్రాంతంలో ఉండగా, ఇప్పుడు గెరాల్డ్ ఆర్. ఫోర్డ్ రాకతో అమెరికా సైనిక బలం మరింత పెరగనుంది. రాబోయే రెండు వారాల్లో ఇరాన్ నుంచి ప్రతిపాదనలు అందాక, తదుపరి చర్చలు జరిగే అవకాశం ఉంది.

## సంక్షిప్తంగా..

### నా సోదరుడిని చంపేందుకు కుట్రలు: ఇమ్రాన్ సోదరీమణులు




**రావల్పిండి, ఫిబ్రవరి 18:** తన సోదరుడి హత్యకు కుట్ర పన్నారని పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తోబుట్టువులు ఉజ్మా ఖాన్, అలీమా ఖాన్ సంచలన ఆరోపణలు చేశారు. పాకిస్థాన్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ అసిమ్ మునీర్, పీసీబీ చీఫ్ మొహిసిన్ నఖ్వీ తమ సోదరుడి హత్యకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఈ విషయం స్వయంగా ఇమ్రాన్ ఖాన్ తమకు చెప్పారని ఆందోళన వ్యక్తం చేశారు. తనను చంపుతారని, చంపడానికి పథకం వేశారని ఇమ్రాన్ ఖాన్ తమతో చెప్పారని అన్నారు. మొహిసిన్ నఖ్వీ తమను బెదిరింపులకు గురిచేస్తున్నాడని వారు ఆరోపించారు. తమకు లేదా తమ సోదరుడికి ఏమైనా జరిగితే ఎవరినీ వదిలి పెట్టేది లేదని హెచ్చరించారు.

### సలీమ్‌ఖాన్‌కు మెదడులో రక్తస్రావం



**ముంబయి, ఫిబ్రవరి 18:** బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ తండ్రి, ప్రముఖ రచయిత సలీంఖాన్ అస్వస్థతకు గురయి ప్రస్తుతం లీలావతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన స్వల్పంగా బ్రెయిన్ హెమరేజ్ (మెదడులో రక్తస్రావం)తో బాధపడుతున్నారని చికిత్స అందిస్తున్న వైద్యుడు జలీల్ పార్కర్ వెల్లడించారు. ప్రస్తుతం సలీమ్‌ఖాన్ ఆసుపత్రిలో ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. సలీం ఖాన్‌కు అయినది స్వల్ప బ్రెయిన్ హెమరేజ్ అని, దీనికి సర్జరీ అవసరం లేదని డాక్టర్ జలీల్ పార్కర్ స్పష్టం చేశారు. ఆయనకు అధిక రక్తపోటు కూడా ఉండటంతో ముందుజాగ్రత్త చర్యగా వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నామని చెప్పారు. ఆయనకు డిజిటల్ సబ్ట్రాక్షన్ యాంజియోగ్రఫీ పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు.

### ఉద్యోగులకు గిఫ్ట్‌లుగా ఖరీదైన కార్లు



**తిరువనంతపురం, ఫిబ్రవరి 18:** తమ సంస్థ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించిన ఉద్యోగులకు ఓకంపెనీ అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చింది.ఏకంగా రూ.20కోట్లు ఖర్చుచేసి ఖరీదైన కార్లను బహుమతిగా ఇచ్చింది. కంపెనీ ప్రారంభించి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేరళలోని హైలైట్ గ్రూప్ ఈ కానుకలు అందచేసింది. రిటైల్ స్పేస్ రంగంలో రాష్ట్రంలో అగ్రగామిగా ఉన్న హైలైట్ గ్రూప్‌ను 1996లో స్థాపించారు. ఇటీవల ఈ కంపెనీ 30 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కాలికట్‌లో నిర్వహించిన వేడుకల్లో కంపెనీకి చెందిన ఉద్యోగులకు ఈ ఖరీదైన బహుమతులను అందచేశారు. సంస్థ ప్రారంభం నుంచి సేవలందించిన 47 మందికి రూ.20 కోట్ల విలువైన కార్లను పంపిణీ చేశారు.

### హిమంత్ బిశ్వశర్మ 'అసోం జిన్నా': గౌరవ్ గగొయ్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మను ఉద్దేశిస్తూ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గగోయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. హిమంతను 'అస్సాం జిన్నా'గా ఆరోపించారు. బిజెపిలో చేరేవారంతా వారి రాజకీయ జీవితంలో ప్రాధాన్యం లేని వారిగా మిగిలిపోతారంటూ విమర్శలు చేశారు. గువాహటిలో గొగొయ్ విలేకరులతో మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర మాజీ కాంగ్రెస్ చీఫ్ భూపెన్ కుమార్ బోరా రాజీనామా పత్రంపై తీవ్ర చర్చ జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన బిజెపి లో చేరనున్నట్లు ప్రచారం జరిగింది. దీనిపై గొగొయ్ మాట్లాడుతూ కమలంలో చేరితే బోరా కూడా ప్రాధాన్యం లేని రాజకీయ నాయకుడిగా మిగిలిపోతారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నిజమైన పోరాటం కాంగ్రెస్.. పాత కాంగ్రెస్ మధ్య ఉంటుందని వ్యాఖ్యానించారు.

### రాహుల్‌గాంధీ అత్యంత ప్రమాదకరం: కిరణ్ రిజిజు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి కిరణ్ రిజిజు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ భారత వ్యతిరేక శక్తులతో సంబంధాలు పెట్టుకున్నారని ఆరోపించారు. దేశ భద్రతకు రాహుల్ అత్యంత ప్రమాద కరమైన వ్యక్తి అని మండిపడ్డారు. దేశీయంగా, విదేశీ పర్యటనల్లో రాహుల్ నక్సలైట్లు, తీవ్రవాదులు, జార్జ్ సోరోస్ వంటి దేశ వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తులతో సమావేశాలు జరుపుతున్నారని ఆరోపించారు. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే కూడా రాహుల్ గాంధీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటువేయాలని కోరుతూ లోక్ సభలో మోషన్ ప్రవేశపెట్టారు.

# స్లమ్ ఏరియాల్లో మొబైల్ అంగన్‌వాడీలు

## ఇక ఇంటి దగ్గరికే సరుకులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మొబైల్ అంగన్వాడీలను ఏర్పాటు చేసే దిశగా తెలంగాణ సర్కార్ కసరత్తు ప్రారంభించింది. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లోని స్లమ్ ఏరియాల్లో ఈ మొబైల్ అంగన్వాడీలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. భవనాల కొరత, సాంకేతిక సమస్యలు, అలాగే కొత్త అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షల నేపథ్యంలో మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. తొలుత ఈ విధానాన్ని హైదరాబాద్‌తో పాటు, చుట్టు పక్కల జిల్లాల్లో అమలు చేయనుంది. దీనికి సంబంధించి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే మొబైల్ అంగన్వాడీ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇందులో భాగంగా హైదరాబాద్ మున్సిపాల్టీ పరిధిలో వలస కార్మికులు అధికంగా నివసించే ప్రాంతాలు, బస్తీలు, స్లమ్ ప్రాంతాల్లో అంగన్‌వాడీ సేవలను సరికొత్తగా అందించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. టేక్ హోం రేషన్ విధానంలో అర్హుల నివాసాలకే సరుకులు అందించే విధంగా చర్యలు తీసుకుంటారు. ఇందులో బాలమృతం, పాలు, స్నాక్స్, కోడి గుడ్లు, బియ్యం తదితర పోషకాహార పదార్థాలను పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమం అమలుకు సంవత్సరానికి సుమారు రూ.4 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు. అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే మొబైల్ అంగన్‌వాడీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. 37 వాహనాలను సిద్ధం చేసి, వాటి ద్వారా 274 స్లమ్ ఏరియాలను కవర్ చేస్తూ పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా శిశు సంక్షేమశాఖ కార్యాచరణను సిద్ధం చేసింది. జిల్లా వారీగా హైదరాబాద్ లో 7, మేడ్చల్‌మల్కాజిగిరిలో 15, సంగారెడ్డిలో 1, రంగారెడ్డిలో 14 వాహనాలను వినియోగించనున్నారు. ఈ మొబైల్ కేంద్రాలను సమీప అంగన్వాడీ కేంద్రాలకు అనుబంధంగా నిర్వహిస్తారు. ఫలితంగా అర్హులు ఎక్కడ ఉంటారో వాళ్ల ఉండేచోటనే సరుకులను అందిస్తారు.



ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపి జి.సంజీవరెడ్డిని సత్కరిస్తున్న పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, చిత్రంలో మాజీ ఎంపి వి.హనుమంతరావు, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ఆర్‌సి కుంతియా తదితరులు

## కార్మికుల సేవలో తరించిన గొప్ప వ్యక్తి సంజీవరెడ్డి

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి) ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** కార్మిక లోకం కోసం సంజీవ రెడ్డి చేసిన పోరాటాలు, అందిస్తున్న సేవలు అసమానమైనవని టీపీ సీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం బాగ్ లింగంపల్లి విఎస్టి యూనియన్ భవన సముదాయంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ పార్లమెంట్‌సభ్యుడు డాక్టర్ ఎం.సంజీవరెడ్డి అభినందన సత్కారసభ ఆర్‌డి చంద్రశేఖర్ ఆధ్వ ర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మహేష్‌కుమార్‌గౌడ్ మా ట్లాడుతూ ఢిల్లీ స్థాయిలో కార్మికుల గళాన్ని వినిపించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. దశాబ్దాల కాలంగా కార్మిక హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తున్న వ్యక్తి సంజీవరెడ్డి అని, ఆయన నాయకత్వం రాష్ట్రానికే కాక దేశానికే గర్వకారణమని అన్నారు. ఎఐసిసి ప్రధాని కార్యదర్శి ఆర్‌సి కుంతియా ప్రసంగించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వి.హను మంత రావు, తెలంగాణ కనీస వేతన సంఘం చైర్మన్ జనక్ రాజ్, ఇంటర్నే షనల్ లేబర్ ఆర్గనైజషన్ గవర్నింగ్ బాడీ సభ్యుడు సత్యజిత్ రెడ్డి, ఐఎన్ టి యుసి ప్రధానకార్యదర్శి ఆర్ డి.చంద్రశేఖర్, విఎస్‌టి వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎల్ డి.పాల్ తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి థర్మల్‌కు బొగ్గు సమస్య

### జెన్కోకు సరఫరా చేయలేమన్న సింగరేణి

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** వేసవికాలం ప్రారంభమవుతున్న తరుణంలో యాదాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి బొగ్గు సమస్య తలెత్తే ప్రమాదం ఏర్పడింది. పూర్తి స్థాయిలో బొగ్గు సరఫరా చేయలేమని రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కోకు సింగరేణి కాలరీస్ స్పష్టం చేయడంతో దాని ప్రభావం యాదాద్రిపై పడనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన మేరకు బొగ్గును సరఫరా చేయమని జెన్కోకు ఇటీవల సింగరేణి లేఖ రాసినట్లు సమాచారం. నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలని తమపై ఒత్తిడి తీసుకురావద్దని అందులో స్పష్టం చేసింది. ఇదే సమయంలో రాష్ట్రంలో వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో డిమాండ్‌కు తగినట్లుగా పూర్తిస్థాయి సామర్థ్యంతో థర్మల్ కేంద్రాల్లో విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ జెన్కోను ఆదేశించింది. ఈ నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం థర్మల్ విద్యుత్ కేంద్రాలకు రోజుకు సుమారు 1.10 లక్షల టన్నుల బొగ్గు అవసరం ఉంటుంది. ఇందులో 50 శాతం నాణ్యమైన బొగ్గు విధిగా వినియోగించాలి. సింగరేణి నుండి టన్ను బొగ్గు రూ.5 నుండి రూ.6 వేల వరకూ జెన్కో కొనుగోలు చేస్తుండగా, ఇప్పుడు సింగరేణి తీసుకున్న నిర్ణయంతో విదేశీ బొగ్గును విధిగా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తప్పనిసరి అయింది. అయితే విదేశీ బొగ్గుకు టన్ను దాదాపు రూ.13 వేలకుపైగా ఉండటంతో ఆ మేరకు జెన్కోకు భారం పెరుగు తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో బొగ్గు విషయంపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని సింగరేణిపై వత్తిడి తేనున్నట్లు తెలుస్తోంది.

# మాది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** జిఒ నం. 317 కారణంగా స్థానికత కోల్పోయి దూర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న 223 మంది పంచాయతీ కార్యదర్శులకు రెండు సంవత్సరాలపాటు అంతర్ జిల్లా డిప్యూటేషన్‌పై నియామకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ మేరకు సచివాలయంలో పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులను అభినందిస్తూ గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమని ప్రశంసించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఉద్యోగుల అనుకూలమైన ప్రభుత్వమని స్పష్టం చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తోం దని,

## జిఒ 317తో నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేస్తున్నాం: మంత్రి సీతక్క

### పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించి అంతర్ జిల్లా డిప్యూటేషన్లకు అనుమతి ఇచ్చామని తెలిపారు. ఈ నిర్ణయంతో 223 మంది పంచాయతీ కార్యదర్శులకు భారీ ఊరట లభించిందన్నారు. పంచాయతీ సెక్రటరీల మిగిలిన సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు.

జీవో నెం.317తో నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేస్తూ అంతర్ జిల్లా డిప్యుటేషన్లకు అనుమతులు మంజూరు చేసినందుకు మంత్రికి కార్యదర్శులు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క కృషితోనే జీవో.317లో ఉన్న లోపాలను సరిదిద్దే అంశంలో పంచాయతీరాజ్‌శాఖ ముందంజలో నిలిచిందన్నారు. జీవో ప్రతులను మంత్రి చేతుల మీదుగా స్వీకరించిన కార్యదర్శులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్‌ఏ అధ్యక్షుడు పి. మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీనివాస్, ట్రెజరర్ జె. పాండరి నాథ్, ఉపాధ్యక్షుడు సి.నాగేశ్, ఆర్గనైజింగ్ సెక్ర టరీ బి. సురేష్‌గౌడ్, ఈసీ సభ్యులు ఎం. కవితా దేవి, ఆర్. వేణు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో 61 శాతానికిపైగా బిసిల గెలుపు

### బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్ హర్షం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 18:** రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీసీలు మొత్తంగా 61శాతానికిపైగా గెలవటం పట్ల బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. ఈ మధ్య జరిగిన పంచాయితీ ఎన్నికల్లో జనరల్ స్థానాలలో కూడా బీసీ అభ్యర్థులు 52.75శాతం గెలిచిన విషయం విదితమే. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మున్సిపల్ వార్డులలో బీసీలకు 28.22శాతం, మున్సిపల్ కార్పోరేషన్‌లలో వార్డులలో 35.25శాతం బీసీలకు కేటాయించినా జనరల్ స్థానాలలో కూడా బీసీలు గెలిచి, మొత్తం మీద 61శాతం గెలవటం బీసీ వర్గాల ప్రజలలో పెరిగిన చైతన్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. రాబోయే జెడ్‌పిటిసి, ఎంపిటిసి, జిహెచ్ఎంసి, కార్పోరేషన్ల ఎన్నికల్లో కూడా బీసీలు అత్యధికంగా గెలుస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరిగిన సమగ్ర సర్వేలో బీసీల సంఖ్య 56.33శాతం అని తేలగా, రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు పాస్ చేసినా అది ఇంకా కేంద్ర ప్రభుత్వంలో పెండ్డింగ్‌లో ఉండటం, కొందరు కోర్టు కెళ్లి ఈ రిజర్వేషన్ అమలు కాకుండా చేయడం సముచితం కాదన్నారు. గత పంచాయితి ఎన్నికల్లో, ఇప్పుడు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీసీలు గెలిచిన స్థానాలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లకు అమలు చేయడానికి అనుమతినివ్వాలని, 9వ షెడ్యూల్‌లో పెట్టాలని, అదేవిధంగా కోర్టుల్లో కేసులు వేసిన వారు కూడా వారి కేసులను ఉపసంహారించి చట్టబద్ధంగా బీసీల రిజర్వేషన్లు సాకారమయ్యే మార్గం సుగమం చేయాలని బీసీ కమిషన్ కోరుకుంటుందని పేర్కొన్నారు.

# రాజకీయ నాయకులు పరస్పరం గౌరవించుకుంటేనే ప్రజాదరణ




మండలి వెంకటకృష్ణారావు శతజయంతి సభలో ప్రసంగిస్తున్న మాజీ సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, వేదికపై రమణాచారి, బుద్ధప్రసాద్, జస్టిస్ భవానీ ప్రసాద్, జె.ప్రసాదరావు, కొలకలూరి ఇనాక్, తనికెళ్ల భరణి తదితరులు

## నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనం మండలి వెంకటకృష్ణారావు

### మాజీ ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** నేటి రాజకీయాలు, నాయకులు ఖర్చు, మాట్లాడే భాష చాలా అనుచితంగా మారిందని, నాయకులను హెచ్చరించాలని, రాజకీయ నాయకులంటే రౌడీలో, భాషరాని ఒకరినొకరు తిట్టుకునే అగౌరవపరచుకునే దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని, రాజకీయ నాయకులు పరస్పరం గౌరవించు కోకపోతే ప్రజలు ఆదరించరూ... ఏమాత్రం గౌరవించరన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సమైక్య ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డి హితవుపలికారు. ఎప్పుడైతే డబ్బు ప్రభావమొచ్చిందో ప్రజాప్రతి నిధులకు, ప్రజలకు, నాయకులకూ మధ్య గౌరవం తగ్గిందని స్పష్టం చేశారు. ఏవృత్తిలో లేనివిధంగా రాజకీయ నాయకులు తమంతటితాము గౌరవాన్ని తగ్గించుకుని, భాషతో ఒకర్నిఒకరు దూషించుకునే దుస్థితికి దిగజారిపోయారని వాపోయారు. మండలి వెంకటకృష్ణారావు రాజకీయ నాయకుల్లో గాంధేయవాది, నిరాడంబ రానికి నిలువెత్తు నిదర్శనమని, నీతినిజాయితీకి మారుపేరు, అందరికీ ఆదర్శప్రాయుడైన కారణంగా వంద సంవత్సరాలైనా తలచుకుంటున్నామని గుర్తుచేస్తూ నిర్వాహకులను అభినందిస్తూ కృష్ణారావుకు ఘననివాళులర్పించారు. రవీంద్రభారతిలో బుధవారం రాత్రి రసరంజని హైదరాబాద్ ఆధ్వర్యంలో డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగిన మండలి శతజయంతి సభకు ముఖ్యఅతిథిగా ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి, విశిష్ట అతిథులుగా విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గ్రంథి భవానీ ప్రసాద్, ఏపి ఎమ్మెల్యే డా. మండలి బుద్ధప్రసాద్, ఏపి మాజీమంత్రి జలగం ప్రసాదరావు, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్, ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ళ భరణి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న తదితరులతో కలిసి శతజయంతి జరుపుకుంటున్న మండలి వెంకటకృష్ణారావు చిత్రపటానికి పులమాలవేసి, జ్యోతిప్రకాసనంచేసి ఘననివాళు లర్పించి ప్రసంగించారు. ముందుగా రసరంజని డి.రామకోటేశ్వరరావు సభకు స్వాగతం పలికారు. డా. కె.వి.రమణాచారి అధ్యక్షోపన్యాసంలో మండలి వెంకటకృష్ణారావు అంటేనే ఒక సంస్కారం, సంస్కృతి, సంప్రదాయానికి చిహ్నామని, ఒక రాజకీయ మహర్షికి, నీతినియమాల ప్రజాసేవ దురంధరుడుకు, జరుగుతున్న నూరేళ్ల పండుగ ఇదన్నారు. వెంకట కృష్ణారావు కర్మయోగి, కారణజన్ముడు, ఒక రాష్ట్ర మంత్రిగా, నాయకుడుగా చేసిన ప్రజాసేవ అనంతం, అనితరసాధ్యం, అత్యద్భుతమని, తెలుగు నుడికారానికి, భాషకు గుడికట్టి అక్షర అర్చన చేసిన పూజారి అని కొనియాడారు. అనంతరం జస్టిస్ గ్రంథి భవానీప్రసాద్, జలగం ప్రసాదరావు, మండలి బుద్ధప్రసాద్, తనికెళ్ళ భరణి, కొలకలూరి ఇనాక్‌లు వెంకటకృష్ణారావు గురించి, ఆయనతో తమ సాన్నిహిత్యాన్ని పంచుకున్నారు. చివరిగా మండలి వెంకట కృష్ణారావు భారతదేశ, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చేసిన విశేష సేవలను గుర్తుచేస్తూ రసరంజని హైదరాబాద్ నిర్వహణలో ప్రముఖ సాహితీవేత్త డా. దీర్ఘాసి విజయభాస్కర్ రచన, గంగోత్రి సాయి దర్శకత్వంలో అరవింద్ ఆర్ట్స్, తాడేపల్లి సమర్పణలో మహాపురుషుడు మండలి నాటకం అద్భుతంగా ప్రదర్శించారు.




ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి

## రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

### టిపిఆర్‌పిఎ ధర్నాలో పలువురు వక్తల డిమాండ్

**హైదరాబాద్(ధర్నాచౌక్), ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** అనేక సంవత్సరాలుగా పెం డింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పలు వురు వక్తలు డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టిపిఆర్‌పిఎ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో పెన్షనర్ల గ్రాట్యుటీ, కమ్యూటేషన్, పిఎఫ్ పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి, టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, టిజిఈజేఏసీ అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు మారెం జగదీశ్వర్, ఏటూరి శ్రీనివాస్‌రావు, ఆలిండియా ఈపీఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఛైర్మన్ ఎం.ఎస్.రెడ్డి, మెడికల్ ఎంప్లాయిస్ రిటైర్డ్ అధ్యక్షులు భరత్ సత్యనారాయణ, సీఐటియూ రాష్ట్ర నాయకులు జే.వెంకటేష్, రేవా, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ వర్కర్స్ అసోసియేషన్ ప్రతి నిధులు ఎం.ఎన్.రెడ్డి, పి.నారాయణరెడ్డి, పి. కృష్ణమూర్తి, జి.అశోక్ హాజరై ప్రసంగించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడితే రిటైర్డ్ ఉద్యోగుల సమ స్యలు పరిష్కారం అవుతాయని భావించి, రిటైర్డ్ ఉద్యోగులు సైతం తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడినప్పటికీ, పది సంవత్స రాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించ కుండా అన్యాయం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్ల అయినప్పటికీ, సమస్యలు పరిష్కరించకపోవటం దుర్మార్గమని ధ్వజమెత్తారు.

## ఎఫ్ఎస్ఎల్ పోస్టుల భర్తీ.. రాత పరీక్షల తేదీ విడుదల

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో ఖాళీగా వున్న పలు కేటగిరీల పోస్టుల భర్తీకి సంబంధించి రాత పరీక్షల తేదీని తెలంగాణ పోలీసు నియామక మండ లి ప్రకటించింది. ఈ మేరకు మండలి ఛైర్మన్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే మార్చి నెల ఐదు, ఆరు, ఏడవ తేదీల్లో శివార్లలోని మేడ్చల్ పోలీసు శిక్షణా సెంటర్‌లో ఈ రాత పరీక్షలు వుంటాయని ఆయన తెలిపారు. ప్రతీ టెక్నికల్ పరీక్ష సమయం గంట మాత్రమే వుంటుందని ఆయన వెల్లడించారు. మార్చి ఐదవ తేదీన మూడు సెషన్లలో సైంటిపిక్ ఆఫీసర్స్, సైంటిఫిక్ అసిస్టంట్స్ (ఫిజికల్, జనరల్, కంప్యూటర్స్), ల్యాబ్ అటెండం ట్స్, ల్యాబ్ టెక్నిషియన్స్ పోస్టుల భర్తీకి పరీక్షలు జరగనుండగా ఆరవ తేదీన కెమికల్ విభాగా నికి సంబంధించిన సైంటిఫిక్ ఆఫీసర్స్, అసిస్టంట్ టెక్నీషియన్స్, పోస్టులకు, ఏడవ తేదీన బ యోలజీ, సెరోలజీ విభాగాలకు సంబంధించిన పోస్టుల భర్తీకి రాత పరీక్షలు జరగనున్నాయని శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 4664 మంది అన్ని పోస్టులకు దరఖాస్తు చేసుకోగా 3760 మంది హాజరై తమ ధృవ పత్రాలను పరిశీలన చేయించుకున్నారని ఆయన తెలిపారు. అయితే వీరిలో 1:5 పోస్టుల రీత్యా అభ్యర్థులను ఎంపిక చేసినట్లు నియామక మండలి ఛైర్మన్ తెలిపారు.

## మైనింగ్ ఆదాయంపై దృష్టి

### ఖనిజాల లీజుకు టెండర్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** ఖనిజ ఆదాయంపై మైనింగ్ శాఖ దృష్టి సారించింది. పెద్దతరహా సున్నపురాయి బ్లాకులను వివిధ దశల్లో లీజుకు ఇస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే రెండు దశలు టెండర్లు, లీజు ప్రక్రియలను పూర్తి చేసిన అధికారులు తాజాగా మూడో దశలో మూడు బ్లాక్‌లను గుర్తించి వాటికి టెండర్లను అహ్వానించారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ తదితర ప్రాంతాల్లో మూడు బ్లాక్‌లను లీజుకు ఇవ్వనున్నారు. కాగా మొదటి వాయిదాలోని 20 శాతం లీజుకు సంబంధించి మైనింగ్ శాఖకు రూ.12.55 కోట్ల మేర ఆదాయం రాగా, రెండో దశలో నిర్వహించిన మరో రెండు సున్నపురాయి బ్లాక్‌ల ద్వారా ఇంకో రూ.12.93 కోట్లు సమకూరాయి. ఇక చిన్న తరహా ఖనిజాలకు సంబంధించి మొదటి దశలో 12 బ్లాక్‌లను వేలం వేయగా వాటిలో ఆరు బ్లాక్‌ల ద్వారా రూ.41.75 కోట్లు సమకూరింది. మిగిలిన బ్లాక్‌లకు తక్కువగా టెండర్లు వేయడంతో వాటిని రద్దు చేశారు. అలాగే రెండో దశలో రాష్ట్రంలో 34 బ్లాక్‌లను వేలం వేయగా, వాటిలో 19 బ్లాక్‌లకు తక్కువ మొత్తంలో టెండర్లు వచ్చాయి. దీంతో వాటిని రద్దు చేసిన అధికారులు మిగిలిన 15 బ్లాక్‌లను లీజుకు ఇవ్వడంతో తద్వారా రూ.20.28 కోట్లు చొప్పున ఆదాయం లభించింది. మూడో దశలో 19 బ్లాక్‌లను వేలం వేయగా, అందులో 7 బ్లాక్‌లకు తక్కువ మొత్తంలో టెండర్లు రావడంతో వాటి బిడ్లను రద్దు చేశారు. మిలిగిన 12 ఖనిజాల బ్లాక్‌ల ద్వారా రూ.7.21 కోట్లు చొప్పున మైనింగ్ శాఖకు ఆదాయం సమకూరింది.

## గీత కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### కామారెడ్డి డిక్లరేషన్ అమలుచేయాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా కల్లుగీత కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. తక్షణమే గీత కార్మికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం స్పందిచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అయిదు లక్షలకు పైగా కల్లుగీత కార్మిక కుటుంబాలు ఉన్నాయని, రెండు సంవత్సరాల కాలంలో చెట్లెక్కి కిందపడి వృత్తికి దూరమైన కార్మికులు 850 మంది ఉన్నారని, 140 మంది చనిపోగా మరో 170 మంది శాశ్వతంగా వికలాంగులయ్యారని వివరించారు. అయితే వారికి ఇస్తామన్న రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం ఇవ్వలేదని మండిపడ్డారు. ఎక్స్‌గ్రేషను రూ.5లక్షల నుండి రూ.10 లక్షల వరకు పెంచుతామన్న కామారెడ్డి డిక్లరేషన్ హామీ నేటికీ అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఈ విషయమై బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నీరా కేఫ్‌ను అభివృద్ధి చేసి గీత కార్మిక కుటుంబాలను ఆదుకోవడంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం గీత కార్మికులు చేస్తున్న ఆందోళనకు సీపీఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. వెంటనే కార్మికులకు ఇస్తామన్న రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియాను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రూ. 14 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గీత కార్మికుల పెన్షన్‌ను రు.4000 కు పెంచాలని, నీరా, తాటి, ఈత ఉత్పత్తులను అభివృద్ధి చేసి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు.

## టాలీవుడ్ వ్యాపారంలో క్రమశిక్షణ

### తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కీలక నిర్ణయం

## నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్ల వివాదంపై రాతపూర్వక ఒప్పందం తప్పనిసరి

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** తెలుగు సినిమా నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్ల మధ్య వివాదాలు చాలా రోజులుగా ఉన్నాయి. వీటిపై తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌కు తరచూ ఫిర్యాదులు వస్తుండటంతో పెద్దలు తలనొప్పిగా తయారయింది. ముఖ్యంగా చాలావరకు ఒప్పందలు రాతపూర్వకంగా లేకపోవడంతో వివాదాలు సద్దుమణగడం లేదు. దీంతో టాలీవుడ్ వ్యాపార పద్ధతుల్లో మరింత క్రమశిక్షణ తీసుకురావాలనే లక్ష్యంతో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్మాతలు, పంపిణీదారుల మధ్య రాతపూర్వక ఒప్పందాలను తప్పనిసరి చేసింది. ఇరువర్గాల మధ్య లావాదేవీలు జరిగిన 15 రోజుల్లోపు అమలు చేసిన ఒప్పందం కాపీని సమర్పించకపోతే ఫిర్యాదులను స్వీకరించకూడదని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయించింది. సంబంధిత వారందరికీ అధికారిక సమాచారంలో సినిమా పంపిణీ, ఇతర వాణిజ్య లావాదేవీలకు సంబంధించిన ఫిర్యాదుల సంఖ్య పెరుగుతున్నట్లు పేర్కొంది. అయితే చాలా సందర్భాలలో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు పరస్పరం అంగీకరించిన నిబంధనలు, షరతులను స్పష్టంగా వివరించే రాతపూర్వక ఒప్పందాలను లేకుండానే నోటిమాట ద్వారా సర్దుబాటు చేసుకుం టున్నారు. లిఖిత ఒప్పందాలు లేకపోవడం వల్ల వివాదాలు తలెత్తుతున్నాయి.

ఇక ఫిర్యాదులను నిష్పాక్షికంగా పరిశీలించి పరిష్కరించే సామర్థ్యం పరిమితం చేయబడిందని ఈ సందర్భంగా నిర్మాతల మండలికి రాసిన లేఖలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ పేర్కొంది. వీటిపై ఇటీవల జరిగిన తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో వివరంగా చర్చించారు. చర్చల తర్వాత సినిమా నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్ల మధ్య రాతపూర్వక ఒప్పందాన్ని అమలు చేయడం తప్పనిసరి అని, దానిని తప్పనిసరిగా పరిశ్రమలో ఒక పద్ధతిగా పరిగణించాలని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ గట్టిగా నొక్కి చెప్పింది. దీని ప్రకారం, సంబంధిత వ్యక్తుల మధ్య రాతపూర్వక ఒప్పందం లేని లావాదేవీల నుండి వచ్చే ఫిర్యాదు లేదా వివాదాన్ని ఛాంబర్ స్వీకరించదు. అలాంటి వివాదాన్ని నమోదు చేయకూడదని, ప్రాసెస్ చేయకూడదని ఛాంబర్ నిర్ణయించింది. ఫిర్యాదులు దాఖలు చేయాలనుకునే సభ్యులు పదిహేను రోజుల్లోపు ఫిర్యాదు చేయాలి. అమలు చేసిన ఒప్పందం కాపీని ఫిర్యాదుతో పాటు సమర్పించాలి. సరైన ధృవీకరణ, వివాదాలను న్యాయంగా పరిష్కరించడానికి ఈ విధానం ఖచ్చితంగా అమలు చేయనుంది ఛాంబర్. సరైన డాక్యుమెంటేషన్ లేకుండా వాణిజ్య ఏర్పాట్లు చేసుకునే ఇరుపక్షాల గురించి బాధ్యత తమకు లేదని స్పష్టం చేసింది. స్వంత బాధ్యతతోనే ఒప్పందాలు చేసుకోవాలని చెప్పింది.

# మున్సిపల్ ఎన్నికల్లో బిసిలకు అమలైన 61 శాతం రిజర్వేషన్లు




బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మెట్టు సాయికుమార్

## మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుని బిసిలకు మున్సిపల్ ఎన్నికల్లో 61శాతం రిజర్వేషన్లు అమలు చేశామని మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ పేర్కొన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కామారెడ్డి డిక్లరేషన్ చేసిందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ బిసిలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకుందన్నారు. 42 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్‌పెట్టి గవర్నర్‌కు పంపించినట్లు తెలిపారు కానీ కేంద్రం అడ్డుకుంద్దన్నారు. కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి బిసి రిజర్వేషన్లు అడ్డుకున్నారని, ఓ వైపు బిసి రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూనే మరోవైపు కోర్టులో కేసులు వేశారన్నారు. బిజెపి, బిఆర్ఎస్ అడ్డుకున్నా బిసిలకు మున్సిపల్ ఎన్నికల్లో 61 శాతం రిజర్వేషన్లు అమలు చేసామని వెల్లడించారు. ఎలక్షన్ కమిషన్ బిసిలకు ఇచ్చిన రిజర్వేషన్ల కంటే వంద శాతం ఎక్కువ ఇచ్చామన్నారు. డిసిసి అధ్యక్షుల పదవులలో కూడా బిసిలకే ఎక్కువ ఇచ్చామని, పంచాయతీ ఎన్నికల్లో 42 శాతం మించి టిక్కెట్‌లు ఇచ్చామని, ఎక్కువ శాతం వారే గెలిచారన్నారు. వరంగల్, పెద్దపల్లి, మహబూబ్ నగర్, నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బిసి లకు 90శాతం పైగా సీట్లు ఇచ్చామన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో 13 కార్పోరేషన్‌లలో 4 మేయర్ పదవులు మాత్రమే బిసిలకు ఇచ్చారు. ఇప్పుడు మేము 7 కార్పోరేషన్‌లలో 4 బిసిలకు ఇచ్చామని, బిసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కేసు వేసిన వారికి బిఆర్ఎస్ బీ ఫారం ఇచ్చిందన్నారు. ముస్లింలను బిసి రిజర్వేషన్లలో ఎలా చేర్చుతారని ప్రశ్నించిన బిజెపి కరీంనగర్ కార్పోరేషన్‌లో బిసికి కేటాయించిన వార్డులో బిజెపి అభ్యర్థిగా ముస్లింకి ఎలా టిక్కెట్ ఇచ్చారన్నారు. బిసి రిజర్వేషన్ల విషయంలో బండి సంజయ్ రాజకీయాలు ఆపాలన్నారు. సావర్కర్, శ్యాం ప్రసాద్ ముఖర్జీ హిందూ ద్రోహులు ముస్లిం లీగ్‌తో పొత్తు పెట్టుకుని, స్వాతంత్ర్య ఉద్యమంకు నష్టం చేశారన్నారు.

### సామాజిక న్యాయం నినాదానికి కట్టుబడి ఉన్నాం: మెట్టు సాయికుమార్

సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ముందు కెళ్తుందని, సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తున్నామని ఫిషరీస్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల హామీ అనుసారం మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్స్ ఇచ్చిందని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం రెండు చట్టాలు చేశామన్నారు. గవర్నర్ వద్ద దగ్గర పెండింగ్ ఉన్నాయని, బిసి రిజర్వేషన్ల విషయంలో కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలు ద్వంద వైఖరితో అడ్డుపడ్డారన్నారు.

## ఇ-పెట్టి కేసుల్లో ముగ్గురు నిందితులకు జైలుశిక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** నగరంలోని మూడు వేరువేరు పోలీసు స్టేషన్ల పరిధుల్లో నమోదైన ఇ-పెట్టి కేసుల్లో నిందితులుగా ఉన్న ముగ్గురికి ఇ-పెట్టి కేసులను విచారించే కోర్టు జైలుశిక్ష విధించింది. ఇందులో ఇద్దరికి మూడు రోజులు, మరొక వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష పడి ంది. వివరాలు ఇలావున్నాయి. ఈ నెల 17వ తేదీన అర్ధరాత్రి సమయంలో మద్యం సేవించిన మహమ్మద్ సమీర్ (23), మహమ్మద్ ఫైజాన్ (29) (ఇద్దరు మల్లేపల్లి వాసులు) రోడ్డుపై అనుమానాస్పదంగా తిరుగుతూ గస్తీ పోలీసులకు తారసపడ్డారు. వీరిని విచారించగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. వీరిని వెంటనే అరెస్టు చేసిన పోలీ సులు బుధవారం ఉదయం ఇద్దరిని నాంపల్లి ఈ పెట్టి కోర్టులో హాజరు పరచగా ఈ కేసును విచారించిన న్యాయమూర్తి ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు. అనంతరం ఇద్దరిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా మరో ఘటనలో కుల్సుంపురా పరిధిలో మహమ్మద్ ఇంతియాజ్ (40) అనే ఆటో డ్రైవర్ (40) తన ఇంటి సమీపంలోనే నివసించే మహిళపై మంగళవారం రాత్రి మద్యం మత్తులో అకారణంగా దాడి చేసి న్యూసెన్స్ చేశాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని వెంటనే అరెస్టు చేసి బుధవారం ఉదయం కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసును విచారించిన న్యాయ మూర్తి ఐదు రోజుల జైలుశిక్ష విధించారు. ఇతన్ని కూడా చంచల్‌గూడ జైలుకు తరలించారు.




## నేను ఇప్పట్లో భారత్‌కు తిరిగిరాలేను..

### ముంబయి హైకోర్టుకు విజయ్‌మాల్యా పిటిషన్

**ముంబయి, ఫిబ్రవరి 18:** పరారీలో ఉన్న వ్యాపారవేత్త విజయ్ మాల్యా తాను భారత్‌కు తిరిగిరాలేనని బాంబే హైకోర్టు కు తెలియజేశారు. తాను బ్రిటన్‌ను దాటి రాకుండా చట్టపరమైన ఆంక్షలు ఉన్నాయని, అందువల్ల తాను భారత్‌కు ఎప్పుడు తిరిగి వస్తాననేది కచ్చితంగా చెప్పలేనని మాల్యా పేర్కొన్నారు. ఈ మేరకు విజయ్ మాల్యా తరఫు న్యాయవాది అమిత్ దేశాయ్ బాంబే కోర్టులో ఒక స్టేట్‌మెంట్‌ను సబ్మిట్ చేశారు. మాల్యా దగ్గర యాక్టివ్ ఇండియన్ పాస్‌పోర్టు లేదని, అదేవిధంగా దేశం దాటి వెళ్లకుండా ఇంగ్లండ్, వేల్స్ కోర్టుల ఆంక్షలు ఉన్నాయని ఆ సబ్మిషన్‌లో అమిత్ దేశాయ్ పేర్కొన్నారు. బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రశేఖర్, జస్టిస్ గౌతమ్ అనఖాద్‌లతో కూడిన ధర్మాసనం గత వారం విజయ్ మాల్యా పిటిషన్‌పై విచారణకు నిరాకరించింది. తనను పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ మాల్యా దాఖలు చేసిన పిటిషన్‌పై అతను భారత్‌కు రాకుండా విచారణ జరపలేమని స్పష్టం చేసింది. మాల్యాకు భారత్‌కు తిరిగొచ్చే ఉద్దేశం ఉందా లేదా అని ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో విజయ్ మాల్యా తన తరఫు న్యాయవాది ద్వారా బాంబే హైకోర్టులో తాజా స్టేట్‌మెంట్‌ను సబ్మిట్ చేశారు. మాల్యా పిటిషన్ విచారణ జరిపేందుకు ఆయన ప్రత్యక్షంగా కోర్టుకు హాజరు కావాల్సిన అవసరం లేదని దేశాయ్ వాదించారు. కాగా మాల్యా 2016 మార్చి నుంచి యూకేలో ఉంటున్నారు. బ్యాంకు రుణాల ఎగవేత, మనీలాండరింగ్ తదితర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయనను 2019లో పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా ప్రకటించారు.



## పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వండి

### హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ కమిషనర్లకు సూచించిన

### ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణారావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం సచివాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు నగర పరిశుభ్రతపై ఇప్పటి వరకు తీసుకుంటున్న చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సిఎస్‌కు వివరించారు. ఈ సమావేశంలో పరిశుభ్రత, చెత్త సేకరణ విధానం, పరిశుభ్రతా చర్యలు, ప్రజా ఆరోగ్య పరిరక్షణపై తీసుకుంటున్న చర్యలను సిఎస్ సమగ్రంగా పరిశీలించారు. వివరాలన్నంటిని ఎప్పటికప్పుడు డాష్ బోర్డ్‌లో పొందుపరచాలని ఆదేశించారు. జిహెచ్‌ఎంసి పరిధిలో 4500 స్వచ్ఛ ఆటోలు ఇంటింటికి తిరిగి చెత్త సేకరిస్తున్నాయని, 2650 స్వయం సహాయక బృందాల సభ్యులు మొత్తం 18 వేల 557 మంది శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్నారని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. నగర పరిధిలో రోజు వారిగా 7800 టన్నుల మేరకు చెత్త సేకరణ జరుగుతుందని అన్నారు. మున్సిపల్ విభాగం ప్రభుత్వంలో కీలకమని, ప్రజల అవసరాలకు తగినట్లుగా బాధ్యతలు నిర్వర్తించాలని, అధికారులు విధులలో నిరక్ష్యం వహిస్తే ఉపేక్షించమన్నారు. రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉండేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. చెత్త సేకరణ (డ్రై, వెట్ వేస్ట్), ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నగరంలో పారిశుధ్య పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, సమయానుసారంగా నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ వ్యవస్థలను శుభ్రపరిచే చర్యలు ముందస్తుగా చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ కార్యదర్శి టి.కె.శ్రీదేవి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజన, మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్లు, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో పెరిగిన బాధ్యత : ఎంపి చామల

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో మామీద బాధ్యత మరింత పెరిగిందని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. తన పార్లమెంట్‌లో రెండు మున్సిపాలిటిలు ఓడిపోయామన్నారు. చేర్యాల,తిరుమలగిరి మున్సిపాలిటీలలో నాయకులకు, కార్యకర్తలకు మధ్య గ్యాప్ ఉందన్నారు. అక్కడ ఉన్న నాయకులు కోవర్టులాగ మరారని, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలసి రెండు మున్సిపల్ పరిధిలోని కోఆర్డినెటర్లతో పోస్ట్ మార్టం చేస్తామన్నారు. రిపోర్ట్ తెప్పించి వాస్తవాలను తెలుసుకుంటామని, తిరుమలగిరిలో కాంగ్రెస్ ఓటమికి కారణమైన ఎవరైనా చర్యలు తీసుకోవాలన్నారు. చర్యలు తీసుకుంటే పార్టీ బాగు పడుతుందన్నారు. కెసిఆర్ ప్రత్యక్ష పాత్ర పోషించకుండా పామ్ హౌస్‌లో పడుకున్నాడని, 2023 నుండి ఆరు సార్లు కెసిఆర్ ఘోరంగా ఓటమి పాలయ్యాడని, కెసిఆర్ లక్కీ నెంబర్ ఆరు కీలకమైన కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో సైతం ఓడిపోయాడని అన్నారు.

# విద్య, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం

### యుద్ధప్రాతిపదికన హాస్టల్ భవనాల మరమ్మతులు

### దేశంలోనే మోడల్‌గా అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు

### గురుకులాల్లో అధికారుల పరిశీలన నిరంతరం జరగాలి

### ప్రీబడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీసిఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి18:** రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని, ఈ రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడబోదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మైనారిటీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, రోడ్డు రవాణా, నీటిపారుదల శాఖ, సివిల్ సప్లయిస్, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల బడ్జెట్ సమావేశాలు జరిగాయి. సమావేశాల్లో మంత్రులు ఉత్తంకుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అజారుద్దీన్‌లతో కలిసి డిప్యూటీ సీఎం ప్రీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించారు. మంత్రి అజారుద్దీన్‌తో కలిసి మైనార్టీ సంక్షేమ శాఖ సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లా డుతూ ఆలోచించి, నిబద్ధతతో ప్రాధాన్యతను గుర్తించి, ఆదాయం ఖర్చుపై దృష్టి సారించి బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సంక్షేమ శాఖకు సంబంధించి వసతి గృహాలు, గురుకులాల బిల్లులు ఎంత తొందరగా పంపితే అంత తొందరగా క్లియర్ చేస్తామని, వసతి గృహాల భవనాల మరమ్మత్తులు వేగంగా పూర్తి చేయాలని మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని అన్ని వర్గాల విద్యార్థులు ఉమ్మడి కుటుంబంలా కలిసిపోవడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. విద్యార్థులు, టీచింగ్ స్టాఫ్‌కు బయోమెట్రిక్ విధానం లేకపోతే వెంటనే అమలులోకి తీసుకురావాలని వాటిని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని ఆదేశించారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ బిల్డింగ్‌ల పైన సోలార్ పవర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ తో సమావేశమై ఏర్పాటు చేసుకోవాలని కరెంటు భారం లేకుండా చేసుకోవడమే కాదు, సోలార్ ద్వారా ఆదాయం సృష్టించుకోవచ్చని తెలిపారు. వసతి గృహాలు, సంక్షేమ హాస్టళ్లకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం కొత్త మెనూ అమల్లోకి తీసుకు వచ్చాం, వసతి గృహాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం వి నేపథ్యంలో జిల్లా అధికారులు, రాష్ట్రస్థాయి అధికారులు వసతి గృహాలను సందర్శించి అన్ని విషయాలను పరిశీలించాలని వీలైతే ఒక రోజు రాత్రి అక్కడే బస చేయాలని గతంలోనే ఆదేశించాం, ఆ ప్రక్రియ ఎంత మేరకు కొనసాగుతుందో సెక్రటరీలు ఆయా జిల్లా కలెక్టర్ల ద్వారా పర్యవేక్షణ జరపాలని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వసతి గృహాల అద్యలను క్లియర్ చేస్తున్నామని తెలిపారు. హాస్టల్ బిల్డింగుల మరమ్మతు బిల్లులు ఉంటే వెంటనే పంపాలని వెనువెంటనే క్లియర్ చేస్తామని తెలిపారు. వరి సాగు పెద్ద ఎత్తున చేయడం, బాయిల్డ్ రైస్ ను తమిళనాడు వంటి రాష్ట్రాలు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడం నేపథ్యంలో భవిష్యత్తులో రాష్ట్ర రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉన్న నేపథ్యంలో పంట మార్పిడికి అవకాశాలను పరిశీలించాలని నీటిపారుదల శాఖ సమావేశంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సూచించారు. వరి స్థానంలో పామ్ ఆయిల్, పప్పు ధాన్యాలు సాగు చేస్తూ, పంట నిలువల స్టోరీ ఈ సామర్థ్యాన్ని రాష్ట్రంలో పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. తమ ప్రభుత్వం బీసీలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పిస్తుంది. బీసీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గ్రీన్ చానెల్ ద్వారా డైట్ కాస్మొటిక్ ఛార్జీలు విద్యార్థులకు స్కాలర్ షిప్ లు విడుదల చేస్తుందనీ డిప్యూటీ సీఎం తెలిపారు. గత ప్రభుత్వం గురుకుల పాఠశాలలు అద్దెలు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచేదని ప్రజాపాలన ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు గురుకుల పాఠశాలలు, ఈసారి బడ్జెట్ లో బీసీ లలో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి వారి ఆర్థిక వృద్ధి సాధించడానికి ప్రత్యేక పథకాలు ప్రారంభించాలని కోరడం జరిగిందనీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహాలక్ష్మీ ద్వారా ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా జరుగుతుంది. ప్రభుత్వం మహా లక్ష్మీ నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తుంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల కోసం హైదరాబాద్ కు వచ్చి ఆర్థికంగా, ఇతరత్రా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నియోజకవర్గ కేంద్రాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు ప్రారంభించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం వివరించారు. దేశంలో, రాష్ట్రంలో అత్యుత్తమ ఉపాధ్యాయులను గుర్తించి హైదరాబాద్ నుంచి ఆన్లైన్లో పాఠాలు బోధిస్తారని ఇది దేశంలోనే ఒక మోడల్ గా మారబోతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. లోయర్ ట్యాంక్ బండ్, కాచిగూడ కేంద్రంలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్న విలువైన స్థలాల్లో భారీ బవంతులు నిర్మించి విద్యార్థులకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు భవనాలు నిర్మించే ఆలోచనలు చేయాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సంక్షేమ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్, రవాణా,రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ, సివిల్ సప్లై శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సంక్షేమ శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, సమాచార శాఖ కమిషనర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



## గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం తగదు

### సోనియా, రాహుల్ కుట్రలను ఖండిస్తున్నా: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** అంతర్జాతీయ వాణిజ్య రవాణా విషయంలో భారతదేశం మరింత వ్యూహాత్మకంగా ముందడుగేయనుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. భారత భూభాగమైన నికోబార్ దీవుల్లో హిందూ మహాసముద్రం, పసిఫిక్ సముద్రాన్ని (సౌత్ చైనా సీ) కలిపి అత్యంత కీలకమైన మలక్కా జలసంధి సమీపంలో గ్రేట్ నికోబార్ మెగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టును చేపట్టనుంది. ఈ దీర్ఘకాలిక ప్రాజెక్టుకున్న అవాంతరాలను ఒక్కొక్కటిగా తొలగించుకుంటూ కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. నికోబార్ దీవుల్లో రూ. 80వేల కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు బంగాళాఖాతంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో వ్యూహాత్మక, ఆర్థిక, రవాణా హబ్‌గా అత్యంత కీలకమైన ఒక వాణిజ్య కేంద్రంగా తయారు చేయాలని గ్రేట్ నికోబార్ మెగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్‌ను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రపంచ తూర్పుపడమర షిప్పింగ్ మార్గాల్లో వాణిజ్య రవాణాకు అనుకూలంగా ఉంటుంది. భారతదేశం ప్రస్తుతం ట్రాన్స్‌షిప్‌మెంట్ కోసం (వస్తు రవాణా కోసం) విదేశీ ఓడరేవులపై ఎక్కువగా ఆధారపడుతుంది. దీన్ని కాస్త తగ్గించుకునే లక్ష్యంతో ప్రముఖ అంతర్జాతీయ వాణిజ్య మార్గమైన మలక్కా జలసంధికి సమీపంలో, అంతర్జాతీయ ట్రాన్స్‌షిప్‌మెంట్ టెర్మినల్, అంతర్జాతీయ విమానాశ్రయం, విద్యుత్ ప్లాంట్, టౌన్‌షిప్‌ను నిర్మించడం ద్వారా ఈ ప్రాంతంపై పట్టుసాధించాలనుకుంటుందన్నారు. దీనికితోడుగా భారత్ ట్రాన్స్‌షిప్‌మెంట్ కోసం (వస్తు రవాణా కోసం) విదేశీ ఓడరేవులపై ఎక్కువగా ఆధారపడుతున్న సందర్భంలో గ్రేట్ నికోబార్ మెగా ఇన్‌ఫ్రా ప్రాజెక్టు ఎంతో మనకెంతో ఉపయోగకరం కానుందన్నారు.

ఈ ప్రాజెక్ట్ కు అడ్డంకులు సృష్టించేందుకు అంతర్జాతీయంగా, మన దేశంలోనూ చాలామంది ప్రయత్నించారు. దాదాపు రూ. 80వేల కోట్ల విలువైన గ్రేట్ నికోబార్ మెగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టును ముందుకు వెళ్ళకుండా అడ్డుకోవడానికి, అంతర్జాతీయ కుట్రదారులతో కలిసి తల్లీ, కొడుకులైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు విశ్వప్రయత్నాలు చేస్తు న్నారని అన్నారు ట్రాన్స్‌షిప్‌మెంట్‌లో ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టును ఇబ్బంది పెట్టడానికి, ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రచారాన్ని నిర్వహించడానికి, సోనియా గాంధీ సెప్టెంబర్ 5న ఒక ప్రముఖ ఆంగ్ల వార్తాపత్రికలో పూర్తి అబద్ధాలతో వాస్తవాలను వక్రీకరిస్తూ ఒక వ్యాసాన్ని కూడా రాశారన్నారు. కానీ, సోనియాగాంధీ చేసిన ఆరోపణలన్నీ అబద్ధాలని తేల్చుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) ఇటీవల గ్రేట్ నికోబార్ ఐలాండ్ ప్రాజెక్ట్‌కు పచ్చజెండా ఊపిందన్నారు.

ఇది భారత ప్రభుత్వపు వ్యూహాత్మక ప్రాజెక్ట్ అని పేర్కొంటూ 2022లో మంజూరు చేసిన పర్యావరణ అనుమతులలో జోక్యం చేసుకోవడానికి ఎటువంటి కారణాలు కనిపించడం లేదని స్పష్టంగా పేర్కొంది. భారతదేశాన్ని, దేశ పురోగతిని వ్యతిరేకించే వారి కుట్రలు కుతంత్రాలు నెరవేరవని, వీరి దుష్టబుద్ధి ప్రజలకు అర్థమైందన్నారు.



## బిజెపి కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం ప్రారంభం

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమం హైదరాబాదులో తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ కర్ణాటక రాష్ట్రాల బిజెపి నాయకులు పాల్గొనే ఈ కార్యక్రమంలో భాగంగా జ్యోతి ప్రజలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థగత) బిఎల్ సంతోష్‌జి, జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ అభయ్ పాటిల్, జాతీయ సహ ప్రధాన కార్యదర్శి (సంస్థగత) శివ ప్రకాష్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, దక్షిణాది రాష్ట్రాల మహా ప్రశిక్షణ అభియాన్ ఇంచార్జ్ డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థ గత) చంద్రశేఖర్ జి తదితరులు పాల్గొన్నారు.

## అట్రాసిటీ బాధితులకు ఇళ్ల పంపిణీ

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నేరాలపై మంత్రి అడ్లూరి సమీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** అన్యాయానికి గురైన దళిత, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలుచేస్తూ బాసటగా నిలుస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం చేకూరేలా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చొరవ తీసుకోవాలని సూచించారు. దురదృష్టవశాత్తు కొన్ని ఘటనలు జరిగినప్పుడు బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని స్పష్టం చేశారు.ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ బాధితులకు ఇళ్ల పంపిణీ కార్యక్రమం బుధవారం మల్కాజ్‌గిరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి లక్ష్మణ్ మాట్లాడుతూ.. కేవలం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పంపిణీ చేయడమే కాకుండా సంక్షేమశాఖ ద్వారా బాధితులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రుణాలతోపాటు జీవనోపాధి కల్పించే విధంగా జిల్లా కలెక్టర్లు చొరవ తీసుకోవాలని ఆదేశించారు.

## కెటిఆర్ ఎన్ని ప్రగల్భాలు పలికినా ప్రజలు నమ్మరు

### మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మాజీ మంత్రి కెటిఆర్‌ను ప్రతిపక్ష నాయకుడిగా ప్రజలు అనుకోవడం లేదని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కెసిఆర్ స్థానానికి కెటిఆర్ సరిపోడు అన్నారు. కెసిఆర్, కెటిఆర్‌ను గ్రామీణ ప్రజలు ఆదరించలేదని, అర్బన్ ఓటర్లు ఆదరించలేదన్నారు. మీరు కలలు కంటున్న అధికారం ఎప్పటికి రాదని, ఇప్పటికైన కెసిఆర్ పామ్ హౌస్‌ను వీడి బయటకు వచ్చి ప్రతిపక్ష పాత్ర పోషించాలన్నారు. అప్పుడే అధికారంలోకి వస్తారు అన్నారు. రేవంత్ రెడ్డి ప్రజా సమస్యలపై పోరాటం చేసిండు కాబట్టి ముఖ్యమంత్రి అయ్యాడని, మీటింగ్‌లో తిట్టి, సోషల్ మీడియాలో పోకస్ అయితే అధికారం లోకి రారు అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడానికి రేవంత్ రెడ్డి పరిపాలన విధానం, రైతులను మహిళలను మెప్పిస్తున్నారు, రాహుల్ గాంధీ డైరెక్షన్‌లో సిఎం రేవంత్ రెడ్డి సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తున్నారన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి దూరదృష్టి.. డిప్యూటీసిఎం భట్టి ఆర్థిక భరోసా

### టిజిఎస్‌డబ్ల్యుఆర్‌కు రూ.184.17 కోట్ల నిధులు విడుదల: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పేద, దళిత, గిరిజన, వెనుకబడినవర్గాల విద్యాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. టీజీఎస్‌డబ్ల్యుఆర్ సంస్థల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.184.17 కోట్ల నిధులు విడుదల చేయడం తెలంగాణ రాష్ట్ర సంక్షేమ చరిత్రలో కీలకమైన నిర్ణయమన్నారు. ఈ నిధులు వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో మార్పుకు నాంది పలుకుతాయని స్పష్టం చేశారు.

పేద కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందితేనే నిజమైన సామాజిక మార్పు సాధ్యమని నమ్మి సీఎం రేవంత్‌రెడ్డి విద్యను ప్రభుత్వ ప్రధాన అజెండాగా మార్చారని అన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో కూడాప్రైవేట్ స్కూళ్ల స్థాయిలో సదుపాయాలు కల్పించాలనే దూరదృష్టితో సీఎం తీసుకుంటున్న నిర్ణయాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు.

సంక్షేమ శాఖకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అండగా నిలుస్తూ అడిగిన వెంటనే నిధులు విడుదల చేయడంలో చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ సంక్షేమరంగాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క పూర్తి సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.


తాజాగా విడుదలైనరూ.184.17 కోట్ల నిధులతో విద్యార్థులకు రోజువారీ నాణ్యమైన భోజనంతో పాటు శుభ్రమైన వసతిగదులు,మెరుగైన పారిశుధ్య వ్యవస్థ, హాస్టల్ భవనాల అద్దె చెల్లింపులు చేస్తామని, ఇకపై హాస్టళ్ల నిర్వహణ అంతరాయం లేకుండా కొనసాగుతుందని వివరించారు. టీజీఎస్‌డబ్లూఆర్‌ఈఐఎస్ సంస్థల నిర్వహణలో ఉన్న సిబ్బంది లోటును కూడా ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని మంత్రి చెప్పారు. 625 మంది సిబ్బందిని పార్ట్‌టైమ్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించేందుకు అనుమతి ఇవ్వడం ద్వారా హాస్టళ్లలో బోధనేతర సిబ్బంది కొరత తొలగించామని తెలిపారు. విద్య ద్వారా పేదరికాన్ని నిర్మూలించాలనే ప్రభుత్వ సంకల్పానికి ఇది స్పష్టమైన నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 11 ఉమ్మడి జిల్లా కేంద్రాలలో స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేసే అంశంపై దృష్టి పెట్టాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఈ సందర్భంగా మంత్రి కోరారు. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మాదిరిగా కోచింగ్ సెంటర్లు ఉండాలన్నారు. స్టడీ సర్కిల్ ఏర్పాటు అయితే గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు ఐఏఎస్, ఐపీఎస్ కోచింగ్ లకు అవకాశం ఉంటుందన్నారు.

## నెదర్లాండ్స్‌పై టీమిండియా సూపర్ విక్టరీ

### 17 పరుగుల తేడాతో నెదర్లాండ్స్ ఓటమి

### మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా శివమ్ దూబే

**అహ్మదాబాద్, ఫిబ్రవరి 18:** టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఫిబ్రవరి 18న జరిగిన కీలక లీగ్ మ్యాచ్‌లో భారత్ జట్టు మరోసారి తన సత్తానుచూపించింది. నెదర్లాండ్స్‌పై 17 పరుగుల తేడాతో విజయం సాధించిన టీమిండియా, గ్రూప్ దశను అగ్రస్థానంలో ముగించింది. అజేయంగా నాకౌట్ దశకు చేరింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మూడు విభాగాల్లోనూ సమిష్టి ప్రదర్శన కనబర్చిన భారత్ అభిమానులకు పూర్తి సంతృప్తి ఇచ్చింది. టాస్ గెలిచిన భారత్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. ప్రారంభ ఓవర్లలో ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ జాగ్రత్తగా ఆడుతూ మంచి బేస్ వేశారు. మధ్య ఓవర్లలో తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ రన్‌రేట్ నిలబెట్టారు. అయితే మ్యాచ్‌ను పూర్తిగా మలుపుతిప్పింది శివమ్ దూబే దూకుడైన ఇన్నింగ్స్. భారత్‌నెదర్లాండ్స్ మ్యాచ్‌లో శివమ్ దూబే 31 బంతుల్లో 66 పరుగులు చేసాడు. దూబే నాలుగు ఫోర్లు, ఆరు భారీ సిక్సర్లు బాది నెదర్లాండ్స్ బౌలర్లను గందరగోళానికి గురి చేశాడు. అతని బ్యాటింగ్‌తో స్కోరు వేగంగా పెరిగింది. చివరి దశలో హార్దిక్ పాండ్యా 21 బంతుల్లో 30 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు బలాన్నిచ్చాడు. మూడు సిక్సర్లు బాది డెత్ ఓవర్లలో వేగం పెంచాడు. రింకూ సింగ్ చివరి ఓవర్‌లో సిక్సర్ బాది అజేయంగా నిలిచాడు. నిర్ణీత 20 ఓవర్లలో భారత్ 6 వికెట్ల నష్టానికి 193 పరుగులు నమోదు చేసింది. 194 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నెదర్లాండ్స్ జట్టు ధైర్యంగా ఆరంభించింది. మైఖేల్ లెవిట్ 24 పరుగులు చేసి మంచి స్టార్ట్ ఇచ్చాడు. బాస్ డి లీడ్ 33 పరుగులతో



జట్టులో అత్యధిక స్కోరు నమోదు చేశాడు. జాచ్ లయన్‌కాచెట్ 26 పరుగులు, కోలిన్ అకెర్మాన్ 23 పరుగులు చేసి మ్యాచ్‌ను పోటీగా మార్చే ప్రయత్నం చేశారు. మధ్య ఓవర్లలో వరుస వికెట్లు కోల్పోవడం నెదర్లాండ్స్‌కు భారీ దెబ్బైంది. అవసరమైన రన్‌రేట్ పెరగడంతో ఒత్తిడి పెరిగింది. చివరికి 20 ఓవర్లలో 176 పరుగుల వద్ద ఇన్నింగ్స్ ముగిసింది. లక్ష్యానికి 17 పరుగుల దూరంలోనే ఆగిపోయింది. భారత్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి మూడు కీలక వికెట్లు తీసి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు.

మధ్య ఓవర్లలో అతని స్పిన్ దాడి నెదర్లాండ్స్ బ్యాటర్లకు కష్టాలు కలిగించింది. శివమ్ దూబే రెండు వికెట్లు తీసి ఆల్‌రౌండ్ ప్రతిభ చూపించాడు. జస్ప్రీత్ బుమ్రా తన అనుభవంతో కీలక ఓవర్లు బిగించాడు. హార్దిక్ పాండ్యా తలో వికెట్ సాధించి బౌలింగ్ విభాగానికి తోడ్పడ్డాడు. ఫీల్డింగ్‌లోనూ టీమిండియా చురుకుదనం ప్రదర్శించింది. ఈ విజయంతో భారత్ గ్రూప్ దశను అగ్రస్థానంలో ముగించింది. తదుపరి సూపర్ 8 దశలో ఫిబ్రవరి 22న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో కీలక పోరుకు సిద్ధమవుతోంది. ఈ మ్యాచ్ టోర్నీలో కీలకంగా మారే అవకాశాలు ఉండటంతో అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. కాగా ఈమ్యాచ్‌లో మాన్ ఆఫ్‌దిమ్యాచ్‌గా శివమ్ దూబే ఎంపికయ్యాడు. 31 బంతుల్లో 66 పరుగులుచేయడంతోపాటు 35 పరుగులిచ్చి రెండు వికెట్లు కూడా తీసాడు.

## హౌసింగ్ బోర్డు ఓపెన్ ప్లాట్ల విక్రయానికి మంచి స్పందన

### బోర్డు వైస్ ఛైర్మన్ విపి గౌతం

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** రాజేంద్రనగర్ మండలంలోని లక్ష్మిగూడలోని హౌసింగ్ బోర్డు ఓపెన్ ప్లాట్ల విక్రయానికి మంచి స్పందన లభించింది. ఇక్కడి 14 ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించడానికి హౌసింగ్ బోర్డు ఈ నెల 2 వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేశారు. కాగా బుధవారం నాడు నిర్వహించిన వేలం పాటలో 49 మంది కొనుగోలుదారులు పాల్గొనగా ప్లాట్లన్నీ హాట్ కేకుల్లా అమ్ముడు పోయాయి. ఈ భూముల చదరపు గజానికి రూ. 32 వేలను అప్ సెట్ ప్రైజ్ గా (కనీస ధరగా) నిర్ధారించగా, వేలం పాటలో గరిష్టంగా చదరపు గజం రూ.51 వేలకు కొనుగోలు చేశారని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ విపి గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 14 ప్లాట్ల విక్రయాల ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.14.75 కోట్ల మేర ఆదాయం వచ్చిందని వివరించారు.


తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ విద్య & సంక్షేమ మౌళిక సౌకర్యాల అభివృద్ధి కార్పొరేషన్:: హైదరాబాద్
సూపరింటెండింగ్ ఇంజనీర్ వారి కార్యాలయం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
టెండర్ ప్రకటన నం: SE/TGEWIDC/HYD/NIT/1683 to 1693/2025-26 తేదీ: 17.02.2026
పూర్వపు ఆదిలాబాద్ జిల్లాలో (రూ.లు 38.15 to రూ.80.05 లక్షలు) KGBVకు ఆవశ్యక మౌళిక సౌకర్యాల పటిష్టతకు (1 నుండి 11) కొరకు అందరూ అర్హులైన కాంట్రాక్టరుల నుండి టెండర్‌లు కోరబడుతున్నవి. బిడ్ దాఖలు ముగింపు తేదీ మరియు సమయం: 04.03.2026 సా.4.00గం. వరకు ఆన్‌లైన్‌లో బిడ్. పూర్తి వివరాలకు https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. లేదా స్వయంగా సూపరింటెండింగ్ ఇంజనీర్, TGEWIDC, 3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ విద్యా మిషన్ బిల్డింగ్, SCERT కాంపౌండ్, ఇ-సేవ ఎదుట, ఎల్‌బి స్టేడియం, హైదరాబాద్ ఫోన్ నం: 29565991 వారి యొక్క కార్యాలయం వద్ద సంప్రదించవచ్చును.
సం/-, సూపరింటెండింగ్ ఇంజనీర్, TGEWIDC, హైదరాబాద్.
DIPR.NO. 15512-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 18.02.2026



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎపిటిడిసి చైర్మన్ నూకసాని బాలాజీ

## రాష్ట్రంలో టెంపుల్‌టూరిజం అభివృద్ధికి చర్యలు

### ఎపిటిడిసి చైర్మన్ బాలాజీ

**విజయవాడ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** కేంద్రప్రభుత్వ సహాకారంతో రూ.500 కోట్ల ఖర్చుతో రాష్ట్రంలో టెంపుల్ టూరిజంను అభివృద్ధి చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ తెలిపారు. పర్యాటక అభివృద్ధిసంస్థ 50ఏళ్ళు పూర్తిచేసుకున్న సందర్భంగా బుధవారం విజయవాడ బందర్‌రోడ్డులోని పర్యాటకశాఖ డివిజనల్ కార్యాలయం వద్ద బైక్‌ర్యాలీని బాలాజీ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇటీవల జరిగిన సమ్మిట్‌లలో రూ.19వేలకోట్ల మేరకు వివిధ సంస్థలతో అవగాహనా ఒప్పందాలు చేసుకున్నామన్నారు. 32హోటళ్ళు, రిసార్టులు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పిపిపి పద్ధతిలో నడుస్తున్నాయన్నారు.

## పర్యాటక రంగానికి విస్తృత ప్రచారం కల్పించండి

- పర్యాటక శాఖ మార్కెటింగ్ కమిటీ భేటీలో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి
- 30 అంశాలతో కూడిన అజెండాపై సుదీర్ఘ చర్చ
- రాబోయే ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించాలని నిర్ణయం..



**విజయవాడ,ఫిబ్రవరి 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక రంగానికి వివిధ రూపాల్లో మరింత ప్రాచుర్యం కల్పించి, పర్యాటకులను పెద్ద ఎత్తున ఆకర్షించాలని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం వెలగపూడి సచివాలయం రెండవ బ్లాక్‌లోని తన ఛాంబర్‌లో మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన 30 అంశాలతో కూడిన అజెండాపై మార్కెటింగ్ కమిటీ రెండో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పర్యాటక శాఖకు కల్పించాల్సిన ప్రచారం, మార్కెటింగ్, ఈవెంట్స్, ఉత్సవాలు, అడ్వర్ టైజ్ మెంట్ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పర్యాటక ఉత్సవాలపై విశ్లేషించారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్ మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అమరావతి ఆవకాయ్ ఫెస్టివల్, విశాఖ ఉత్సవ్, అరకు, అనకాపల్లి, గండికోట, ఫ్లెమింగో ఫెస్టివల్, పిఠాపురం సంక్రాంతి సంబరాలు, కొండవీడు ఫెస్టివల్, ఎస్ యానాం బీచ్ ఫెస్టివల్, కంగుండి బౌల్డరింగ్ ఫెస్టివల్, పాకల బీచ్ ఫెస్టివల్ వంటి కార్యక్రమాల ద్వారా పర్యాటక శాఖకు వచ్చిన గుర్తింపుపై మంత్రి దుర్గేష్ సమీక్షి ంచారు. ఉత్సవాల నిర్వహణలో ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీల పనితీరును అడిగి తెలుసుకున్నారు. తక్కువ బడ్జెట్‌తో ఎక్కువ మందికి చేరేలా సోషల్ మీడియా ప్రచారాలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల విశిష్టతను తెలిపే డిజిటల్ కంటెంట్, వీడియోలను వైరల్ చేయాలని ఆదేశించారు. పర్యాటకులకు లభించే వసతులపై స్పష్టమైన సమాచారం అందించాలన్నారు. సంబంధిత ఉత్సవాలకు కల్పించే ప్రచార ప్రణాళిక, టూరిజం బ్రోచర్స్, కాఫీ టేబుల్ బుక్స్, అందుకు అయ్యే ఖర్చులను అధికారులకు మంత్రి దుర్గేష్ కు వివరించారు. 2026 మార్చిలో జర్మనీలో జరిగే ఖిఐటీబీ బెర్లిన్‌ఖి సదస్సులో ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాభవాన్ని చాటిచెప్పేలా పకడ్బందీగా సిద్ధం కావాలని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. గత ఏడాది బెర్లిన్ సదస్సులో లభించిన అద్భుత స్పందనను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో నిర్వహించబోయే ప్రధాన కార్యక్రమాలపై కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పర్యాటకులు ఆహ్లాదంగా గడిపేలా చూడటంతో పాటు, తద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇకపై ఏ ఉత్సవం జరిగినా ముందస్తుగాఖికర్టెన్ రైజర్స్ఖిద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ఇటీవల జరిగిన ఉత్సవాలను బాగా నిర్వహించినందుకు ఏపీటీఏ అధికారులను మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సమావేశంలో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీఏ సీఈవో ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట, సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ విశ్వనాథన్, ఆర్థిక శాఖ ఎస్ వో లక్ష్మీ ్మ, ఏపీటీఏ మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్ అధికారిణి పద్మారాణి, పర్యాటక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన ఆయుష్ సేవల దిశగా చట్ట సవరణ

- ఆయుష్ క్లినిక్‌లు,ఆస్పత్రుల నిర్వహణపై పర్యవేక్షణ
- పెరుగుతున్న ప్రజాదరణ నేపథ్యంలో సవరణలు సూచించిన మంత్రి సత్యకుమార్

**సచివాలయం,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :** ఆయుష్ సేవల విస్తృతికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఈ సేవల నాణ్యతను పెంచుతూ ప్రజల్లో మరింత విశ్వాసాన్ని కలిగించేందుకు అవసరమైన చట్టసవరణ చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం శ్రీకారం చుట్టింది. ఇబ్బడి ముబ్బడిగా పుట్టుకొస్తున్న ఆయుష్ క్లినిక్‌లు,ఆస్పత్రులు తగు ప్రమాణాలతో కూడిన సేవల్ని అందించేందుకు శాసనసభలో వైద్యారోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రతిపాదించిన చట్టసవరణ బిల్లును శాసనసభ అమోదించింది. రాష్ట్రంలో ప్రస్తుతం అల్లోపతి వైద్యం అందిస్తున్న ఆస్పత్రులపైనే ప్రభుత్వ నియంత్రణకు అవకాశముంది. ఆయుష్ క్లినిక్‌లు,ఆస్పత్రులు నియంత్రణ పరిధిలో లేవు. దరిమిలా ఆయుష్ సేవల్ని అందిస్తామంటూ పెద్దఎత్తున క్లినిక్‌లు,ఆస్పత్రులు ఏర్పాటవుతున్నాయి. ఇవి తగు ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి ఎటువంటి అధికారం లేదు. ఈనేపథ్యంలో ప్రస్తుతం అమల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2002చట్టానికి సవరణను మంత్రి ప్రతిపాదించారు. ఈ చట్టం ప్రకారం ప్రస్తుతం కేవలం అల్లోపతిక్ ఆస్పత్రుల నిర్వహణను మాత్రమే అజమాయిషీ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి కుంది. ఆయుష్ ఆస్పత్రుల నిర్వహణలో కూడా తగు ప్రమాణాలు అనుసరించే లక్ష్యంతో ఈ చట్టం పరిధిలోనికి ఆయుష్ ఆస్పత్రుల్ని చేర్చాల్సిన అవసరముందని మంత్రి సభకు తెలిపారు. అయుష్ సేవలకు సంబందించిన 1956చట్టం ప్రకారం అర్హులైన వారు మాత్రమే ఆయుష్ సేవల్ని అందించేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆస్పత్రులకు సంబంధించి అటువంటి నియమ నిబందనలు లేనందున అనర్హులైన వారు ఆయుష్ సేవల పేరుతో క్లినిక్‌లు,ఆస్పత్రులను పెద్దఎత్తున నిర్వహించడం ఆందోళనకు దారితీసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 2002చట్టాన్ని సవరించి ఆయుష్ ఆస్పత్రులు కూడా తగు ప్రమాణాలు పాటిస్తూ నిర్వహించే దిశగా ముందడుగు వేసింది. ఈ చట్ట సవరణ బిల్లును ఉభయసభలూ ఆమోదించిన తర్వాత నిర్వహణ నియంత్రణకు సంబంధించిన బోర్డులు,అపిలేట్ బోర్డుల్లో ఆయుష్ వైద్యులకు తగు ప్రాతినిధ్యం కల్పిస్తారు. చట్ట సవరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆయుష్ సేవల నిర్వహణ ప్రమాణాలు పెరుగుతాయని,పారదర్శకత వస్తుందని,నిర్ణీత అర్హతలతో సేవలందించే వారికి తగు రక్షణ లభిస్తుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

## ఆసుపత్రుల అభివృద్ధిపై ప్రభుత్వం పూర్తి స్థాయి కార్యాచరణ : మంత్రి సత్యకుమార్ యాదవ్

### అసెంబ్లీలో సభ్యుల ప్రశ్నలకు బదులిచ్చిన మంత్రి

**విజయవాడ,ఫిబ్రవరి 18,ప్రభాత వార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. బుధవారం ప్రశ్నోత్తరాలతో సభ కార్యకలాపాలను స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు .ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభానికి ముందు అసెంబ్లీలో ఆడియో వ్యవస్థలో సాంకేతిక లోపం ఉంద న్నారు. ఈ నేపథ్యంలో అందుకు ప్రత్యామ్నాయ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఆడియో వ్యవస్థను బాగు చేసేందుకు సాంకేతిక నిపుణులు ముంబై నుంచి వస్తున్నట్లు స్పీకర్ వెల్లడించారు. ప్రభుత్వా సుపత్రుల సామర్థం పెంపుపై పలువురు సభ్యులు ప్రశ్నలు వేశారు. అందుకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ జవాబు ఇచ్చారు. ఆళ్ల గడ్డ, వాయల్పాడు, పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు, నెల్లూరు జిల్లా కోవూరులలో 50 పడకల ఆసుపత్రిలను 100 పడకల ఆసుపత్రిగా మార్చాలంటూ ప్రభుత్వానికి టీడీపీ ఎమ్మెల్యే అఖిల ప్రియ విజ్ఞప్తి చేశారు. ఆళ్లగడ్డలో 50 పడకలు ఆసుపత్రిని కూటమి ఏర్పాటు చేసిందని.. దీనిని 100 పడకల ఆసుపత్రిగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. అయితే మాజీ ఎమ్మెల్యే, తన తల్లి శోభానాగిరెడ్డి యాక్సిడెంట్ జరిగిన తర్వాత.. ఆళ్లగడ్డ అనంతరం నంద్యాల.. అక్కడి నుంచి హైదరాబాద్‌కి షిఫ్ట్ చేసినప్పుడు గోల్డన్ అవర్ కోల్పోవడం వల్లే ఆమె చనిపోయారని ఈ సందర్భంగా అఖిల ప్రియ గుర్తు చేసుకున్నారు. తన తండ్రి విషయంలోనూ అలాగే జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ ప్రమాదాల కారణంగా తమ ప్రాంతంలో లో చాలా మంది చనిపోతున్నారన్నారు. ఆళ్లగడ్డలో వైద్యులు లేరన్నారు. ఎక్సపర్ట్‌లు కూడా లేరని చెప్పారు. అందువల్ల నంద్యాల, కర్నూలుకు రిఫరల్ చేసిన కేసులు వేలలో ఉన్నాయని ఆమె వివరించారు. ఆళ్లగడ్డలో కనీసం ట్రామా సెంటర్ సైతం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే అఖిల ప్రియ కోరారు. దీనిపై మంత్రి సత్యకుమార్ స్పందించారు. ప్రభుత్వ ఆసుపత్రులో 50 నుంచి 100 పడకల సామర్థ్యానికి పెంచాలంటూ తమకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. అయితే ట్రామా సెంటర్లు విషయంలో ప్రతి 100 కిలోమీటర్లుకు ఒకటి ఏర్పాటు చేయాలంటూ ఇప్పటికే కేంద్రం ప్రకటన చేసిందని వివరించారు. ఇంతలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు జోక్యం చేసుకున్నారు.

## నగరాలు, పట్టణాల్లో ఖాళీ భూముల పన్ను తగ్గిస్తూ చట్టంలో సవరణలు

- బిల్లును ఆమోదించిన శాసనసభ



మంత్రి నారాయణ

**విజయవాడ,ఫిబ్రవరి 18,ప్రభాతవార్తప్రతినిధి:** నగరాలు, పట్టణాల్లో ఖాళీ భూముల పన్ను తగ్గిస్తూ పురపాలక చట్టంలో సవరణలు చేసే బిల్లును అసెంబ్లీలో ఆమోదించారు. సవరణ బిల్లును మంత్రి నారాయణ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. నారెడ్కో, క్రెడాయ్ వంటి సంస్థల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు భవన నిర్మాణ సమయంలో 50 శాతం మాత్రమే ఖాళీ స్థలం పన్ను చెల్లించేలా చట్ట సవరణ బిల్లు ప్రవేశపెట్టారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను ప్రోత్సహించేలా చట్టంలో సవరణలు చేశామన్నారు. దీని ప్రకారం భవన నిర్మాణానికి అనుమతి ఇచ్చినప్పటి నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసే వరకూ కేవలం 50 శాతం పన్ను చెల్లించేలా మార్పులు చేశామని వివరించారు. ఈ సవరణ బిల్లుని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ స్వాగతించారు. రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ బిల్లు వల్ల నగరాలు, పట్టణాల్లో అభివృద్ధి వేగవంతం అవుతుందని తెలిపారు. అనంతరం సవరణ బిల్లును శాసనసభ ఆమోదించింది. 22ఎ విషయంలో రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్లు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం రామన్నపాలెం భూ వివాదంపై ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రశ్నకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమాధానం ఇచ్చారు. 22ఏకు సంబంధించి జీవోను అమలు చేయడం ద్వారా భూ సమస్యలు పరిష్కరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో గిట్టని వారి భూములను 22తిలో పెట్టారని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆరోపించారు. 22ఏ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉంది కాబట్టి మంత్రి దీనిపై దృష్టి సారించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు మంత్రికి సూచించారు.

## ఉభయ గోదావరి జిల్లాల్లో డ్రైనేజ్ సమస్యలు పరిష్కరిస్తాం

- మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ,ఫిబ్రవరి 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో రాజోలు ఎమ్మెల్యే దేవా వరప్రసాద్ రాజోలు నియోజకవర్గంలో తీవ్రంగా నెలకొన్న డ్రైనేజ్ సమస్యలపై ప్రశ్నించారు. డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల గత మరియు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సుమారు 6000 ఎకరాల్లో పంటలు మునిగిపోయి రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని ఆయన వెల్లడించారు. ప్రభావిత రైతులకు తక్షణ నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, సముద్ర మట్టం పెరుగుదల, భూమి కుంగిపోవడం మరియు డ్రైనేజ్ నీటిలో ఉప్పు శాతం పెరగడం వంటి కారణాల వల్ల సుమారు లక్ష ఎకరాలకు పైగా కొబ్బరి తోటలు దెబ్బతిన్నాయని, వేలాది కొబ్బరి చెట్లు ఎండిపోయి పాడైపోయాయని పేర్కొన్నారు. టెక్నికల్ కమిటీ నివేదికల ఆధారంగా ఈ సమస్యను ప్రకృతి విపత్తుగా గుర్తించి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. లైడార్ సర్వే కూడా జరుగుతోందని తెలిపారు. దీనికి సమాధానంగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ , ఉభయ గోదావరి జిల్లాల్లో డ్రైనేజ్ సమస్య తీవ్రంగా ఉందని అంగీకరించారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లుగా డ్రైనేజ్ అభివృద్ధికి ఒక్క పైసా కూడా నిధులు కేటాయించకపోవడం వల్ల పరిస్థితి మరింత విషమించిందని పేర్కొన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రాజెక్ట్ రూపంలో తీసుకుని సర్వే చేయడానికి రూ.17 కోట్లు విడుదల చేశామని, సర్వే పూర్తి చేసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి బ్యాంకుల సహాకారంతో సమగ్ర చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కొబ్బరి తోటల నష్టంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, నిపుణుల బృందంతో పరిశీలించినట్లు మంత్రి తెలిపారు. రైతులకు తగిన న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. మల్కీపురం, మామిడికుదురు మండలాల పరిధిలోని కేసనపల్లి, శంకరగుప్తం తదితర గ్రామాల్లో పెద్దఎత్తున కొబ్బరి చెట్లు ఎండిపోయినట్లు నివేదికలు అందాయని పేర్కొన్నారు. దాదాపు ఒక లక్ష కొబ్బరి చెట్లు పాడైపోయిన నేపథ్యంలో, ప్రతి చెట్టుకు రూ.1,000 చొప్పున మొత్తం రూ.10 కోట్లు ఆర్థిక సహాయం అందించేందుకు ఉద్యానవన శాఖ ప్రతిపాదనలు సమర్పించిందని తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలు ఆర్థిక శాఖ ఆమోదం కోసం పంపినట్లు వెల్లడించారు. దీర్ఘకాలిక పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం"శంకరగుప్తం మేజర్ డ్రైన్ ఆధునీకరణ" పనులకు రూ.20.77 కోట్లు మంజూరు చేసిందని, ఉప ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

## మహాశివరాత్రి ముగింపు ఉత్సవాలు



**జలుమూరు (శ్రీకాకుళం జిల్లా), ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** దక్షిణ కాశీగా పేరు గాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగేశ్వర స్వామికి చక్ర తీర్థ స్నానాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మహాశివరాత్రి ఉత్సవాలు ముగింపు రోజున ఎల్.ఎన్.పేట మండలం మిరియాపల్లి వద్ద వంశధార నదిలో శ్రీముఖలింగేశ్వరుడికి చక్ర తీర్థ స్నానాలు వైభవంగా నిర్వహించారు. జిల్లాతో పాటు విశాఖపట్నం, విజయనగరం, ఒరిస్సా, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. బుధవారం 11:45 నిమిషాలకు పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను దక్షిణ ద్వారం నుంచి అత్యధిక సంఘం అధ్యక్షులు ఎస్‌విచలం, జనార్ధనరావు ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు నడుమ బయటకు తీసుకువచ్చారు. ముందుగా మొదటిసారిగా కొబ్బరికాయను ఆర్డీవో సాయి ప్రత్యూష కొట్టిన అనంతరం హారతులు ఇచ్చారు. అనంతరం నంది వాహనంపై ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నంది వాహనంపై స్వామివారి ఊరేగింపు ప్రారంభించారు. పార్వతీ పరమేశ్వరులు మిరియా పల్లి రేవుకు చేరుకోగా వేదమంత్రాల నడుమ ఉత్సవమూర్తులకు చక్ర తీర్థ స్నానాలు చేయించారు. ఆనవాయితీ ప్రకారం మిరియాపల్లిలో లుకులాపు వంశానికి చెందిన నాయుడు కుటుంబ సభ్యులు శ్రీముఖలింగేశ్వరుడి ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం మళ్లీ ఊరేగింపుగా స్వామి వారిని శ్రీముఖలింగంలోని గర్భగుడికి తీసుకువెళ్లి పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి వెబ్ కాస్టింగ్ ద్వారా చక్ర తీర్థ స్నాన ఘట్టాన్ని పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సమగ్ర భద్రతతో ఏర్పాటు చేశారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేయడం వల్ల ఈ కార్యక్రమం సక్సెస్ అయిందని అన్నారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎస్పీ మహేశ్వర్ రెడ్డి నిరంతర పర్యవేక్షణ చేశారు. ఉత్సవ విగ్రహాల రాకపోకలు, భక్తులు రద్దీ, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. బందోబస్తు విధుల్లో ఉన్న అధికారులకు ఎప్పటికప్పుడు అప్రమత్తతపై దిశ నిర్దేశాలు చేరవేసేవారు. సీసీ కెమెరాలు, డ్రోన్ పర్యవేక్షణ, బారికేడ్లతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ శివప్రసాద్ పాడి, ఈవో టి.ఏడుకొండలు, స్థానిక సర్పంచ్ తమన్నగారి సతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, డీఎస్పీ లక్ష్మణరావు, 1400 పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. సీఐ శ్రీనివాసరావు, ఎమ్మార్వో జే.రామారావు, ఎంపీడీవో బి.చిన్నమ్మడు, ఈవోపీఆర్డి ఉమామహేశ్వరరావు, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ తాడేల శ్రీకాంత్, జలుమూరు, అచ్యుతాపురం, సైరిగాం వైద్యాధికారులు గొలివి సుజాత, పూజారి సుజాత, పొన్నాన గురునాథరావు ఆరు టీములుగా ఏర్పడి తమ వైద్య సేవలను నిర్వహించారు. స్థానిక ఎస్సై అశోక్ బాబు, కాశీబుగ్గ ఎస్సై పాడినాయుడు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## మదనపల్లి చిన్నారి హత్య కేసులో నిందితుడు ఆత్మహత్య

### కనసానివారిపల్లి చెరువులో లభ్యమైన మృతదేహం

**మదనపల్లి క్రైమ్ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** మదనపల్లె పట్టణంలో కలకలం సృష్టించిన ఏడేళ్ల చిన్నారి రిషిక ప్రియ హత్యాచారం కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. పోలీసుల అదుపులో నుండి తప్పించుకున్న ప్రధాన నిందితుడు కులవర్ధన్, బుధవారం ఉదయం కురబలకోట మండలం కనసానివారిపల్లి చెరువులో శవమై తేలాడు. మదనపల్లి నీరుగట్టువారిపల్లిలో నివాసముంటున్న గోపినాథ్, స్వర్ణలత దంపతుల కుమార్తె రిషిక ప్రియ సోమవారం అదృశ్యమై, హత్యాచారం కు గురైన విషయం తెలిసింది. చిన్నారి ఇంటి ఎదురుగానే ఉన్న కులవర్ధన్ పాపపై అత్యాచారం చేసి, ఆపై గొంతు నులిమి హత్య చేసి మృతదేహాన్ని డ్రమ్ములో దాచిపెట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. మంగళవారం నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సమయంలో స్థానికులు పెద్ద ఎత్తున ఆగ్రహంతో పోలీసు వాహనంపైకి దూసుకొచ్చారు. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో పోలీసులు నిందితుడిని అక్కడి నుండి తరలించే ప్రయత్నం చేశారు. ఆ గందరగోళంలో కులవర్ధన్ పోలీసుల నుండి తప్పించుకుని పరారయ్యాడు. నిందితుడి కోసం ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు రెండు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. బుధవారం ఉదయం కనసానివారిపల్లి చెరువులో ఒక వ్యక్తి మృతదేహం తేలుతున్నట్లు స్థానికులు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు, కులవర్ధన్ కుటుంబ సభ్యులను పిలిపించి మృతదేహాన్ని చూపించగా, అది కులవర్ధన్‌దేనని వారు నిర్ధారించారు. మృత దేహాన్ని శవ పరీక్షల నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. చిన్నారి హత్య కేసుకు సంబంధించి మదనపల్లి పట్టణంలో మంగళవారం భారీ ధర్నా, ర్యాలీలు కొనసాగాయి.

## రాయలసీమ ప్రాజెక్టుల నిర్లక్ష్యంపై ఉద్యమిస్తాం

- వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ నేతలు

**అనంతపురం, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త బ్యూరో :** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై చేస్తున్న నిర్లక్ష్య వైఖరిపై వైసిపి ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. అనంతపురం జిల్లా వైసిపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, సమన్వయ కర్తలు శైలజానాథ్, విశ్వేశ్వర్‌రెడ్డి, తలారి రంగయ్య, వై.వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మెట్టు గోవిందరెడ్డి కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఎప్పుడు అధికారంలో ఉన్నా రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోరని చంద్రబాబు హయాంలోనే ప్రాజెక్టులు నిర్వీర్యం అవుతాయని విమర్శించారు. గతంలో చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడు ఆల్‌మట్టి డ్యాం ఎత్తును పెంచారని, మరోమారు ప్రస్తుతం పెంచుతున్నారని అయినప్పటికీ చంద్రబాబునాయుడు పట్టించు కోకపోవడం లేదని విమర్శించారు. అదే విధంగా నేడు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను గత వైసిపి హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుడితే అధికారంలోకి రాగానే చంద్రబాబునాయుడు ఆ ప్రాజెక్టును పక్కన పెట్టారన్నారు. ఎస్‌జిటి అనుమతి లేకపోవడంతోనే ప్రాజెక్టు పనులు ఆపారని అంతా అనుకున్నారని, కానీ తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ ప్రయోజనాల కోసం చంద్రబాబుతో మాట్లాడి పనులు ఆపేయించారని చెప్పారన్నారు.

## మార్చి 26 నుంచి ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు

- ఏప్రిల్ 1న సీతారాముల కల్యాణం - పట్టు వస్త్రాలు సమర్పించనున్న చంద్రబాబు - టిటిడి జెఇఒ వి.వీరబ్రహ్మాం

**రాజంపేట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** ఆంధ్ర అయోధ్య ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో మార్చి 27 నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 1న జరుగనున్న శ్రీ సీతారాముల కల్యాణం జరగనుంది. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను వేగవంతం చేయాలని టిటిడి జెఈవో వి. వీరబ్రహ్మాం అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు చేపట్టిన బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పనులు, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులను పరిశీలించి, అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెఈవో అధికారులతో కలిసి కోదండ రామస్వామి వారి ఆలయం ముందు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వంటశాల, ముడి సరుకులు నిల్వ ఉంచే షెడ్లను పరిశీలించి, సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా భక్తులకు అన్నప్రదాలు పంపిణీ చేసేందుకు వీలుగా టేబులు, కుర్చీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయంలోను, యాగశాలలో మరమత్తు పనులు త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. టిటిడి స్థానిక ఆలయాల్లో ఏ విధంగా అయితే శ్రీవారి సేవకుల సేవలు వినియోగించుకుంటున్నారో అదేవిధంగా ఒంటిమిట్ట కోదండరామస్వామివారి ఆలయంలో వినియోగించుకోవాలని సూచించారు. ఆలయ ప్రాంగణం సమీపంలో ఫోటో ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాల వేదికను పరిశీలించారు. అనంతరం కళ్యాణ వేదిక వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. భక్తులకు తలంబ్రాలు, అన్నప్రసాదాలు అందించే 17 కౌంటర్లు, ప్రవేశ, నిష్క్రమణ గేట్లను పరిశీలించారు. కల్యాణ వేదిక ప్రాంగణంలోని వసతి సముదాయం వద్ద ఉన్న జల ప్రసాదమును వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కల్యాణ వేదికకు నలువైపులా పచ్చదనానికి ప్రాముఖ్యత ఇచ్చేలా తీర్చిదిద్దాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఆలయం నుండి కల్యాణ వేదిక వరకు రోడ్డు ఇరువైపుల మొక్కలు పెంచాలని సూచించారు. కళ్యాణ వేదిక వద్ద విఐపిలు బస చేసేందుకు అవసరమైన ఏర్పాట్లను ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయాలన్నారు.




బ్రహ్మోత్సవాల ఏర్పాటలు పరిశీలిస్తున్న టిటిడి జెఇఒ వి.వీరబ్రహ్మాం



ఒంటిమిట్ట కోదండ రామాలయం ఏరియల్ వ్యూ

కల్యాణ వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసే తాత్కాలిక వంటశాల స్థలాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. సౌకర్యవంతంగా క్యూలైన్లు, వసతి షెల్టర్లు, సూచిక బోర్డులు, తాగునీటి సౌకర్యం, తదితర ఇంజనీరింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. రథం తిరిగే వీధులను, ముఖ్యంగా మాడ వీధుల్లో మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భక్తులను ఆకట్టుకునేలా కటౌట్లు, విద్యుత్ దీపాలంకరణలు, పుష్ప లంకరణలు ఏర్పాటు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలకు ముందు 10 రోజుల పాటు ప్రచార రథాల ద్వారా పరిసర గ్రామాల్లో ప్రచారం చేయాలని, బ్రహ్మోత్సవాల కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు.

## కొండపల్లి కళాకారుల అభివృద్ధికి రతన్‌టాటా ఇన్నోవేషన్‌హబ్‌తో అవగాహనా ఒప్పందం




అవగాహనా ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న కలెక్టర్ రతన్‌టాటా ఇన్నోవేషన్‌హబ్ ప్రతినిధులు

**విజయవాడ, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన కొండపల్లి బొమ్మల తయారీ కళాకారుల అభివృద్ధికి రతన్‌టాటా ఇన్నోవేషన్‌హబ్‌తో పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది. ఈమేరకు బుధవారం ఎన్‌టిఆర్ జిల్లాకలెక్టర్ లక్ష్మీశా సమక్షంలో కొండపల్లి కళాకారుల సొసైటీ అధ్యక్షులు ఉదయగిరి సూర్యప్రకాష్ కమిటీ సభ్యులు రిలయన్స్ ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టిఐహెచ్) సీఈఓ జి.కృష్ణన్‌లు యంఓయు పత్రాలను మార్చుకున్నారు. ఈఒప్పంద ద్వారా కొండపల్లి కళాకారుల సమాజ అభివృద్ధి, నిరంతర హోల్డింగ్ సహాయం, నైపుణ్యాల అభివృద్ధి, ఉత్పత్తుల ఆవిష్కరణ, డిజైన్ అభివృద్ధి, బ్రాండింగ్, ప్యాకెజింగ్, మార్కెట్ లింకేజి, నైపుణ్యశిక్షణ, సాంకేతిక మౌలిక వసతుల మద్దతు వంటి అంశాలపై దృష్టిసారించనున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొండపల్లి కళలకు ఆధునికతను జోడిస్తూ సంప్రదాయ వారసత్వాన్ని కాపాడుతూ జాతీయ, అంతర్జాతీయస్థాయిలో కళాకారులను ప్రోత్సహిస్తారని తెలిపారు. ఎంఎస్‌ఎంఈల ప్రోత్సాహానికి ఏపి చాంబర్స్ తో రతన్‌టాటా ఇన్నోవేషన్‌హబ్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది.

# జీలకర్ర నిజమైనదేనా ?



ఒక్కోసారి మార్కెట్లో దొరికే జీలకర్ర చూసి.. అసలు ఇది నిజమైనదేనా? అనే సందేహం కలుగుతుంది. అలాంటప్పుడు, కల్తీ జరిగిందో లేదో ఇలా కని పెట్టేయండి.

- జీలకర్రని చేత్తో నలిపితే విరగకుండా ఉంటే సహజమైనది. అప్పుడు సువాసన కూడా వస్తుంది. అలా రాకపోతే కల్తీ జరిగినట్లే
- . కొద్దిగా నీళ్లలో జీలకర్రను వేసి నానబెడితే రంగు రాకుండా ఉంటే సహజం.
- వేయించినప్పుడు మంచి సువాసన రాకపోతే.. అనుమానించాల్సిందే!

# ఆమె మనసు బంగారం



**ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఒక పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి రూ. లక్ష. తాజాగా సినీ నటుడు రజనీకాంత్ ఆమెను ఇంటికి పిలిచి బంగారు గొలుసుతో సన్మానించారు. ఇంతకీ అంతలా ఆమె ఏం చేశారంటే..** తమకున్న కష్టాలకు... డబ్బు, బంగారం దొరికితే బాగుడని ఆశపడుతుంటారు చాలా మంది. పారిశుద్ధ్య కార్మికురాలు పద్మకి అలానే ఓ నగల మూట దొరికింది. ఆమె అనుభవిస్తున్న పేదరికానికి ఆ నగలను చూడగానే సంబరపడిపోవాలి. కానీ ఆమె అలా చేయలేదు. పోలీస్ స్టేషన్‌లో అప్పగించి నిజాయతీ చాటుకున్నారు. పరుల సొమ్ముకు ఆశపడని ఆమె తీరుకు ప్రశంసలు అందుకుంటున్నారు. ఓ ప్రైవేటు సంస్థ తరపున గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికురాలుగా పనిచేస్తున్న పద్మ. 11న టీనగర్‌లో జనవరి విధుల్లో ఉండగా రోడ్డుపై ఓ బ్యాగుని గమనించారు. తెరిచి చూడగా అందులో బంగారు ఆభరణాలు కనిపించాయి. ఆ బ్యాగును తీసుకెళ్లి, పాండ బజార్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు దర్యాప్తు చేసి ఆ నగల బ్యాగును తిరిగి యజమానికి ఉంచారు. అందులోని నగల విలువ రూ.45 లక్షలు. అయినా నిజాయతీగా బ్యాగును అప్పగించిన పద్మను పోలీసులు అభినందించారు. ఈమె గురించి తెలిసి హీరో రజనీకాంత్ తన నివాసానికి పిలిచి బంగారు గొలుసు బహుకరించారు. భారత తపాలాశాఖ తమిళ నాడు సర్కిల్ 'మై స్టాంప్' పథకం కింద పద్మ ఫొటోతో ప్రత్యేక స్టాంపును విడుదల చేసింది. ఇండియా పంపింగ్స్ బ్యాంకు ప్రీమియం సేవింగ్స్ ఖాతాతోపాటు ఆమెకు రూ.15 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించింది. కోవిడ్ సమయంలో పద్మ భర్త సుబ్రమణి మరీనా బీచ్ సమీపంలో పారిశుద్ధ్య పనులు చేస్తుండగా రూ.1.5 లక్షల నగదు దొరికింది. ఆయన కూడా ఆ డబ్బును పోలీసులకు అప్పగించారు. ఈ దంపతుల నిజాయతీని ప్రశంసించిన వాళ్లు లేరంటే నమ్మండి!

# వ్యథ

# అది స్వభావం కాదు, రుగ్మత ప్రభావం



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**ప్రశ్న** : మా కోడలు గత 10 ఏళ్ళుగా స్కిజోఫ్రెనియాతో బాధ పడుతోంది. సైకియాట్రిస్ట్ ద్వారా మందులు వాడుతున్నది. అయితే రోజంతా బద్దకంగా కూర్చుంటుంది. చెప్పిన పని చేయదు, మాట వినదు. ఆమె వయస్సు 36 ఏళ్ళు, ఆరేళ్ల బాబు ఉన్నాడు. పిల్లవాని మీద కూడా శ్రద్ధ చూపదు. కోపం వచ్చినపుడు వాడిని స్కూలుకు పంపదు. చికిత్సతో పాటు కౌన్సెలింగ్ , వ్యాయామాలు, యోగా, ధ్యానం కూడా మంచిదన్నారు. అయితే ఆమె దేనికి సహకరించడం లేదు. ఆమె స్వభావం మార్చడానికి తగిన మార్గం చెప్పండి- **ఒక సోదరి రాజమండ్రి**



**జవాబు:** అమ్మా మీ కోడలి పరిస్థితి సున్నితమైనది, క్లిష్టమైనది కూడా. 10 ఏళ్లగా స్కిజోఫ్రెనియా వంటి దీర్ఘకాల మానసిక వ్యాధితో బాధపడుతున్న వ్యక్తిలో బద్దకం, పనుల్లో ఆసక్తి లేకపోవడం, బాధ్యతల్ని తప్పించుకోవడం, పిల్లల పై శ్రద్ధ తగ్గడం లాంటి లక్షణాలు సాధారణంగా కనిపిస్తాయి. ఇది అమె స్వభావం వల్ల కాదు, రుగ్మత ప్రభావం వల్ల అని గుర్తుంచుకోవాలి. కొన్ని పద్ధతుల ద్వారా మార్పు తీసుకుని రావచ్చు. కొన్ని మందులు అలసట, నిద్రమత్తు, ఆసక్తి తగ్గడం వంటి సైడ్ ఎఫెక్ట్స్ ఇస్తాయి..సైకియాట్రిస్ట్‌ను కలిసినప్పుడు లక్షణాలు వివరంగా చెప్పండి. డోస్ తగ్గించడం లేదా మందు మార్చడం ద్వారా చాలా మార్పు వస్తుంది.స్కిజోఫ్రెనియా ఉన్నవారిని బలవంతంగా ఏదైనా చేయమంటే ప్రతిఘటన పెరుగుతుంది. కాబట్టి చిన్న చిన్న పనులు మాత్రమే చెప్పండి. ఉదాహరణకు ఐదు నిమిషాలు నడవడం, ఒక కప్పు టీ తయారు చేయడం లాంటివి. అవి చేసినప్పుడు చేసినప్పుడు ప్రశంసించండి. ఇక ఆమెతో పాటు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ చేయిస్తే ఎక్కువ ఫలితం ఉంటుంది. ఆమెకి ఒత్తిడి తగ్గుతుంది, ప్రవర్తన మెరుగవుతుంది. రొటీన్ షెడ్యూల్ తయారు చేయండి ఉదాహరణకు ఉదయం నిద్రలేవడం, టిఫిన్, భోజనం చేయడం,10 నిమిషాల నడక, పిల్లవాడితో 15 నిమిషాలు మాట్లాడడం లాంటివి. షెడ్యూల్ రాసి గోడకు అంటిస్తే మంచిది. పిల్లవాడి బాధ్యత కుటుంబంలో ఒకరు తీసుకోవాలి. పిల్లవాడు అస్థిర వాతావరణంలో పెరగకుండా చూడాలి. ఆమె సహకరించకపోతే "యోగ చేయాలి" అని చెప్పకండి. బదులుగా"మనిద్దరం కలిసి కూర్చొని 5 నిమిషాలు ఊపిరి పీలుద్దాం" అని చెప్పండి. పేరు మార్చితే ప్రతిఘటన తగ్గుతుంది. కోపం వచ్చినప్పుడు వాదన మాని చెప్పేది విని అర్థం చేసుకోండి.. ప్రశాంతంగా తర్వాత మాట్లాడండి. కోప సమయంలో తార్కికంగా మాట్లాడటం అసాధ్యం. స్కిజోఫ్రెనియా పూర్తిగా నయం కాకపోయినా సరైన మందులు , కుటుంబ మద్దతు , కౌన్సెలింగ్ ఉంటే వ్యక్తి సాధారణ జీవితం గడప గలదు. చికిత్స, కౌన్సెలింగ్,ఆదరణ, సహకారం అందిస్తే ఆమెలో మార్పు తప్పక వస్తుంది.

# సాయి కరుణ కిరణం



మానవులు చేయలేని పనిని మహనీయులు చేస్తారు. చేస్తామని చాటింపు వేయించుకోరు. అంతా దైవలీల అంటారు సాయివంటి సద్గురువు. సాయి భక్తులకు సాయి సన్నిధియే పెన్నిది. రవి కాంచనిచోట, కవి గాంచును కదా! అని అంటారు. ఈ యాంత్రిక యుగంలో డాక్టర్లు కూడా నయం చేయలేక చేతులు ఎత్తివేస్తారు. ఆ సమయంలో సాయి తన కరుణ కిరణాన్ని ప్రసరింపచేయవచ్చును. ఒక డాక్టరుకు, అందునా పిల్లల ప్రత్యేక నిపుణుడైన అతనికి వివాహం అయింది. పిల్లవాడు జన్మించాడు. పుట్టిన రెండు నెలల నుండిరాత్రులందు ఏడ్చేవాడు. ఆ డాక్టరు కారణాన్నితెలుసుకోలేక పోయాడు. తోటి డాక్టర్లు కూడా కారణాన్ని తెలుసుకోలేకపోవటమే కాదు, ఆ పసిబాలుని రోదనను (రాత్రులందు) ఆపలేకపోయారు. డాక్టరుగారికి, ఆయన భార్యకు రాత్రులందు నిద్ర కరువైంది. భద్రావతిలో ఉండే ఆయన సోదరుడు షిరిడీ వెళ్లి ఊదిని తాయిత్తులో వేసి పట్టుకు వచ్చాడు. ఆ పసిబిడ్డకు ఆ తాయత్తును కట్టారు. అంతే, ఆబిడ్డడు ఏడుపుమానాడు, రాత్రులందు సుఖంగా నిద్రించసాగాడు. ఇది ఊదీ మహిమ. షిరిడీలోనే మురళీధర్ భికా ఉండేవాడు. ఆయనకు రెండున్నర సంవత్సరములున్న బిడ్డ ఉన్నది. ఒకసారి ఆ బిడ్డ అనారోగ్యం పాలైంది. సాయినాథుని ఆసుపత్రిలో చేర్చారు. పరీక్షలన్నీ చేసారు. వ్యాధిని నిర్ధారించ లేకపోయారు. బిడ్డను ఇంటికి పంపివేసినారు. బిడ్డను ఇంటికి తెచ్చినా వైద్యుడేడి? వైద్యం ఏది? షిరిడీలో ఉన్న ప్రముఖ డాక్టర్ గోండ్కరుకు చూపించారు. సాయిబాబా ఇచ్ఛపైనే ఆ బిడ్డ బ్రతికి బట్ట కట్టేది అని చెప్పాడు ఆ డాక్టరు. అది మే నెల. ఇక వైద్యులకే వైద్యుడైన సాయి సన్నిధి ద్వారా మాయికి వెళ్ళారు. బాబా ఆసీనుడైన బండ వద్ద బిడ్డ నుంచి, ధునికి ఎదురుగా గల సాయి ఫొటోను ప్రార్థించసాగారు. కన్నీటికి దైవం కరుగుతాడో లేదో తెలియదు గాని సాయి కరిగిపోయాడు. వారు సాయిని ప్రార్థించి బిడ్డ వద్దకు వెళ్ళారు. ఆ బిడ్డ అక్కడ లేదు. వారు గాబరాపడ్డారు. చుట్టూ చూడగా అక్కడికి దగ్గరలోనే ఇతర చిన్న పిల్లలతో ఆడుకుంటోంది వారి పసి బిడ్డ. ఆ తల్లిదండ్రుల కృతజ్ఞతాపూర్వక ఆనంద భాష్పాలు సాయినాథుని పాదయుగళిని కడిగివేస్తాయని అనిపించింది చూచు వారులకు !

**- యం.పి.సాయినాథ్**

# బీరకాయ మసాల



**కాకర, దొండ, వంకాయల్లో మసాలా కూరి. కూర చేయడం మనందరికీ తెలుసు. బీరకాయలూ ఇందుకు అనుకూలమే. కావలసినవి :** మూడు బీరకాయలు, కప్పు పల్లీలు, 2 చెంచాల నువ్వులు, పావు కప్పు ఎండు కొబ్బరి తురుము, వెల్లుల్లిపాయ ఒకటి, కారం, ధనియాలపొడి, జీలకర్ర చెంచా చొప్పున, తగినంత ఉప్పు, పసుపు అర చెంచా, కరివేపాకు రెబ్బలు 4, నూనె 3 టేబుల్ స్పూన్లు తీసుకోవాలి. **తయారీ:** బీరకాయలను కడిగి, గీర పోయేలా పీల్ చేయాలి. వాటిని మూడంగుళాల పొడవున ముక్కలు చేసి.. మధ్యలో నిలువుగా కోయాలి. పల్లీలు, నువ్వులను వేరువేరుగా వేయించాలి. అవి చల్లారాక.. ఎండు కొబ్బరి తురుము, వెల్లుల్లిపాయ, కారం, ధనియాలపొడి, జీలకర్ర, ఉప్పు, పసుపు చేర్చి మెత్తగా నూరాలి. ఈ పొడిని బీరకాయ ముక్కల్లో కూరాలి. కడాయిలో నూనె వేడయ్యాక.. ముందుగా కరివేపాకు.. అది వేగాక.. బీరకాయ ముక్కలు వేసి కలియతిప్పాలి. అందులో ఇంకా మిగిలున్న పల్లీల పొడి కూడా జతచేసి మూతపెట్టాలి. మగ్గిన తర్వాత దించేస్తే.. నోరూరించే ఖిబీరకాయ మసాలా కూర సిద్ధం. వేదన్నంలో ఈ కూర వేసుకుని తింటే మజాగా ఉంటుంది.

# ఏకాగ్రతను పెంచే కుర్చీలు





పిల్ల లంటే అల్లరి... అల్లరంటే పిల్లలు. కుదురుగా ఓ చోట కూర్చుంటేనా! కాళ్లకు చక్రాలు పరుగులు పెడతారు. వీళ్లెక్కడ పడి దెబ్బలు తగిలించుకుంటారోనన్న భయంతో అమ్మలూ ఆ రేసులో భాగం అవుతారు. గడుగ్గాయిలు ఎంత చెప్పినా వినరు సరికదా! వద్దన్న పనే చేస్తారు. భయపెట్టో, దండించో ఒక దగ్గర కూర్చోమన్నా... ఆ భయం ఎంత సేపు ఉండదు, నిమిషాల్లోనే యథాతథం. మీ పిల్లలూ అంతేనా? అలా అయితే వాళ్లకే 'సెన్సరీ చెయిర్లు' బహుమతిగా ఇచ్చి చూడండి. దూకుడు స్వభావం ఉన్న పిల్లల్ని శాంతపరచడానికి ఉపయోగపడతాయి. మృదువుగా, మెత్తగా ఉండి వాళ్లకు సాంత్వన ఇస్తాయి. మెదడును విశ్రాంతి మోడ్‌లోకి తీసుకువెళతాయి. ఈ సెన్సరీ కుర్చీల్లో చాలావరకూ ఎయిర్ ఫిల్లింగ్ టెక్నాలజీతో పనిచేసేవే కాబట్టి పిల్లలకు ఆటవస్తువులు గానూ ఉపయోగపడతాయి. సెల్ఫ్ రెగ్యులేషన్ అలవాటు అవుతుంది. చేస్తున్న పనిపై ఏకగ్రత పెరుగుతుంది. యాంగ్జయిటీ తగ్గి పిల్లలు ప్రశాంతంగా ఉండటానికీ ఉపయోగపడే తాయీ కుర్చీలు, పొజిషన్ సరిచేసేవి ఉన్నాయి. ఆన్‌లైన్ వేదికల్లో దొరుకుతున్నాయి. అవసరం అయితే వెతికేయండి మరి!



# నాని పుట్టినరోజున 'ది ప్యారడైజ్' రిలీజ్



నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం తన పాన్ వరల్డ్ సినిమా 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, SLV సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి భారీ కాన్వాస్ పై నిర్మిస్తున్నారు. టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ లుక్ పోస్టర్లు ఇప్పటికే సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు, మేకర్స్ బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. ఫిబ్రవరి 24న నాని పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక వేడుకలకు టీమ్ సిద్ధమవుతోంది. అదే రోజున చిత్రంలోని ఫస్ట్ సింగిల్ "ఆయా షేర్"ను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. గూస్‌బంప్స్ తెప్పించే ఈ ఇంట్రడక్షన్ ట్రాక్‌తో సినిమా ప్రమోషన్స్‌కు ఘనమైన ఆరంభం ఇవ్వబోతున్నారు మేకర్స్.ఈ పాటను వందలాది డ్యాన్సర్లతో భారీ సెట్లో చిత్రీకరించారు. నాని ఫియర్స్, మాస్సీ అవతార్‌లో కనిపించే ఈ సాంగ్ కోసం రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ పవర్‌ఫుల్ మాస్ ట్యూన్ అందించారు. ఈ చిత్రంలో మోహన్‌బాబు, బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయాల్, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.సిహెచ్ సాయి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తారు, నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తారు అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్.ది ప్యారడైజ్ తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, బెంగాల్, స్పానిష్, ఇంగ్లీష్ భాషలలో పాన్‌వరల్డ్ గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

# 'మరకతమణి 2' పూజా గ్రాండ్‌గా ప్రారంభం



2017లో విడుదలై తన మ్యాజికల్ కాన్సెప్ట్, కామెడీతో ఫాంటసీ కామెడీ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న చిత్రం మరకతమణి. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా సీక్వెల్ 'మరకతమణి 2' అధికారికంగా ప్రారంభమైంది. శివరాత్రి శుభ సందర్భంగా ఈ చిత్రం షూటింగ్ నిన్న (ఫిబ్రవరి 16, 2026) చెన్నైలో జరిగిన పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. హీరో కార్తీ క్లాప్ కొట్టగా, హీరో ఆర్య, దర్శకుడు వెంకట్ ప్రభు "కెమెరా రోలింగ్, యాక్షన్" అంటూ షూటింగ్ ప్రారంభించారు. యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీతో అనుబంధం వున్న అనేక మంది ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ప్యాషన్ స్టూడియోస్, దంగల్ టీవీ, ఆర్‌డిసి మీడియా, యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, గుడ్ షో బ్యానర్లపై సుధన్ సుందరం, మనీష్ సింఘాల్, దుర్గారం చౌదరి, దేవ్ కెవి దురై నిర్మిస్తున్న ఈ చిత్రానికి గత బ్లాక్ బస్టర్"మరకతమణి"కి దర్శకత్వం వహించిన ఎఆర్‌కె శరవణ్ దర్శకత్వం వహిస్తున్నారు. మరకతమణి 2లో ఆది పినిశెట్టి, సత్యరాజ్, ప్రియా భవాని శంకర్, నిక్కి గల్రానీ పినిశెట్టి, మునిష్కాంత్, ఆనందరాజ్, డానీ, అరుణ్‌రాజా కామరాజ్, మురుగానందం కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# తెర

## అనిల్ రావిపూడి క్లాప్‌తో సత్యదేవ్, ఫరియా అబ్దుల్లా నూతన చిత్రం



హీరో సత్యదేవ్ తన కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. సత్యదేవ్ నటిస్తున్న 15వ చిత్రమిది. ఈ చిత్రాన్ని త్రిశూల్ విజినరీ స్టూడియోస్ బ్యానర్ పై బి.నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. కంప్లీట్ ఎంటర్ టైనింగ్ స్క్రిప్ట్ తో దర్శకుడు లక్ష్మినారాయణ పుట్టంచెట్టి రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా నాయికగా నటిస్తోంది. ఈ రోజు హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ఈ మూవీ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవానికి బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా హాజరై హీరో హీరోయిన్లపై క్లాప్ ఇచ్చారు. యంగ్ ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. లక్ష్మినారాయణ పుట్టంచెట్టి ఫస్ట్ షాట్‌కు డైరెక్షన్ చేశారు. ఈ సందర్భంగా అతిథిగా వచ్చిన ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి మాట్లాడుతూ నా స్నేహితుడు ప్రొడ్యూసర్ నరేంద్ర మరో మంచి చిత్రాన్ని చేస్తున్నారు. హీరో సత్యదేవ్ గారు ఒక ఔట్ అండ్ ఔట్ ఎంటర్ టైనర్‌లో నటిస్తున్నారు.ఈ సినిమా ఆయనకు బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అవుతుంది.డైరెక్టర్ లక్ష్మి నారాయణ పుట్టంచెట్టి మాట్లాడుతూ మా సినిమా జానర్ ఏంటి అని అందరూ అడుగుతున్నారు. అందరి పెదాలపై నవ్వుల పూయించే చిత్రమిది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ కు వెళ్తున్నాం. రామ్ మిరియాల అన్న మా సినిమాకు మంచి మ్యూజిక్ చేస్తున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ రామ్ మిరియాల మాట్లాడుతూ మా అందరికీ ఇదొక బ్యూటిఫుల్ ప్రాజెక్ట్. సత్య అన్నతో వర్క్ చేయడం సంతోషంగా ఉంది.

# 'హే బల్‌వంత్' బ్లాక్‌బస్టర్ హిట్ : సుహాస్

ఇటీవల లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి, ఈషా వంటి బ్లాక్‌బస్టర్స్ చిత్రాలను అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం తాజాగా నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై "హే బల్‌వంత్' ( హే భగవాన్ చిత్రం టైటిల్ మార్పు) అనే ఫుల్‌లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ చిత్రంలో సుహాస్, శివానీ నాగారం, సీనియర్ నటుడు నరేష్, యాంకర్ స్రవంతి ప్రముఖ పాత్రల్ని పోషించారు. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీని ఫిబ్రవరి 20న రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రంకు సంబంధించి నాట్ ఏ టైటిల్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హీరో సందీప్ కిషన్ విచ్చేశాడు. ఈసందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ ఈ ఈవెంట్‌కు వచ్చినందుకు హ్యాపీగా ఉంది. వంశీ నందిపాటి పేరు గత కొన్నాళ్లుగా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ఆయన కాన్ఫిడెంట్ నచ్చుతుంది. సుహాస్ నాకు చాలా ఇష్టం. కథానాయకుడు సుహాస్ మాట్లాడుతూ నన్ను ఎప్పుడూ ఎంకరైజ్ చేసే హీరో సందీప్‌కిషన్‌కు నా కృతజ్ఞతలు. టీమ్ అంతా ఎంతో కష్టపడి ఈ సినిమా చేశారు. నా తోటి ఆర్టిస్టులు ఈ సినిమా కోసం ఎంతో హార్డ్ వర్క్ పెట్టారు. అన్నారు.



# 'బూకి' అందరూ రిలేట్ అయ్యే సినిమా : విజయ్ ఆంటోనీ



అజయ్ దిషన్, ధనుషా హీరో హీరోయిన్స్‌గా గణేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన యూత్ ఫుల్ ఎంటర్టైనర్ 'బూకి'. విజయ్ ఆంటోనీ సమర్పణలో శరవంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్స్ పై రామంజేయులు జవ్వాజీ నిర్మించారు. సునీల్, లక్ష్మిమంచు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే తమిల్‌లో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ ని అందుకుంది. తెలుగులో ఈ సినిమా ఫిబ్రవరి 20న గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ప్రెస్ మీట్ లో మూవీ ప్రజెంటర్, మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఈ వేడుకకు మంచు లక్ష్మి గారు రావడం చాలా ఆనందంగా ఉంది. యాక్ట్రెస్ మంచు లక్ష్మి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. గత శుక్రవారం ఈ సినిమా తమిళ్లో రిలీజ్ అయ్యి అద్భుతమైన రెస్పాన్స్ ని అందుకుంది. ఇది యూనివర్సల్‌గా కరెక్ట్ అయ్యే సిని. మా అజయ్ ధనుషా ఇలా మంచి టీంతో కలిసి చేసిన సినిమా ఇది. విజయ్ గారు ఒక సినిమాకి మ్యూజిక్ ఇస్తున్నారంటే ఆ కంటెంట్ అద్భుతంగా ఉంటుంది. హీరో అజయ్ దిషన్ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. మార్గన్‌లో నా నటన ఇష్టపడడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. హీరోయిన్ ధనుషా మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఇది నా ఫస్ట్ సినిమా. హీరోయిన్ అవకాశం ఇచ్చిన విజయ్ ఆంటోనీ గారికి థాంక్యూ. డైరెక్టర్ గణేష్ చంద్ర మాట్లాడుతూ.. నాకు తెలుగు అనుబంధం వుంది. నేను తమిళ్ అబ్బాయిని. విజయవాడ అమ్మాయిని పెళ్లి చేసుకున్నాను. నాకు ఈసినిమా అవకాశం ఇచ్చిన విజయ్ ఆంటోనీ గారికి థాంక్యూ. రైటర్ భాష్యశ్రీ మాట్లాడుతూ.. మనం ప్రేమించిన అమ్మాయిని ముద్దుగా పిలుచుకునే పేరు బూకి. బ్రేకప్ తో ఈ సినిమా మొదలవుతుంది.

# 'అమ్మా.. నాకు ఆ అబ్బాయి కావాలి' పాటల రికార్డింగ్ పూర్తి

'అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి"..
పాటల రికార్డింగ్ పూర్తి!!
సంగీత సంచలనం సాయి



కార్తీక్ స్వర సారధ్యంలో చిత్ర దర్శకుడు శివాల ప్రభాకర్ సింగిల్ కార్డు సాహిత్యం!!.. జి.ఎస్.ఆర్.మూవీ మేకర్స్ పతాకంపై పవన్ మహావీర్ ను హీరోగా పరిచయం చేస్తూ... ప్రముఖ మహిళా వ్యాపారవేత్త జి.శైలజారెడ్డి నిర్మిస్తున్న ముక్కోణపు ప్రేమకథాచిత్రం "అమ్మా... నాకు ఆ అబ్బాయి కావాలి".శివాల ప్రభాకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ వినూత్న ప్రేమ కథాచిత్రం షూటింగ్‌కి ముందే పాటల రికార్డింగ్ పూర్తి చేసుకుని సంగీత సౌరభాలు వెదజల్లుతోంది. పవన్ మహావీర్ సరసన సుహాన జంటగా నటిస్తున్న ఈ చిత్రంలోని మరో హీరోయిన్‌ను త్వరలో రివీల్ చేస్తారు!! ప్రముఖ సంగీత దర్శకుడు సాయి కార్తీక్ స్వర సారధ్యంలో... దర్శకుడు శివాల ప్రభాకర్ సమకూర్చిన సాహిత్యానికి సుప్రసిద్ధ గాయనీ గాయకులు చిత్ర, హారిణి, బృంద, అరుణ్, సాయి చరణ్, కృష్ణ తేజస్వి గాత్ర మందించారు. జి.ఎస్.ఆర్.మూవీ మేకర్స్ అధినేత్రి శ్రీమతి జి.శైలజా రెడ్డి మాట్లాడుతూ.. "మా దర్శకుడు శివాల ప్రభాకర్ ఒక యజ్ఞంలా ఈ చిత్ర రూపకల్పన బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



# రంజీ ట్రోఫీ ఫైనల్‌కు జమ్మూ కాశ్మీర్

## 6 వికెట్లు తేడాతో బెంగాల్ ఓటమి

**న్యూఢిల్లీ:** బెంగాల్‌ను ఓడించి జమ్మూ కాశ్మీర్ తొలి రంజీ ట్రోఫీ ఫైనల్‌కు చేరుకుంది. బుధవారం బెంగాల్ క్రికెట్ అకాడమీ మైదానంలో జరిగిన సెమీఫైనల్‌లో నాలుగో రోజు బెంగాల్‌పై 6 వికెట్ల తేడాతో జమ్మూ కాశ్మీర్ విజయం సాధించింది. సీమ్‌బౌలింగ్ ఆల్ రౌండర్ ఔకిబ్ నబీ మరోసారి అవకాశాన్ని అందిపుచ్చుకుని సునీల్ కుమార్ తో కలిసి 4 వికెట్లు పడగొట్టాడు.

బెంగాల్ తన రెండవ ఇన్నింగ్స్‌లో 99 పరుగులకే ఆలౌటైంది. గెలవడానికి 126 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన జమ్మూ కాశ్మీర్ 34.4 ఓవర్లలోనే ఛేదించింది. వంశజ్ శర్మ, అబ్దుల్ సమద్ వరుసగా 43 మరియు 30 పరుగులతో అజేయంగా నిలిచారు. మహమ్మద్ షమీ, ఆకాష్ దీప్ త్వరగానే గోల్ చేసి శుభమ్ పుండిర్ (27), కెప్టెన్ పరాస్ డోగ్రా (తొమ్మిది)లను అవుట్ చేశారు. కానీ సమద్ ఎదురుదాడి, షాబాజ్ అహ్మద్ బౌలింగ్‌లో వరుసగా రెండు భారీ సిక్సర్లు బాదడంతో జమ్మూ కాశ్మీర్ తిరిగి ఆధిక్యంలోకి వచ్చింది. సూరజ్ సింధు జైస్వాల్ మూడు బౌండరీలు కొట్టిన తర్వాత, శర్మ ముఖేష్ కుమార్ సిక్స్ కొట్టి విజయాన్ని నమోదు చేశాడు. కాగా ఈ నెల 24 నుండి 28 వరకు జరిగే టైటిల్ పోరులో జమ్మూ కాశ్మీర్ ఇప్పుడు కర్ణాటకతో తలపడనుంది.







# టి20 వరల్డ్ కప్: దక్షిణాఫ్రికా ఘన విజయం

## టోర్నీ నుండి యుఎఇ ఔట్

**న్యూఢిల్లీ:** యూఏఈతో జరిగిన టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన యూఏఈ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. అనంతరం ఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 13.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా బ్యాటర్లలో డెవాల్డ్ బ్రెవిస్ (36), ర్యాన్ రికెల్టన్ (30), ఐడెన్ మార్క్రమ్ (28) రాణించారు. యూఏఈ బౌలర్లలో హైదర్ అలీ, జవాదుల్లా, అర్ఫాన్, ఫారుఖ్ తలో వికెట్ తీసుకున్నారు. టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన యూఏఈ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. దీంతో దక్షిణాఫ్రికా ముందు 123 పరుగుల లక్ష్యం నిలిచింది.యూఏఈ బ్యాటర్లలో అలీషన్ షరాఫు (45; 38 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. కెప్టెన్ ముహమ్మద్ వసీం (22; 12 బంతుల్లో 4 ఫోర్లు) వేగంగా ఆడాడు. ఆర్యన్ష్ శర్మ (13), ముహమ్మద్ అర్ఫాన్ (11) మినహా మిగిలిన వారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కార్బిన్ బాష్ మూడు వికెట్లు పడగొట్టాడు. అన్రిచ్ నోర్జ్టే రెండు వికెట్లు తీశాడు.జార్జ్ లిండే ఓ వికెట్ సాధించాడు.




**న్యూఢిల్లీ:** భారత ఓపెనర్ అభిషేక్ శర్మ ఇటీవలి ఫామ్ ఆందోళనలు ఉన్నప్పటికీ బ్యాటర్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో తన ఆధిక్యాన్ని నిలుపుకున్నాడు, వికెట్ కీపర్‌బ్యాటర్ ఇషాన్ కిషన్ తాజా ర్యాంకింగ్స్ టాప్ 10లోకి ప్రవేశించాడు. టీ20 ప్రపంచ కప్‌లో అభిషేక్ ఇప్పటివరకు మంచి ప్రదర్శన చేయలేదు అయినా ఈ యువ ఓపెనర్ బ్యాటింగ్‌లో తన ఆధిక్యాన్ని నిలబెట్టుకోగలిగాడు. అలాగే టీ20 ప్రపంచ కప్‌లో వరుసగా రెండో హాఫ్ సెంచరీ సాధించిన ఇషాన్, కేవలం 40 బంతుల్లో 77 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్న తర్వాత 17 స్థానాలు ఎగబాకి ఎనిమిదో స్థానంలో నిలిచాడు. కాండీలో ఆస్ట్రేలియాపై అద్భుతమైన సెంచరీ సాధించిన తర్వాత శ్రీలంక హార్డ్ హిట్టర్ పాతుమ్ నిస్సాంక మూడు స్థానాలు ఎగబాకి బ్యాటర్ల జాబితాలో మూడవ స్థానానికి చేరుకున్నాడు. టీ20 ప్రపంచకప్‌లో మంచి ఇన్నింగ్స్‌లు ఆడటంతో దక్షిణాఫ్రికా ద్వయం ర్యాన్ రికెల్టన్ (22 స్థానాలు ఎగబాకి 11వ స్థానానికి), ఐడెన్ మార్క్రామ్ (ఆరు స్థానాలు ఎగబాకి 15వ స్థానానికి), అమెరికాకు చెందిన సాయితేజా ముక్కమల్లా (16 స్థానాలు ఎగబాకి 21వ స్థానానికి), ఇంగ్లాండ్ యువ ఆటగాడు జాకబ్ బెథెల్ (22 స్థానాలు ఎగబాకి 32వ స్థానానికి) బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మెరుగుపరచుకున్నాడు. ప్లేయర్ ర్యాంకింగ్స్‌లో పాకిస్తాన్‌కు చెందిన సైమ్ అయూబ్ మరోసారి అగ్రస్థానానికి ఎగబాకాడు. బౌలర్ ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ ఒక స్థానం మెరుగుపడి మొత్తం మీద రెండవ స్థానానికి చేరుకుని, భారత ప్రత్యర్థి వరుణ్ చక్రవర్తికి దగ్గరగా ఉన్నాడు. టి20 ప్రపంచకప్‌లో వరుసగా మూడు వికెట్లు తీసిన జింబాబ్వే పేసర్ బ్రాడ్ ఎవాన్స్ 10 స్థానాలు ఎగబాకి ఐదో స్థానానికి చేరుకున్నారు, భారత జత అక్షర్ పటేల్ (నాలుగు స్థానాలు ఎగబాకి 14వ స్థానానికి), జస్ప్రీత్ బుమ్రా (ఆరు స్థానాలు ఎగబాకి 15వ స్థానానికి), ఐర్లాండ్ స్పిన్నర్ మాథ్యూ హంఫ్రీస్ (23 స్థానాలు ఎగబాకి 23వ స్థానానికి) కూడా ఉన్నారు.

# ఢిల్లీ ఓపెన్‌లో.. దూసుకుపోతున్న సుమిత్



**న్యూఢిల్లీ:** 2026 ఢిల్లీ ఓపెన్ ఎటిపి 75 ఛాలెంజర్ ఈవెంట్‌లో భారత అగ్రశ్రేణి ఆటగాడు సుమిత్ నాగల్ పురుషుల సింగిల్స్ ఈవెంట్‌లో రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. ప్రపంచ ర్యాంక్‌లో 297వ స్థానంలో ఉన్న నాగల్, మొదటి సెట్ ప్రారంభ గేమ్‌లో స్పెయిన్‌కు చెందిన డేవిడ్ జోర్డా సాంచిస్‌ను అధిగమించి 6-3తో తన ఆధిక్యాన్ని కొనసాగించాడు. రెండవ సెట్ మరింత పోటీతత్వాన్ని నిరూపించింది, 11వ గేమ్‌లో భారత ఆటగాడు నిర్ణయాత్మక బ్రేక్ సాధించే వరకు ఇద్దరు ఆటగాళ్లు సర్వీస్‌ను నిలుపుకున్నారు. ఒక గంటా 27 నిమిషాల్లో 6-3, 7-5తో మ్యాచ్‌ను ముగించాడు. టోర్నమెంట్ చరిత్రలో ఏకైక హోమ్ సింగిల్స్ ఛాంపియన్‌గా నిలిచిన సోమ్‌దేవ్ దేవ్‌వర్మన్ తర్వాత ఢిల్లీ ఓపెన్‌లో తొలి భారత సింగిల్స్ విజేతగా నిలిచేందుకు నాగల్ లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఇక ఆస్ట్రేలియాకు చెందిన టాప్ సీడ్ డేన్ స్వీనీ తన ప్రారంభ రౌండ్ మ్యాచ్‌లో కజకిస్తాన్‌కు చెందిన బీబిట్ జుగాయేవ్ చేతిలో ఓడిపోవడం పెద్ద సంచలనం సృష్టించింది. ప్రపంచ ర్యాంక్‌లో 292వ స్థానంలో ఉన్న జుకోయేవ్, ఒక సెట్ పరాజయం తర్వాత టాప్ సీడ్ మరియు ప్రపంచ 134వ స్థానంలో ఉన్న డేన్ స్వీనీని 6-7 (6), 6-2, 6-2తో ఓడించాడు.

# ఖతార్ ఓపెన్‌లో సత్తా చాటుతున్న అల్కరాజ్

**న్యూఢిల్లీ:** ఖతార్ ఓపెన్ 2026లో కార్లోస్ అల్కరాజ్ సత్తా చాటుతున్నాడు. తొలి రౌండ్‌లో ఆర్థర్ రిండర్‌క్నేచ్‌ను 6-4, 7-6 (7/5) తేడాతో ఓడించి ఆస్ట్రేలియన్ ఓపెన్ విజయం తర్వాత కార్లోస్ అల్కరాజ్ తిరిగి ఖతార్ ఓపెన్‌లో దూసుకుపోతున్నాడు. మెల్‌బోర్న్‌లో విజయంతో కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేసిన అతి పిన్న వయస్కుడిగా నిలిచిన అల్కరాజ్, 30వ ర్యాంక్‌లో ఉన్న రిండర్‌క్నేచ్‌ను రెండు సెట్లలో ఓడించాడు. ఐదవ గేమ్‌లో బ్రేక్ చేసిన తర్వాత అల్కరాజ్ మొదటి సెట్‌ను కైవసం చేసుకున్నాడు. కానీ రిండర్‌క్నేచ్ నుండి గట్టి ప్రతిఘటనను ఎదుర్కొన్నాడు, అతను మ్యాచ్‌లో తన మొదటి బ్రేక్ పాయింట్లను సాధించాడు, టాప్ సీడ్ రెండవ సెట్‌లో టైబ్రేక్‌తో వత్తిడి తీసుకొచ్చాడు. టైబ్రేక్‌లో మ్యాచ్ పాయింట్ వద్ద ఫోర్‌హ్యాండ్‌ను బద్దలు కొట్టి విజయంతో ముగించాడు. ఇక అల్కరాజ్ ప్రధాన ప్రత్యర్థి జానిక్ సిన్నర్ డ్రాలో మరో వైపు ఉన్నాడు. డచ్‌కు చెందిన జెస్పర్ డి జోంగ్‌పై 6-4, 6-3 తేడాతో విజయం సాధించి రుబ్లెవ్ రెండో రౌండ్‌లో తన స్థానాన్ని బుక్ చేసుకున్నాడు. జపాన్‌కు చెందిన షింటారో మోచిజుకిని ఓడించడానికి ఏడో సీడ్ ఖచనోవ్‌కు మూడు సెట్లు అవసరం కాగా, స్టెఫానోస్ సిట్సిపాస్ ట్యునీషియా వైల్డ్ కార్డ్ మోయెజ్ ఎచార్గుయ్‌ను ఓడించాడు.



# పాకిస్థాన్ సంచలన విజయం

## 102 పరుగులతో నమీబియా ఓటమి

**న్యూఢిల్లీ:** పొట్టి ప్రపంచకప్‌లో భారత జట్టు చేతిలో కంగుతిన్న పాకిస్థాన్ నాకౌట్ ఆశల్ని నిలబెట్టుకుంది. చివరి లీగ్ మ్యాచ్‌లో నమీబియాపై భారీ స్కోర్ చేసిన పాక్ సునాయస విజయంతో సూపర్ 8కు దూసుకెళ్లింది. ఓపెనర్ షహిబ్జద ఫర్హాన్(100) మెరుపు సెంచరీకి మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారిఖ్(416) మ్యాజిక్ తోడవ్వగా 102 పరుగుల తేడాతో నమీబియాను మట్టికరిపించింది. 200 పరుగుల ఛేదనలో పసికూనను పడగొట్టింది. పాక్‌కు భారీ స్కోర్ సమర్పించుకున్న నమీబియా భారీ ఛేదనలో ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. టీమిండియాపై సున్నాకై ఔటైన ఓపెనర్ షహిబ్జద ఫర్హాన్(100 :58 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్సర్లు) నమీబియాపై చెలరేగిపోయాడు. సయీం ఆయూబ్(14) విఫలమైనా, దూకుడే మంత్రగా బౌండరీలతో విధ్వంసం సృష్టించాడు ఫర్హాన్. చివరి ఓవర్ వరకూ నిలబడి సెంచరీతో జట్టుకు కొండంత స్కోర్ అందించాడు. సల్మాన్ అఘా(38), షాదాబ్ ఖాన్(36 నాటౌట్)లు సైతం రాణించగా 3 వికెట్ల నష్టానికి పాక్ నిర్ణీత ఓవర్లలో 199 పరుగులు చేసింది. వరల్డ్‌కప్ చరిత్రలో మూడో అత్యధిక స్కోర్‌తో నమీబియాకు సవాల్ విసిరింది సల్మాన్ అఘా సేన. ఇక నమీబియా ఓపెనర్లు లౌరెన్ స్టీన్‌కాంప్(23), జన్ ఫ్రైలింక్(9)లు దూకుడగా ఆడారు. కానీ, సల్మాన్ మిర్జా ఈ జోడీని బ్రేకిచ్చాడు. ఆ తర్వాత బంతి అందుకున్న ఉస్మాన్ తారిఖ్(416), షాదాబ్ ఖాన్(319)లు వికెట్ల వేటతో ప్రత్యర్థి బ్యాటర్లను హడలెత్తించారు. వీరిద్దరి విజృంభణతో అలెగ్జాండర్ వొల్ఫ్‌చెంక్(20) మినహా మిడిలార్డర్‌లో ఏ ఒక్కరూ రెండంకెల స్కోర్ చేయలేదు. చివరి బ్యాటర్‌ను తారిఖ్ ఔట్ చేయగా నమీబియా 97 పరుగులకే ఆలౌటయ్యింది. దాంతో 102 పరుగుల భారీ తేడాతో గెలుపొందిన పాక్ సూపర్ 8కు క్వాలిఫై అయింది.

# మార్కెట్‌లోకి మూడు ఐపిఒలు

## 23 నుంచే బిడ్డింగ్




**ముంబయి, ఫిబ్రవరి 18:** మార్కెట్‌లోకి ఈనెల 23వ తేదీ మూడుఐపిఒలు రాబోతున్నాయి.క్లీన్‌మాక్స్ సంస్థ 3100 కోట్ల సమీకరణకు ఐపిఒకు వస్తుంటే మొబిలైజ్ యాప్ కూడా 23నే ఐపిఒకకు వస్తోంది. అదేవిధంగా శ్రీరామ్ ట్విస్టెక్స్ ఐపిఒ కూడా ఈనెల 23వ తేదీనే రానున్నది. క్లీన్‌మాక్స్ సంస్థ ఇష్యూధరలను రూ.1000 నుంచి రూ.1053గా నిర్ణయించారు. మొత్తం కంపెనీ విలువలు 12,325 కోట్లుగా అంచనావేసారు. యాంకర్ ఇన్వెస్టర్లకు 20వ తేదీనుంచే బిడ్డింగ్ తెరుస్తారు. రూ.1200 కోట్లమేర నిధులసమీకరణకు షేర్లు జారీచేస్తారు. ఆఫర్‌ఫర్‌సేల్ కింద 1900 కోట్లు ప్రమోటర్లు కూడా వాటా జారీ ఉంటుందని క్లీన్‌మ్యాక్స్ తెలిపింది. ఐపిఒ సైజును 5200 కోట్లనుంచి కొంతమేర తగ్గించి 1200 కోట్లకే పరిమితంచేసింది. అదేవిధంగా మొబిలైజ్ యాప్ ఐపిఒ కూడా 23వ తేదీనే ఓపెన్ అవుతోంది. కంపెనీ 20.10 కోట్లు సమీకరించాలనినిర్ణయించింది. తాజాగా 2.5 మిలియన్ల షేర్లనుజారీచేస్తోంది. ఇష్యూధర రూ.75 నుంచి రూ.80వరకూ నిర్ణయించింది. లాట్ ఇనిషియల్‌సైజ్ 1600 షేర్లుగా నిర్ణయించింది. రిటైల్ ఇన్వెస్టర్ 2.56 లక్షలు రెండు స్లాట్‌లకు బిడ్ వేయాల్సి ఉంటుంది. అంటే కనీసం 3200 షేర్లు కొనుగోలుచేయాలి. ఇక శ్రీరామ్ ట్విస్టెక్స్ సోమవారంనుంచి బిడ్డింగ్ ఓపెన్ అవుతుంది. కాటన్ నూలు ఉత్పత్తి సంస్థ అయిన ట్విస్టెక్స్ 110.24 కోట్లు సమీకరించాలనినిర్ణయించింది. ఇందుకోసం 10.6 మిలియన్‌ల షేర్లను జారీచేస్తోంది. ఇష్యూధర రూ.95 నుంచి రూ.104గా కొనసాగుతోంది.

వాణిజ్యం





# ఏఐలో దూసుకు పోతున్న భారత్

## మీడియాతో సుందర్ పిచాయ్ చిట్‌చాట్

**కాలిఫోర్నియా, ఫిబ్రవరి 18:** గూగుల్, ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ భారత్ లో జరుగుతున్న అంతర్జాతీయ ఏఐ సదస్సు సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏఐ సమ్మిట్ సందర్భంగా మన మీడియాతో ఆయన కాలిఫోర్నియా నుంచి వర్చువల్ గా మాట్లాడుతూ భారత్ తో గూగుల్ భవిష్యత్ భాగస్వామ్యం గురించి స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. భారత ఏఐ ప్రయాణంలో గూగుల్ భాగస్వామి కావాలనుకుంటోంది. ఏఐ వినియోగంతో మరికొన్నేళ్లలో భారత్ మరింత ముందుకు వెళ్తుందని నేను నమ్ముతున్నాను. అందుకే ఇండియాతో భాగస్వామిగా ఉండాలనే స్పష్టమైన ఆశయంతో ఉన్నాం. భారత్ లో మౌలిక సదుపాయాలు, స్థిరమైన పెట్టుబడులు, డేటా సెంటర్ల ఏర్పాటు, స్థానిక భాగస్వాములతో పరిశోధనలు, యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించడంపై గూగుల్ దృష్టి సారిస్తోంది.

భారత్ లో క్లౌడ్ రీజియన్ స్థాపన కోసం రిలయన్స్ జియోతో కలిసి పనిచేస్తున్నాం. రాజస్థాన్ లో 150 మెగావాట్ల పునరుత్పాదక ఎనర్జీ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నాం. అదానీ, క్లీన్‌మాక్స్ వంటి సంస్థల భాగస్వామ్యంతో డేటా సెంటర్ల విస్తరణ జరుగుతోంది. భారత వినియోగదారుల కోసం ఏఐ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నాం. ఏఐ సదస్సు కోసం భారత్ కు రావడం తనకు చాలా సంతోషంగా ఉందని ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. శుక్రవారం ఏఐ సమ్మిట్ లో ఆయన ప్రసంగించనున్నారు.

# లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

## ఐటి ఒత్తిళ్లున్నా బ్యాంకింగ్ మెటల్ ఎఫ్ఎంసిజిల మద్దతు




**ముంబయి, ఫిబ్రవరి 18:** ఐటీ రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగినప్పటికీ, దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. బ్యాంకింగ్, మెటల్, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో కొనుగోళ్లు భారీగా పెరిగి మార్కెట్లకు అండగా నిలిచాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 283 పాయింట్లు పెరిగి 83,734 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 93 పాయింట్లు లాభపడి 25,819 వద్ద నిలిచింది. నిఫ్టీ లాభాల్లో ముగియడం ఇది వరుసగా మూడో సెషన్ కావడంవిశేషం. రంగాల వారీగా నిఫ్టీ ఐటీ సూచీ 1.23 శాతం నష్టపోగా, మిగిలిన అన్ని సూచీలు గ్రీన్ మార్క్‌లో ముగిశాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, మెటల్, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు వరుసగా 1.21 శాతం, 1.33 శాతం, 1.31 శాతం చొప్పున లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్లు కూడా సూచీలకు అనుగుణంగానే రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.50 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.54 శాతం లాభపడ్డాయి. ఉదయం సెషన్‌లో నష్టాల్లోకి జారుకున్న మార్కెట్లు, మధ్యాహ్నం తర్వాత బలమైన రికవరీ కనబరిచాయి. సెన్సెక్స్ తన కనిష్ట స్థాయి అయిన 83,206 నుంచి 585 పాయింట్లకు పైగా పుంజుకుంది. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) నుంచి పెట్టుబడులు నిలకడగా కొనసాగడం మార్కెట్లకు బలమైన మద్దతు ఇచ్చినట్లు అంచనా. దేశీయ వృద్ధి అవకాశాలపై ఉన్న సానుకూల దృక్పథంతో సెంటిమెంట్ బలంగానే ఉందని వారు తెలిపారు. మరోవైపు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 2 పైసలు స్వల్పంగా బలహీనపడి 90.66 వద్ద ట్రేడ్ అయింది. బీఎస్‌ఈలో 2,110 షేర్లు లాభపడగా, 1,916 షేర్లు నష్టపోయాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్స్ ఏప్రిల్‌రెండునాటి సెటిల్‌మెంట్లు 0.74శాం లాభపడి రూ.1,52,541గా ముగిసాయి. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడిచమురు 41 సెంట్లుపెరిగి బ్యారెల్‌కు 67.83 డాలర్లుగా కొనసాగింది.



# రూ.2 లక్షలకోట్లకు టెక్నాలజీ మార్కెట్‌క్యాప్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** భారత్ వచ్చే దశాబ్దంలోపు టెక్నాలజీరంగంలో రెండులక్షల కోట్ల డాలర్ల మార్కెట్ విలువలకు పెరుగుతుందని భారీ కంపెనీలు వస్తున్నాయని, దేశ ఆర్థిక ముఖచిత్రమే మారిపోతుందని వెంచర్‌క్యాపిటల్‌సంస్థ యాక్సెల్ వెల్లడించింది. ఎఐ ఇంపాక్ట్ సదస్సులో మాట్లాడుతూ యాక్సెల్ భాగస్వామి ప్రయాంక్ స్వరూప్ మాట్లాడుతూ టెక్నాలజీ కంపెనీలుప్రస్తుతం నాలుగునుంచి ఐదుశాం మాత్రమే వాటాతో ఉన్నాయని, భారత్ మొత్తం కంపెనీల మార్కెట్ మూలధన విలువల్లో అతితక్కువ వాటాతో ఉన్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఈ వాటా వచ్చే పదేళ్లలో 15 నుంచి 20శాతానికి పెరుగుతుందని ఆయన ధీమా వ్యక్తంచేసారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పరంగా భారత్‌మరింత ముందుకు వెళుతున్న క్రమంలోరానున్న కాలంలో 100 బిలియన్ డాలర్లమేర కంపెనీలు వస్తాయని స్వరూప్ అంచనావేసారు. టెక్నాలజీ రంగంలో పెట్టుబడులకు ఇదే మంచి అవకాశమని, ఇటు భారత్‌కు అటుప్రపంచానికిసైతం పెట్టుబడుల్లో టెక్నాలజీరంగం ఇపుడు కీలకం అవుతుందని అంచనావేసారు. ఎఐఅనేది ఇపుడుకీలకంగా మారిందని, రానున్న రోజుల్లో మరింత వేగంగా రూపుదిద్దుకుంటుందని అన్నారు. స్టార్టప్‌లు బిల్డ్‌ఫర్‌భారత్‌గా ముందుకురావాలని, అందుబాటు స్థాయిలోపరిష్కారాలు చూపించాల్సి ఉంటుందన్నారు.హెల్త్‌కేర్, విద్యారంగంలో ప్రతి ఒక్కరికీ వ్యయ భారం తగ్గించాల్సిన అవసరం ఉందని, అందువల్లనే ఈ రంగాల బిజినెస్‌లలో తాము పెట్టుబడులుపెడుతున్నట్లు యాక్సెల్‌భాగస్వామి అన్నారు. హెల్త్‌కేర్, విద్య, ఫైనాన్షియల్‌ప్లానింగ్ ఇపుడు కీలకంగా మారాయన్నారు. ఎఐ సాయంతో ఈ రంగాలేకాకుండా అనేక రంగాల్లో ప్రతిభా వంతులు కావచ్చని ఆయన అన్నారు.




# నవీముంబయి ఎయిర్‌పోర్టులో ఫెడెక్స్ గ్లోబల్ కార్గో హబ్

**ముంబయి, ఫిబ్రవరి 18:** గ్లోబల్ ఎయిర్ లాజిస్టిక్స్ సంస్థ ఫెడెక్స్ నవీముంబయి అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో పూర్తిస్థాయి ఆటోమేటెడ్ ఎయిర్‌కార్గోను ఏర్పాటుచేస్తోంది. ఇందుకోసం రూ.2500 కోట్లు పెట్టుబడులు పెడుతున్నట్లుప్రకటించింది. ఈ కొత్త కార్గో హబ్‌ను ఆదాని ఎయిర్‌పోర్టు హోల్డింగ్స్‌తో కలిసి నిర్వహిస్తోంది. వచ్చే రెండేళ్లపాటు అత్యాధునిక కార్గో నిర్వహణ వ్యవస్థను ఫెడెక్స్ నిర్వహిస్తుంది. ఎయిర్‌పోర్టు ఆవరణలో దీర్ఘకాలిక పెట్టుబడులు 250 మిలియన్ డాలర్లకుసైతం పెరుగుతుందని, మూడు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ గ్లోబల్ కార్గో హబ్ డిజైన్‌చేసినట్లు తెలిపారు. దీనితోభారత్‌ను ఆగ్నేయాసియా, పశ్చిమాసియా, యూరోప్, అమెరికాలకు కనెక్టివిటీ మరింతపెరుగుతుందని కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌రాజ్ సుబ్రహ్మణియన్ అన్నారు. అలాగే ప్రపంచానికి లాజిస్టిక్స్ గేట్‌వేగా కూడా నవీముంబయి ఫెడెక్స్ కార్గోహబ్ పనిచేస్తుందన్నారు. ఆదాని ఎయిర్‌పోర్టు హోల్డింగ్స్ డైరెక్టర్ జీత్ ఆదాని మాట్లాడుతూ కొత్తఎయిర్‌పోర్టులో సమీకృతమౌలిక వనరులన్నింటినీకల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పశ్చిమభారత్ అంతర్జాతీయ ట్రేడ్ కారిడార్‌ను పటిష్టంచేసి మల్టీమోడల్ కనెక్టివిటీని కలిగి ఉంటుందని, దీనివల్ల ఆరువేలకుపైగా ప్రత్యక్ష పరోక్ష ఉపాధి లభిస్తుందన్నారు. లాజిస్టిక్స్, గోదాములు, రవాణా ఇతర అనుబంధ సేవల్లోఉపాధి మరింతపెరుగుతుందన్నారు. ప్రస్తుతం 0.5 మిలియన్ టన్నులు సాలీనా కార్గో నిర్వహణ జరుగుతోందని కొత్త హబ్‌తో సుమారు 3.2 మిలియన్ టన్నులకు పెరుగుతుందని ఫెడెక్స్ చీఫ్ తెలిపారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.